ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
మహబూబ్‌నగర్ : fb.com/vaartha Digital
Published from Mahabubnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
23-7-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 173 పేజీలు: 10+4 వెల: 6.50

దేశంలో ముగిసిన ప్రజాస్వామ్యం: ప్రియాంక
ప్రధాని మోడీతో పవార్, సుప్రియ భేటీ 5

# 'లీక్' మంటలు
## దద్దరిల్లిన పార్లమెంటు


పార్లమెంటు వద్ద బుధవారం ఆందోళన చేస్తున్న విపక్ష ఎంపీలు


రాజ్యసభలో కేంద్రమంత్రి రిజిజు


రాజ్యసభలో ఖర్గే

### 'నీట్'పై చర్చకు ఒప్పుకొన్న కేంద్రం
కేంద్ర మంత్రి ధర్మేంద్ర రాజీనామా చేస్తేనే చర్చలన్న ఖర్గే
### విపక్షాల ఆందోళనలతో ఉభయ సభల్లో రభస.. నేటికి వాయిదా

**న్యూఢిల్లీ,జులై 22:** నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం, అలాగే సోమవారం నిర్వహించిన బసంసద్ చలో నిరసన సందర్భంగా విద్యార్థులపై పోలీసులు వ్యవహరించిన తీరుపై ప్రతిపక్ష సభ్యుల ఆందోళనలతో బుధవారంకూడా పార్లమెంట్ ఉభయ సభలు తీవ్ర తీవ్రస్థాయి నిరసనల హోరులో కొనసాగాయి. కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై సుదీర్ఘ చర్చకు సిద్ధంగా ఉన్నట్లు మరోసారి స్పష్టం చేసినప్పటికీ, నిరసనలు కొనసాగడంతో లోక్‌సభ, రాజ్యసభ రోజంతా వాయిదా పడ్డాయి.లోక్‌సభలో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు మాట్లాడుతూ, నీట్ పేపర్ లీక్ అంశంపై ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉందని తెలిపారు. అయితే చర్చ ఏ నిబంధన కింద, ఎప్పుడు, ఎంతసేపు నిర్వహించాలన్నది అన్ని పార్టీల >>2



బుధవారం కొడంగల్‌లో సిఎం ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ర్యాలీ దృశ్యం


ధర్నాలో మాట్లాడుతున్న సిఎం రేవంత్


# పాశవిక దాడులా?
### హక్కులను కాలరాస్తున్న కేంద్రం
రాహుల్ గాంధీ రక్తం చిందింది..
దేశాన్ని దోచుకొంటున్న బిజెపి
కెసిఆర్ బినామీ సంస్థలపై బిజెపికి ఎందుకంత ప్రేమ?: కొడంగల్ ధర్నాలో సిఎం రేవంత్

**కొడంగల్,జులై 22ప్రభాతవార్త:** నీట్ పేపర్ లీక్‌పై పోరాటం చేస్తున్న విద్యార్థులకు మద్దతుగా నిలిచిన రాహుల్‌గాంధీ,ప్రియాంక గాంధీపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు.శాంతియుతంగా నిరసన తెలిపితే పాశవిక దాడులు చేస్తారా అంటూ ప్రశ్నించారు.కేంద్ర ప్రభుత్వ వైఖరి,పోలీసుల పాశవిక దాడులపై వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో ముఖ్యమంత్రి నాయకత్వంలో బుధవారం బారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు.నీట్ పరీక్ష పేపర్ లీక్‌తో బీజేపీ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్ధకంగా మార్చిందని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు.బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రశ్న పత్రాలను అమ్ముకొని బీజేపీ నాయకులు విద్యార్థుల >>2

## గత పదేళ్లలో 152 పేపర్లు లీక్
విద్యార్థులు న్యాయంగా పోరాడుతుంటే అణిచేస్తారా?: రాహుల్



**న్యూఢిల్లీ:** గత పదేళ్లలో 152 పేపర్లు లీక్ అయ్యాయని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. అయితే >>2


ఢిల్లీలో 'కాక్రోచ్' నేతల ఆందోళన దృశ్యం

## చర్చలకు కేంద్ర మంత్రులే రావాలి
జంతర్‌మంతరైనా సరే.. మరెక్కడైనా ఓకే..: 'కాక్రోచ్' నేతల డిమాండ్

**న్యూఢిల్లీ,జులై 22:** కేంద్రంతో చర్చలకు మేము సిద్ధమేనని సీజేపీ పార్టీ మరోసారి స్పష్టం చేసింది. అయితే చర్చల కోసం తాము ఎవరి ఇంటికి వెళ్లబోమని తెలిపింది. ఈ మేరకు ఇవాళ కాక్రోచ్ జనతా పార్టీ >>2

కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో
## లీకులు లేవా?
విద్యార్థుల నిరసనలను రాజకీయాలకు వాడుకోవద్దు
రాహుల్ ఆరోపణలపై కేంద్రమంత్రి నడ్డా కౌంటర్



**న్యూఢిల్లీ,జులై 22:** నీట్ పరీక్ష పేపర్ లీక్ వ్యవహారంపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై >>2

# అట్టుడికిన తెలంగాణ



హైదరాబాద్‌లో కాంగ్రెస్ ర్యాలీని అడ్డుకొంటున్న పోలీసులు

### ఛలో లోక్‌భవన్‌ను అడ్డుకొన్న పోలీసులు
పలువురు మంత్రులు, కాంగ్రెస్ నేతలు అరెస్టు
గాంధీభవన్ వద్ద బిజెపి, కాంగ్రెస్ బాహాబాహీ

**హైదరాబాద్,జులై 22,ప్రభాతవార్త:** అఖిలభారత కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అరెస్టుకు నిరసనగా తెలంగాణ ధర్నాలు,రాస్తారోకోలు రహదారుల దిగ్బంధనంతో అట్టుడికిపోయింది.ఎఐసిసి పిలుపు మేరకు హైదరాబాద్‌లో టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ నాయకత్వంలో నక్లెస్‌రోడ్ నుంచి లోక్‌భవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మంత్రులు దామోదర రాజనర్సింహ,పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అజారుద్దీన్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌తోపాటు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. లోక్‌భవన్‌కు ర్యాలీ చేరుకోగానే పోలీసులు అడ్డుకొని మంత్రులతో సహా కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేసి నాంపెల్లి పోలీసు స్టేషన్‌కు తరలించారు. గాంధీభవన్ వద్ద బిజెపి ధర్నాకు నిరసన చేపట్టగా కాంగ్రెస్ నేతలు, ఎన్‌ఎస్‌యూఐ కార్యకర్తలు బిజెపి ఆఫీస్ ముట్టడికి దిగడంతో బిజెపి కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. ఇరు పార్టీల ఆందోళనల నేపథ్యంలో కార్యకర్తలు ఎదురెదురుగా రావడంతో తోపులాట జరిగింది. బిజెపి, కాంగ్రెస్ శ్రేణులు పరస్పరం కర్రలు, రాళ్లు రువ్వుకున్నారు.గాంధీభవన్ ,శ్యాం ప్రసాద్ ముఖర్జీ భవన్ బిజెపి రాష్ట్ర కార్యాలయం వద్ద ఇరుపార్టీల కార్యకర్తలు తలపడటమే కాకుండా పరస్పరం రాళ్ళురువ్వుకోవడంతో దారిన వెళ్ళేవారు కూడా గాయపడ్డారు. ఈ దాడిలో మహిళా కానిస్టేబుల్ సహా పలువురికి గాయాలయ్యాయి.ఈ ఘటనను కవర్ చేస్తున్న ఓ టీవీ రిపోర్టర్ ప్రవీణ్ తలకు గాయమైంది. యువజన కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. కాంగ్రెస్, బిజెపి పోటాపోటీ >>2

## నీతిఆయోగ్ కొత్త సిఇఒగా అనురాగ్‌జైన్

**న్యూఢిల్లీ,జులై 22:** కేంద్ర ప్రభుత్వం నీతి ఆయోగ్ కొత్త సిఇవోగా మధ్యప్రదేశ్ కేడర్‌కు చెందిన 1989 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అనురాగ్ జైన్‌ను నియమించింది. ఈ మేరకు కేంద్ర మంత్రివర్గ నియామకాల కమిటీ ఆమోదం తెలిపినట్లు సిబ్బంది, శిక్షణ శాఖ



బుధవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. డీఓపీటీ విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం.. అనురాగ్ జైన్ బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచే ఆయన నియామకం అమల్లోకి వస్తుంది. ప్రస్తుతం ఆయనకు మంజూరైన సేవా పొడిగింపు పూర్తయ్యే వరకు, అనంతరం మొత్తం రెండేళ్ల పాటు లేదా తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఏది ముందుగా వస్తే అంత వరకు ఆయన నీతి ఆయోగ్ సీఈవోగా కొనసాగనున్నారు. అలాగే ఆయన నియామకం తనకు ముందు ఈ పదవిలో ఉన్న >>2



## తెలంగాణ నుంచి అదనపు బియ్యం సేకరణ
35 నుంచి 43 లక్షల మె. టలకు పెంపు
### కేంద్ర సర్కార్ నిర్ణయం: కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై22:** తెలంగాణ రాష్ట్రం నుంచి బియ్యం సేకరణను మరో 8 లక్షల మెట్రిక్ టన్నులు (12లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యం) పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తీసుకుంది. తెలంగాణ రైతుల మేలు కోసం, బీజేపీ ప్రజాప్రతినిధుల విజ్ఞప్తులకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకోవడంపై కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2025-26కు సంబంధించి, సీజన్ ప్రారంభానికి ముందే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల సమక్షంలో తెలంగాణ నుంచి 35 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం (52 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం) సేకరించాలని సంయుక్తంగా నిర్ణయించారు. తెలంగాణలో ఈసారి ధాన్యం ఉత్పత్తిని దృష్టిలో పెట్టుకుని, తెలంగాణకు చెందిన బీజేపీఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి ఈనెల 8న కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ప్రజాపంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో సమావేశమై.. తెలంగాణ నుంచి బియ్యం సేకరణ పరిమాణాన్ని పెంచాలని విజ్ఞప్తి చేశాం,మా విజ్ఞప్తిని సానుకూలంగా పరిశీలించిన కేంద్ర >>2

## ఎసిబి వలలో మరో అవినీతి చేప
రూ. 150 కోట్ల అక్రమాస్తులతో దొరికిన తెలంగాణ రెడ్కో డిఇ వెంకటరమణ 6

## ఆవిరవుతున్న 'సన్నాలు'!
ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో రూ. 50 కోట్ల సన్నబియ్యం పక్కదారి
రాష్ట్రంలో ఐదుచోట్ల విజిలెన్స్ మెరుపు దాడులు
కరీంనగర్ శ్రీనివాస ఆగ్రోటెక్ నుంచి 43వేల బస్తాల సన్నధాన్యం నల్లబజారుకు..


కరీంనగర్ జిల్లా దాడుల్లో పాల్గొన్న విజిలెన్స్ అధికారులు

**హైదరాబాద్,జులై 22,ప్రభాతవార్త:** విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ బృందాలు బుధవారం ఖమ్మం,కామారెడ్డి,కరీంనగర్, నిజామాబాద్ జిల్లా కాలురుతోపాటు తెలంగాణలోని నాలుగు ప్రాంతాల్లో రైసుమిల్లులపై మెరుపుదాడులు చేసి బియ్యం నిల్వలు తనిఖీ చేస్తుండటంతో మిల్లర్ల అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి . నిజామాబాద్ జిల్లా కాలూరు సిద్ధిరామేశ్వరి ఆగ్రో ఇండస్ట్రీలో బుధవారం ఉదయం నుంచి విజిలెన్స్ అధికారులు తనిఖీచేయగా 20400మె.ట సన్నధాన్యం నిల్వలు పక్కదారి పట్టించినట్లు గుర్తించారు. సుమారు రూ.50 కోట్ల విలువ గలిగిన ఐదు లక్షల గన్నీబ్యాగులు రైసుమిల్లు బకాసురుడు ఆరగించినట్లు విజిలెన్స్ అధికారులు >>2

ట్రైనీ ఐపిఎస్ లైంగిక వేధింపుల కేసు:
మహిళా భద్రత విభాగానికి బదలీ
బాధితురాలి వాంగ్మూలం నమోదు 3
హైకోర్టులో కృష్ణారెడ్డికి దక్కని ఊరట



## జోరందుకున్న వానలు
నందిగాంలో అత్యధికంగా 59.2 మి.మీ వర్షపాతం
హైదరాబాద్, ఆదిలాబాద్, నిజామాబాద్, కామారెడ్డి, పెద్దపల్లి జిల్లాల్లో సాధారణం
కొన్ని ప్రాంతాల్లో ఇంకా తగ్గని ఉష్ణోగ్రతలు

**హైదరాబాద్, జులై 22, ప్రభాతవార్త:** బంగాళాఖాతంలో ఉపరితల అవర్తనం, ద్రోణి ప్రభావంతో తెలంగాణలో గత రెండు మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. హైదరాబాద్‌తో పాటు, రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఆకాశం మేఘావృతమై, అడపాదడపా తేలికపాటి నుంచి మోస్తరు జల్లులు కురుస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండగా మరికొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుండి చిరుజల్లులు కురుస్తున్నాయి. గడచిన 24 గంటల్లో రంగారెడ్డి జిల్లాలోని నందిగాంలో అత్యధికంగా 59.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని బుధవారం టీఎస్‌డీపీఎస్ విడుదల చేసిన రోజువారీ వాతావరణ నివేదిక తెలిపింది. తెలంగాణ వ్యాప్తంగా ఒక రోజులో సగటు వర్షపాతం 9.9 మిల్లీమీటర్లు నమోదు కాగా, అత్యధిక గరిష్ట ఉష్ణోగ్రత 33.6 డిగ్రీల సెల్సియస్‌గా సూర్యాపేటలోని అలంగపురంలో నమోదైంది. హైదరాబాద్‌లోని విఠల్‌వాడిలో అత్యధిక ఉష్ణోగ్రత 30.8 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. గ్రేటర్ హైదరాబాద్ ప్రాంతంలో, రంగారెడ్డి జిల్లాలోని శంకర్‌పల్లెలో అత్యధికంగా 15 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గత 24 గంటల్లో రోజంతా సగటు వర్షపాతం 6.3 మిల్లీమీటర్లుగా నమోదైందని టీఎస్‌డీపీఎస్ డేటా సూచించింది. జిల్లాల వారీగా చూస్తే ఆదిలాబాద్‌లో 32.8 మిల్లీమీటర్లు, ఆసిఫాబాద్‌లో 24.3 మిల్లీమీటర్లు, మంచిర్యాల 23.7 మిల్లీమీటర్లు, నిర్మల్ 24.1 మిల్లీ మీటర్లు, కామారెడ్డి 12 మిల్లీమీటర్లు, పెద్దపల్లిలో 11.7 మిల్లీ మీటర్లు, సిద్దిపేట్‌లో 10.8 మిల్లీమీటర్లు, కొత్తగూడెంలో 10.2 మిల్లీ మీటర్లు, జగిత్యాలలో 12 మిల్లీమీటర్లు, నిజామాబాద్‌లో >>2



బుధవారం ఢిల్లీలో ఆందోళనలు చేస్తున్న 'కాక్రోచ్' నేతలు

# కేంద్ర మంత్రులే రావాలి

>> ప్రధాన అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ మీడియాతో మాట్లాడుతూ రెండో విడత చర్చల కోసం బుధవారం ఉదయం పోలీసులు మళ్లీ మమ్మల్ని సంప్రదించారని చెప్పారు. కేంద్ర మంత్రి జేపీ నడ్డా మీతో మాట్లాడాలనుకుంటున్నారని చెప్పి ఆయన నివాసానికి రమ్మని ఆహ్వానించినట్లు తెలిపారు. కానీ ఈ ఆహ్వానాన్ని తాము స్పష్టంగా తిరస్కరించినట్లు సౌరవ్ దాస్ వెల్లడించారు. మేము ఎవరి ఇంటికి, ఆఫీస్‌కు వెళ్లేదే లేదని కేంద్ర మంత్రులు, ప్రభుత్వం మాతో చర్చలు జరపాలంటే ఇకపై జంతర్ మంతర్ వద్దకు రావాల్సిందేనని స్పష్టం చేశారు. ఇక్కడ జనతా దర్బార్ జరుగుతోందని ప్రజల ముందుకు వచ్చి చర్చలు జరపాలన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన సౌరవ్ దాస్ తాము చదువుకున్న వ్యక్తులమేనని తాము పట్టుదలకు పోయే వ్యక్తులం కాదని పేర్కొన్నారు. కేంద్ర మంత్రులు చర్చల కోసం జంతర్ మంతర్ వద్దకు వస్తే తమ భద్రతపై ఏదైనా ఆందోళన ఉంటే జంతర్ మంతర్ సమీపంలోని ఏదైనా తటస్థ వేదికగా సమావేశమయ్యేందుకు మేము సిద్ధమేనన్నారు. ఈ విషయంలో కేంద్రం సమాధానం కోసం వేచి చూస్తున్నామని వెల్లడించారు. అలాగే మా డిమాండ్లను ఆమోదించే ఉద్దేశం ప్రభుత్వానికి ఉండాలని అర్థం లేని చర్చల కోసం మమ్మల్ని పిలవడం వల్ల ఎలాంటి ఉపయోగం లేదన్నారు. మా సమయం చాలా విలువైనది. వేలాది మంది ప్రజలు ఇప్పటికీ ఈ నిరసనలో పాల్గొంటున్నారు, వారిని సమన్వయం చేసుకోవాల్సిన బాధ్యత కూడా మాపై ఉందని తెలిపారు.ప్రభుత్వం నిజంగా చర్చలు జరిపే ఉద్దేశంతో ఉందో లేదో ముందుగా స్పష్టం చేయాలని సౌరవ్ దాస్ డిమాండ్ చేశారు.

# గత పదేళ్లలో 152 పేపర్లు లీక్

>> ఒక్కరికి కూడా శిక్ష పడలేదని ఆయన విమర్శించారు. దేశంలోని విద్యా వ్యవస్థను లోపభూయిష్టంగా తీర్చిదిద్దారంటూ కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. నీట్ లీక్‌పై సీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు తీవ్రమవుతున్న తరుణంలో బుధవారం ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రెస్‌మీట్‌లో రాహుల్ గాంధీ మాట్లాడారు. విద్యార్థులు న్యాయమైన కారణంతోనే నిరసన తెలుపుతున్నారని అన్నారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అవినీతిపరుడు, అసమర్థుడని రాహుల్ గాంధీ ఆరోపించారు. మన అతిపెద్ద ఆస్తి అయిన భారతదేశ విద్యా వ్యవస్థను విద్యాశాఖ మంత్రి నాశనం చేస్తున్నారని విమర్శించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. ఇది న్యాయమైన డిమాండ్. ప్రధాన్ ఒక అవినీతిపరుడు, అసమర్థుడు. ఈ గందరగోళం మొత్తానికి ప్రతీక. ఆయనను తప్పక తొలగించాలని అన్నారు. మరోవైపు గత 10 ఏళ్లలో కనీసం 152 పేపర్ లీక్‌లు జరిగాయని, వాటిపై ఎటువంటి జవాబుదారీతనం లేదని రాహుల్ గాంధీ ఆరోపించారు. పదేళ్లలో 152 సార్లు ప్రశ్నపత్రాలు లీక్ అయ్యాయి. సగటున నెలకు ఒక లీక్ అయిందన్నారు. ఈ లీక్‌లు కోట్లాది మంది విద్యార్థులపై ప్రభావం చూపాయి. గత పదేళ్లలో పేపర్ లీక్ కేసుల్లో ఎవరికీ శిక్ష పడలేదు. విద్యార్థులు దీనిని ప్రశ్నిస్తున్నారు అని అన్నారు. అయితే పేదలు, మధ్యతరగతి ప్రజలకు విద్యా వ్యవస్థ అందుబాటులో లేకుండా పోయిందని రాహుల్ అన్నారు. నీట్ కోచింగ్ కోసం దేశవ్యాప్తంగా అభ్యర్థులు ఏటా రూ. 1.32 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నారని తెలిపారు. దేశ వార్షిక విద్యా బడ్జెట్ అయిన రూ. 1.4 లక్షల కోట్లతో ఇది దాదాపు సమానమని గుర్తు చేశారు. ఈ లోపభూయిష్ట వ్యవస్థ పేద, మధ్యతరగతి వారిని విద్యకు దూరం చేస్తోందని ఆరోపించారు. ఈ వ్యవస్థ కేవలం ధనికుల కోసమే. ఇందులో పేదలకు చోటు లేదని ఎద్దేవా చేశారు. కాగా, మంగళవారం ప్రధాని మోడీ నివాసం వెలుపల ధర్నా సందర్భంగా పోలీసులు తనతో దురుసుగా ప్రవర్తించడంపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు రాహుల్ గాంధీ స్పందిస్తూ కొన్ని పిడిగుద్దుల గురించి గానీ, నా పట్ల ఎలా ప్రవర్తించారనే దాని గురించి గానీ నేను పట్టించుకోను. ప్రభుత్వం నాతో ఎలా వ్యవహారిస్తుందన్నది ముఖ్యం కాదు. విద్యార్థుల డిమాండ్లు, వారి భవిష్యత్తు మాత్రమే ముఖ్యం అని అన్నారు. విద్యార్థులపై దాడి చేసిన పోలీస్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రధాని మోడీవిద్యార్థులకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

# అదనపు బియ్యం సేకరణ

>> ప్రభుత్వం, బియ్యం సేకరణ లక్ష్యాన్ని 35 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 43 లక్షల మెట్రిక్ టన్నులకు (అంటే 64 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యానికి సమానం) పెంచుతూ నిర్ణయం తీసుకుందని వివరించారు. తెలంగాణ రైతుల పరిస్థితులను అర్థం చేసుకుని.. బియ్యం సేకరణ పెంపు నిర్ణయం తీసుకున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే మా విజ్ఞప్తికి వెంటనే స్పందించి సానుకూల నిర్ణయం తీసుకునేలా సహకరించిన కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి కూడా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు.తెలంగాణకు 8 లక్షల మెట్రిక్ టన్నుల అదనపు బియ్యం సేకరణకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించడాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలి. కేంద్రప్రభుత్వానికి ఇచ్చిన కమిట్‌మెంట్‌కు అనుగుణంగా బియ్యాన్ని సేకరించి భారత ఆహార సంస్థ (ఎఫ్‌సిఐ)కు సకాలంలో అందజేయాలని సూచించారు. ఇప్పటికే, రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సి ఉన్న బియ్యాన్ని గత మార్కెటింగ్ సీజన్లలో నిర్ణీత గడువులో ఎఫ్‌సిఐకి ఇవ్వలేదు. కావున గతంలో అంగీకరించిన పరిమాణంలో బియ్యాన్ని ఎఫ్‌సిఐకి అప్పగించలేక రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందన్నారు. పలుమార్లు బియ్యాన్ని ఎఫ్‌సిఐకు ఇవ్వడానికి అదనపు గడువు కోరుతూ కాలయాపన చేస్తున్నదని ఆరోపించారు. కేంద్రానికి ఇచ్చిన లక్ష్యాలను నిర్ణీత గడువులో పూర్తి చేసి గతంలో ఇచ్చిన బియ్యం కోటా, బుధవారం పొడగించిన బియ్యం కోటాను విధిగా ఎఫ్‌సిఐకు అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# జోరందుకున్న వానలు

>> 11.6 మిల్లీమీటర్లు, వికారాబాద్ జిల్లాలో 11.8 మిల్లీమీటర్ల వర్షపాతం రికార్డయింది. కాగా ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఒక మోస్తరు వర్షాలకు అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాష్ట్రంలోని ఆదిలాబాద్, అసిఫాబాద్, నిజామాబాద్, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల, కామారెడ్డి, పెద్దపల్లి జిల్లాల్లో సాయంత్రం నుండి రాత్రి సమయంలో తేలికపాటి వర్షాలు కురుస్తాయని తెలిపింది. అదేవిధంగా సెంట్రల్ తెలంగాణ, తూర్పు తెలంగాణ జిల్లాల్లోనూ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. దక్షిణతెలంగాణ జిల్లాల్లో సాయంత్రం సమయంలో చిరుజల్లులు కురిసే అవకాశం ఉందన్నారు. ఇక హైదరాబాద్ విషయానికి వస్తే సాయంత్రం నుండి రాత్రి వరకు చినుకులు పడే అవకాశం ఉందని అంచనా వేశారు.

# కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో లీకులు లేవా?

>> చేసిన విమర్శలకు కేంద్ర ప్రభుత్వం బుధవారం గట్టిగా ప్రతిస్పందించింది. కాంగ్రెస్ మరియు దాని మిత్రపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో జరిగిన ప్రశ్నాపత్రాల లీక్‌లపై రాహుల్ గాంధీ ఎందుకు మాట్లాడటం లేదని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ప్రశ్నించారు. గత పదేళ్ల బీజేపీ పాలనలో 150కిపైగా ప్రశ్నాపత్రాల లీక్‌లు జరిగాయని రాహుల్ గాంధీ ఆరోపించిన కొద్ది గంటల్లోనే స్పందించిన నడ్డా, విద్యార్థుల ఆందోళనలను కాంగ్రెస్ రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించుకోవాలని చూస్తోందని విమర్శించారు. జమ్మూ కశ్మీర్‌లో కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ ప్రభుత్వం ఉన్న సమయంలో సర్వీస్ సెలక్షన్ బోర్డు పరీక్షల్లో పేపర్ లీక్ జరిగిందని, కాంగ్రెస్ పాలిత హిమాచల్‌ప్రదేశ్‌లో హిమాచల్‌ప్రదేశ్ స్కూల్ ఎగ్జామినేషన్ బోర్డు పరీక్షల్లో ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని ఆయన గుర్తుచేశారు. జార్ఖండ్‌లో కాంగ్రెస్, జార్ఖండ్ ముక్తి మోర్చా ప్రభుత్వం ఉన్న సమయంలో జేఏసీ నిర్వహించిన హిందీ, సైన్స్ ప్రశ్నాపత్రాలు కూడా లీక్ అయ్యాయని తెలిపారు. యూపీఏ, యూపీఏ మద్దతు ప్రభుత్వాల కాలంలో జరిగిన పేపర్ లీక్‌లపై ఎందుకు చర్చించలేదని నడ్డాప్రశ్నించారు. విద్యా వ్యవస్థను మెరుగుపరచడం, విద్యార్థులకు న్యాయం చేయడం మీ ఉద్దేశం కాదు. విద్యార్థుల సమస్యలను రాజకీయ లాభాల కోసం ఉపయోగించుకోవడమే మీ లక్ష్యంగా కనిపిస్తోంది. ఇది దురదృష్టకరమని నడ్డా వ్యాఖ్యానించారు. నీట్ అంశంపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని జేపీ నడ్డా మరోసారి స్పష్టం చేశారు. పరస్పర ఆరోపణలు, ప్రత్యారోపణలను పక్కనపెట్టి ఈ అంశంపై పార్లమెంట్‌లో విస్తృతంగా చర్చిద్దాం. ప్రశ్నాపత్రాల లీక్‌లకు కారణాలేమిటి? ఇందులో ఎవరు పాల్గొన్నారు కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంది ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు ఎలా స్పందించాలి దేశంలోని లక్షలాది మంది విద్యార్థులకు అన్యాయం జరగకుండా శాశ్వత పరిష్కారం ఎలా కనుగొనాలి అనే అంశాలపై లోతైన చర్చ జరగాలని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై ప్రతిపక్షం ఎంత సమయం కోరితే అంత సమయం కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని నడ్డా తెలిపారు. విద్యార్థుల ప్రయోజనాల దృష్ట్యా ప్రతిపక్షం కూడా తన బాధ్యతను నిర్వర్తించి, శాశ్వత పరిష్కారం కోసం కలిసి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## వారం - వర్జ్యం

23-07-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢమాసం, దక్షిణాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, పుష్యమి కార్తె
నవమి ఉ.7.04, విశాఖ రా.1.43
వర్జ్యం : లేదు
దు.ఉ.10.04-ఉ.10.56,
2) మ.3.15-సా.4.07
శుభసమయం : ఉ.8.00-9.00
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** ఇంటాబయటా సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. ప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి.

**వృషభం:** ఉన్నతాధికారులతో మాట్లాడేటప్పుడు జాగ్రత్తలు పాటించడం వలన లాభపడతారు. వాహన సౌలభ్యం కలదు.

**మిథునం:** పంతాలు వివాదాలు అధికమవుతాయి. ఓర్పు కలిగి ఉండటం చెప్పదగిన సూచన. బంధువుల కలయిక.

**కర్కాటకం:** రెండు మూడు విధాలుగా ధనలాభం పొందుతారు. ప్రముఖుల నుండి కీలక సమాచారం అందుకుంటారు.

**సింహం:** తప్పుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ అన్నారు. పెండింగ్ లోని కోర్టు వ్యవహారాలు చికాకు కలిగిస్తాయి.

**కన్య :** బంధువులకు సంబంధించిన వ్యవహారాలు పర్యవేక్షించవలసి వస్తుంది. మీ ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది.

**తుల:** మీరు ఏర్పరచుకున్న సౌకర్యాలను కలుషితం చేసే యత్నాలు జరుగుతాయి. జాగ్రత వహించండి. ఆరోగ్యం జాగ్రత్త.

**వృశ్చికం:** జీవిత భాగస్వామి తో మాట్లాడేటప్పుడు సంయమనం పాటించండి. వ్యాపారానుకూలత బాగుంటుంది.

**ధనుస్సు:** ఎంత ప్రయత్నించినా పనులు అనుకున్న విధంగా పూర్తికావు. ఆర్థిక సర్దుబాటులు ఎంతో నేర్పుగా చేస్తారు.

**మకరం:** నూతన కార్యక్రమాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. ఆస్తి వివాదాలు చికాకుకలిగిస్తాయి.

**కుంభం:** అనుకోకుండా కొన్ని అవకాశాలు లభిస్తాయి. అనాథ బాలలకు డబ్బు రూపేణా మీ వంతు సహాయాన్ని అందిస్తారు.

**మీనం:** అధిక శ్రమను పంచుకొనడానికి నమ్మకస్తులైన వారిని ఎన్నుకొని బాధ్యతలను అప్పగిస్తారు. శుభవార్తలు అందుకొంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్




హైదరాబాద్‌లో ఛలో రాజ్‌భవన్‌కు ర్యాలీగా వెళ్తున్న మంత్రి పొంగులేటి, పిసిసి చీఫ్ తదితరులు

# అట్టుడికిన తెలంగాణ

>> ముట్టడి వల్ల నాంపల్లి నుంచి చార్మినార్,అఫ్జల్‌గంజ్, గౌలిగూడ, అబిడ్స్,కోఠి వెళ్లే మార్గంలో భారీగా ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది.ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల అరెస్టును నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులు ఆందోళనలకు దిగగా, ప్రధాని నరేంద్ర మోదీ నివాసం వద్ద కాంగ్రెస్ చేపట్టిన నిరసనను ఖండిస్తూ బిజెపి నాయకులు గాంధీభవన్ ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ క్రమంలో నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరిన కార్యకర్తలు, గాంధీభవన్ వద్ద ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలు ఎదురెదురుగా రావడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఇరు వర్గాల మధ్య తోపులాటతో పాటు కర్రలు, రాళ్లతో దాడులు జరిగినట్లు ప్రత్యక్షసాక్షులు తెలిపారు.పరిస్థితి అదుపు తప్పకుండా భారీగా మోహరించిన పోలీసులు లాఠీలకు పనిచెప్పి ఇరు వర్గాలను చెదరగొట్టి ఉద్రిక్తతతను నియంత్రించారు. అలాగే కాంగ్రెస్, బిజెపి కి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలను ముందస్తుగా అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్లకు తరలించారు. గాంధీభవన్ పరిసరాల్లో భారీ పోలీసు బందోబస్తు కొనసాగుతోంది. ఢిల్లీ జంతర్మంతర్ వద్ద యువతపై పోలీస్ దమనకాండను వ్యతిరేకిస్తూ ప్రధాని నివాసం వద్ద నిరస న చేపట్టిన కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్లమెంటు సభ్యులు ప్రియాంక గాంధీ సహా పలువురు నేతలను కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తూ హన్మకొండ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కొండ సురేఖ, హనుమకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మరియు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. నిరసనకు ముందు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. రాహుల్ గాంధీ అరెస్ట్ కు నిరసనగా టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యం లో సంగారెడ్డి లో ని రామ్ మందిర్ నుండి మొదలుకుని సంగారెడ్డి పట్టణం లో బైక్ ర్యాలీ నిర్వహించారు.జాతీయరహదారి 65పై బైఠాయించి నిరసన తెలిపారు. ఖమ్మం రూరల్ మండలంలోని ఏదులాపురం మున్సిపాలిటి నాయుడుపేట బైపాస్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ నేతలు భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ దిష్టిబొమ్మను దహనం చేసి ధర్నా చేపట్టి నిరసన తెలిపారు.

# ఆవిరవుతున్న 'సన్నాలు'!

>> గుర్తించినట్లు తెలిసింది. కరీంనగర్ జిల్లాలోని శ్రీసాయి శ్రీనివాస ఆగ్రో టెక్‌లో 43వేల సన్నధాన్యం బస్తాలు పక్కదారి పట్టించినట్లు అధికారులు గుర్తించారు. వీటి విలువ నాలుగుకోట్ల ఉంటుంది. ఖమ్మం,కామారెడ్డిలో ధాన్యం వ్యత్యాసం విలువ అధికారులు మదింపు చేస్తున్నారు ఇక్కడ మరో రూజ 60కోట్ల మేరకు ఉంటుందని తెలిసింది. గురువారం పూర్తిగా అధికారులు విలువను ప్రకటించే అవకాశంఉంది. సోమవారం నుంచి విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిజి డిఎస్ చౌహాన్ ఆధ్వర్యంలో రైసుమిల్లులపై ఆకస్మికదాడులు జరుగుతుండటంతో మిల్లర్లు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గత మూడు రోజుల్లో జరిపిన రెండు పర్యాయాల ఆకస్మి తనిఖీలలో సుమారు 150కోట్లరూపాయల విలువ గలిగిన సన్నాలు పక్కదారి పట్టించినట్లు వారంరోజుల విజిలెన్స్ మెరుపుదాడుల ఫలితంగావ వెలుగులోకి వచ్చింది. తెలంగాణలో ఐకెపి కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు చేసిన ధాన్యం కస్టమ్ మిల్లింగ్ పద్ధతిలో బియ్యం చేయడానికి మిల్లులకు కేటాయించగా వాటిని దర్జాగా చీకటి బజారుకు తరలిస్తున్నారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట, హుజూరాబాద్.నల్గొండ జిల్లా డిండి సూర్యాపేట జిల్లా బాలెంలతోపాటు మెదక్, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లోని పలు రైస్ మిల్లుల్లో చేసిన తనిఖీల్లో ఏకంగా రూ.52 కోట్ల విలువైన సన్నధాన్యం గల్లంతైనట్లు తేలింది. సన్నరకం ధాన్యానికి మార్కెట్‌లో డిమాండ్ ఉండటంతో ఇతర రాష్ట్రాలకు వాటిని తరలించి ఉంటారని విజిలెన్స్ అధికారులు భావిస్తున్నారు. ఓ రైసుమిల్లు యాజమాన్యం రెండు సీజన్లకు చెందిన రూ.4.83 కోట్లు ధాన్యం బకాయి ఉన్నా ఆయనకు పెద్ద ఎత్తున స్థానిక జిల్లా యంత్రాంగం ధాన్యం కేటాయించడంపై కూడా విజిలెన్స్ ఆరా తీస్తోంది. మరో మిల్లు నిర్వాహకులు రూ.6.92 కోట్లు బకాయిలు ఉండటంతో ఆగస్టు 10లోపు చెల్లించాలని నోటీసులు జారీ చేశారు ఆయనకు కొత్తగా ధాన్యం ఇవ్వడం పట్ల కూడా విజిలెన్స్ నజర్‌పెట్టినట్లు తెలిసింది.

## నీతిఆయోగ్ కొత్త సిఇఒగా అనురాగ్‌జైన్

>> సీఈవోకు వర్తించిన అదే నిబంధనలు, షరతుల ప్రకారమే ఉంటుందని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. పరిపాలనా సేవలో విస్తృతమైన అనుభవం ఉన్న అనురాగ్ జైన్ ప్రస్తుతం మధ్యప్రదేశ్ ముఖ్య కార్యదర్శిగా పనిచేస్తున్నారు. జైన్ పదవీ విరమణ ఆగస్టు 31, 2025న జరగాల్సి ఉంది. అయితే ఆయన అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని కేంద్ర ప్రభుత్వం ఆయనకు ఒక సంవత్సరం పొడిగింపును మంజూరు చేసింది.

# 'లీక్' మంటలు

>> ఫ్లోర్ లీడర్లతో సంప్రదించిన అనంతరం స్పీకర్ నిర్ణయిస్తారని చెప్పారు. ఈ అంశంపై ప్రభుత్వం తీసుకున్న చర్యలను దేశ ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందని, అందుకే సమగ్ర చర్చకు సిద్ధమని రిజిజు పేర్కొన్నారు. యువతకు సంబంధించిన కీలక అంశాలను పార్లమెంట్‌లోనే చర్చించాలే తప్ప వీధుల్లో ఆందోళనలు చేయడం వల్ల ప్రయోజనం ఉండదని ఆయన ప్రతిపక్షంపై విమర్శలు గుప్పించారు. అంతకుముందు కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్రప్రధాన్ ఉదయం స్పీకర్ ఓంబిర్లాను ఆయన ఛాంబర్‌లో కలిసి చర్చలు జరిపారు. ఇక కాంగ్రెస్ నాయకుడు కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ, నీట్ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ప్రతిపక్షం డిమాండ్ చేస్తోందన్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇలాంటి సమయంలో సభలోని ఇతర కార్యక్రమాలన్నింటినీ పక్కనపెట్టి ఈ అత్యవసర అంశానికే ప్రాధాన్యం ఇవ్వాలని వేణుగోపాల్ పేర్కొన్నారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా మాట్లాడుతూ, ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉందని స్పష్టంగా తెలిపిందని, ప్రతిపక్షం సభా కార్యక్రమాలను అడ్డుకోవడం కంటే చర్చలో పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించాలని సూచించారు. సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతూ, విద్యార్థులు, యువత ప్రయోజనాలు దెబ్బతింటే ప్రతిపక్షం ప్రజల మధ్యకు వెళ్లి నిరసనలు చేపట్టడం సహజమేనన్నారు. నిరసనల్లో ఢిల్లీపోలీసులు వ్యవహరించిన తీరుపై ఆగ్రహం వ్యక్తంచేసారు. ఆడబిడ్డలు దుస్తులు చించేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తంచేసారు. ఇదేనా మనం ఆడబిడ్డలకు ఇచ్చే గౌరవం అని ప్రశ్నించారు. హౌస్‌లో బీజేపీ, కాంగ్రెస్ సభ్యులు మాట్లాడుతుండగా తనను మాట్లాడనివ్వలేదని అఖిలేశ్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. యువత, విద్యార్థుల ప్రయోజనాలకు భంగం కలిగితే, ప్రతిపక్షాలు కూడా వీధుల్లోకి వచ్చి నిరసనలు చేపట్టక తప్పదని ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పార్లమెంట్ ప్రాంగణంలో ప్రతిపక్ష ఎంపీలు నల్ల దుస్తులు ధరించి నిరసన తెలిపారు. ఈ నిరసనలో లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, అఖిలేష్ యాదవ్, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు తమ హక్కులను అడుగుతున్నారని ప్రియాంక గాంధీ వాద్రా తెలిపారు. ఇదే సమయంలో ప్రతిపక్ష సభ్యులు నినాదాలు కొనసాగించడంతో లోక్‌సభను రోజంతా వాయిదా వేశారు. నీట్ పేపర్ లీక్ ఘటనతో పాటు జంతర్ మంతర్ తదితర ప్రాంతాల్లో నిరసనకారులపై పోలీసులు తీసుకున్న చర్యలకు నిరసనగా కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ ఎంపీలు నల్ల దుస్తులు ధరించి సభకు హాజరయ్యారు.

# పాశవిక దాడులా?

>> జీవితాలతో చెలగాటమాడుతున్నారని చెప్పారు.కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చేయాలని జంతర్ మంతర్ వేదికగా విద్యార్దులు చేపట్టిన నిరసనకు రాజకీయాలకు అతీతంగా పార్టీలు మద్దతు తెలిపాయన్నారు. ధర్మేంద్రప్రదాన్‌ను కేబినెట్ నుంచి భర్తరఫ్ చేసి నీట్ పేపర్ లీక్ చేసిన వాళ్ళను జైల్లో పెట్టాల్సింది పోయి,విద్యార్దులపై పాశవికంగా దాడి జరుపుతారా అంటూ ప్రశ్నించారు.విద్యార్ధినులపై దుర్మార్గంగా దాడి చేయడమే కాకుండా విద్యార్దుల తలలు పగలగొట్టారన్నారు.పదుల సంఖ్యలో విద్యార్దులు కనిపించకుండా పోయారని,వారిని ఎక్కడికైనా తీసుకెళ్ళారా.?ఎవరైనా కిడ్నాప్ చేవారా అని సందేహం వ్యక్తం చేశారు.

విద్యార్దులకు మద్దతుగా రాహుల్‌గాంధీ,ప్రియాకం గాంధీ ప్రధాని ఇంటి ముందు నిరసన చేపట్టారని,శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్నా రాహుల్‌గాంధీ,ప్రియాంక గాంధీపై పాశవికంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు.పాశవిక దాడిలో రాహుల్‌గాంధీ కర్తం నేలకు చిందిందని,దేశం కోసం రక్తం చిందించడం గాంధీ కుటుంబానికి కొత్త కాదని చెప్పారు. ఆంగ్లేయులతో పోరాడి తరిమికొట్టిన చరిత్ర కాంగ్రేస్ పార్టీదన్నారు.దేశం కోసం రక్తం చిందించిన గొప్ప కుటుంభం ఇందిరమ్మ కుటుంబంమన్నారు. బాంబుదాడితో శరీరం ముక్కలైనా దేశ సమైక్యత కోసం ప్రాణాలిచ్చిన వ్యక్తి రాజీవ్‌గాంధీ అని గుర్తు చేశారు. పదేళ్ల అధికారంలో ఉన్నా సోనియాగాంధీ ప్రధాని పదవి తీసుకోలేదని,కనీసం మంత్రి పదవి తీసుకోలేదని అన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
మునిసిపల్ కౌన్సిల్ కార్యాలయం, అమరచింత మునిసిపాలిటీ
వనపర్తి జిల్లా (TS)
'ఇ'-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండర్ ప్రకటన
"ఇ"-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫారం పై, 3 పనికి టెండర్ పిలవబడుతోంది. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ: 23.07.2026 ఉ.10.30గం. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ముగింపు తేది: 28.07.2026 సా.05.30గం. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా https://tender.telangana.gov.in వద్ద చూడవచ్చును. బిడ్స్ ఆహ్వానించు అధికారి: కమిషనర్, అమరచింత మునిసిపాలిటీ, తెలంగాణ రాష్ట్రం. ఫోన్: 9346048760, 9032846636.
సం/-. కమిషనర్, అమరచింత మునిసిపాలిటీ.
DIPR.NO. 6517-PP/CL/ADVT/1/2026-27 తేదీ: 22.07.2026

AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్
(ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్)
(CIN:L36911RJ1996PLC011381)
నమోదిత కార్యాలయం: 19-ఎ, ధూలేశ్వర్ గార్డెన్, అజ్మీర్ రోడ్, జైపూర్-302001
అనుబంధం IV (నిబంధన 8(1) చూడండి) స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కోసం)
ఇదిలా ఉండగా దిగువ సంతకందారు, AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్) యొక్క అధీకృత అధికారిగా, "ఆర్థిక ఆస్తుల సెక్యూరిటైజేషన్ మరియు పునర్నిర్మాణం మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ అమలు (చట్టం, 2002 (54 ఆఫ్ 2002)" క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నియమాలు, 2002లోని (నియమం 3)తో చదువబడే సెక్షన్ 13(12) కింద సంక్రమించిన అధికారాలను ఉపయోగించి రుణగ్రహీత ముడావత్ లక్ష్మిణ్ (రుణగ్రహీత), ముడావత్ గోరి (సహ-రుణగ్రహీత), (రుణ ఖాతా నెం. 24660002301857)లను, సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు నోటీసులలో పేర్కొన్న రూ.8,89,423/- (ఎనిమిది లక్షల ఎనభై తొమ్మిది వేల నాలుగు వందల ఇరవై మూడు రూపాయలు మాత్రమే) మొత్తాన్ని తిరిగి చెల్లించమని కోరుతూ 04-ఫిబ్రవరి-26 తేదీన డిమాండ్ నోటీసును జారీ చేసారు.
ఇదిలా ఉండగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క విలీన పథకం ప్రకారం, 1 ఏప్రిల్ 2024 నుండి అమలులోకి వచ్చేలా ఫినోకేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్‌ను, AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్‌లో విలీనం చేయబడింది. ఈ విలీన పథకం ప్రకారం, పైన పేర్కొన్న రుణ ఖాతా, మంజూరు చేయబడిన సదరు క్రెడిట్/ఆర్థిక సహాయానికి సంబంధించి మీరందరూ చెల్లించవలసిన మొత్తం సొమ్ముతో పాటు, తనఖా పెట్టిన ఆస్తికి సంబంధించిన అంతర్లీన సెక్యూరిటీ మరియు సెక్యూరిటీ వడ్డీతో సహా, AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌కు బదిలీ చేయబడింది.
రుణగ్రహీత/సహరుణగ్రహీత/తాకట్టుదారు/హామీదారు మొత్తం తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, చట్టంలోని సెక్షన్ 13 యొక్క ఉపసెక్షన్ (4) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్ఫోర్స్మెంట్ రూల్స్, 2002లోని రూల్ 8 ప్రకారం అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలను ఉపయోగించి, దిగువ సంతకందారు 17వ రోజు జులై 2026వ సంవత్సరం ఇక్కడ క్రింద వివరించిన ఆస్తిని స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీత/తాకట్టుదారుకు మరియు సాధారణ ప్రజలకు దీని ద్వారా తెలియజేయబడుతుంది.
ముఖ్యంగా రుణగ్రహీత/సహరుణగ్రహీత/తాకట్టుదారు/హామీదారు మరియు సాధారణ ప్రజలు ఈ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు చేయరాదని ఇందుమూలంగా హెచ్చరించబడింది. ఆస్తితో చేసే ఏ లావాదేవీలకైనా, 03-ఫిబ్రవరి-26 నాటికి రూ.8,89,423/- (ఎనిమిది లక్షల ఎనభై తొమ్మిది వేల నాలుగు వందల ఇరవై మూడు రూపాయలు మాత్రమే) మొత్తం మరియు పూర్తి చెల్లింపు జరిగే వరకు దానిపై వడ్డీ మరియు ఖర్చులు AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకు) వారి ఛార్జీకి లోబడి ఉంటుంది.
హామీగా ఉంచిన ఆస్తులను వినియోగించడానికి అందుబాటులో ఉన్న సమయం, అనగా ఈ సమాచారం అందిన తేదీ నుండి 30 రోజులు, చట్టంలోని సెక్షన్ 13 యొక్క ఉపసెక్షన్ (8) నిబంధనలను రూల్ 8(6)తో చదువబడే దానిని రుణగ్రహీత దృష్టికి తీసుకురావడం అయినది.
స్థిరమైన ఆస్తుల వివరణ
వనపర్తి జిల్లా, పానగల్ మండలం, తెల్లరాళ్లపల్లి తండా గ్రామంలోని ఇంటి నంబర్ 8-34B (అసెస్మెంట్ నంబర్ 650) గల ఆస్తి వివరాలు: ఇది 60x36 అడుగుల కొలతలతో, మొత్తం 240 చదరపు గజాలు సుమారు 200 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉంది. ఇందులో 30x20 అడుగుల 600 చదరపు అడుగుల ప్లింత్ ఏరియాతో నిర్మించిన RCC ఇల్లు ఉంది. దీని కొలతలు తూర్పు-పడమర దిశలో 26/అడుగులు మరియు ఉత్తర-దక్షిణ దిశలో 14.5/అడుగులు మొత్తం 377 చదరపు అడుగులు కలిగి ఉండి, ప్రస్తుతం ఉన్న మరియు భవిష్యత్తులో చేపట్టే నిర్మాణాలతో సహా ఉంటుంది. దీని సరిహద్దులు: తూర్పున కె. రాజు గారి ఇల్లు, పడమరన 20 అడుగుల రోడ్డు, ఉత్తరాన శంకర్ గారి ఇల్లు, దక్షిణాన 10 అడుగుల రోడ్డు.
తేది: 17/జులై/2026 సం/-అధీకృత అధికారి
ప్రదేశం : వనపర్తి, తెలంగాణ AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

తెలంగాణ ప్రభుత్వం
ఫారం - VI
ప్రాథమిక ప్రకటన
గెజిట్ నెం.: 57/2026 తేది: 14.07.2026
ఫైల్ నెం.: G/696/2026
(భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టము 2013 (2013/30 కేంద్ర చట్టం) యొక్క సెక్షన్ 11(1) మరియు రాష్ట్ర రూల్ 25 (1) ననుసరించి
తెలంగాణ ప్రభుత్వం/శ్రీయుత జిల్లా కలెక్టర్, వనపర్తి గారు ప్రజా ప్రయోజనార్థ అవసర నిమిత్తం వనపర్తి జిల్లా పానగల్ మండలములోని రేమద్దుల రెవెన్యూ గ్రామ పరిధిలో "MGKLIS - Distributary-08/10L Minor Canal, from K.M. 0.000 to K.M. 01.400" నిర్మాణం కొరకు ఈ క్రింది షెడ్యూల్‌లో ఉదహరించిన భూమి ఎకరములు 11.28 గుంటలు పట్టా/ప్రభుత్వ భూములు సేకరించవలెనది.
పైన పేర్కొన్న ప్రాజెక్టు కోసం వనపర్తి జిల్లా మరియు పానగల్ మండలములోని రేమద్దుల రెవిన్యూ గ్రామ పరిమితిలో గల ప్రామాణిక కొలత కంటే ఎక్కువ లేదా తక్కువ ఎకరములు 11.28 గుంటలు కొలిచే డివిజన్ భూమి, భూసేకరణ ద్వారా సేకరణ చేసే భూముల వివరములు క్రింది విధంగా గలవు.
షెడ్యూల్
గ్రామము : రేమద్దుల మండలం : పానగల్ జిల్లా : వనపర్తి

| క్ర. సం | సర్వే నెం | భూమి స్వభావం | భూమి వర్గీకరణ | భూసేకరణ కొరకు ప్రతిపాదిత భూ విస్తీర్ణం ఎ-గుం. | పట్టాదారు/ అనుభవదారు పేరు మరియు తండ్రి/ భర్త పేరు శ్రీ/శ్రీమతి/కుమారి | సరిహద్దులు ఉ | ద | తూ | ప |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 319/2 | ఖుష్కి | ప్రభుత్వ/అసైన్డ్ | 00.08 | ఎల్లమ్మ భర్త : కాశయ్య | 320 | 336 | 318 | 337 |
| 2 | 319/3 | ఖుష్కి | ప్రభుత్వ/అసైన్డ్ | 00.10 | టిప్పన్న తండ్రి: మల్లయ్య | 320 | 338 | 318 | 337 |
| 3 | 319/7 | ఖుష్కి | ప్రభుత్వ/అసైన్డ్ | 00.17 | బాలకిష్టయ్య తండ్రి: నరసింహ్మా | 320 | 338 | 318 | 337 |
| 4 | 320 | ఖుష్కి | పట్టా | 00.12 | కొత్త కుర్వ ఎల్లమ్మ భర్త : వెంకు | 322 | 317 | 315 | 336 |
| 5 | 320 | ఖుష్కి | పట్టా | 00.06 | కిష్టయ్య తండ్రి : చిన్నయ్య | 322 | 317 | 315 | 336 |
| 6 | 320 | ఖుష్కి | పట్టా | 00.10 | బీరయ్య తండ్రి : కిష్టయ్య | 322 | 317 | 315 | 336 |
| 7 | 320 | ఖుష్కి | పట్టా | 00.02 | నాగమల్లయ్య తండ్రి : కిష్టయ్య | 322 | 317 | 315 | 336 |
| 8 | 320 | ఖుష్కి | పట్టా | 00.12 | చిన్న మల్లయ్య తండ్రి : కిష్టయ్య | 322 | 317 | 315 | 336 |
| 9 | 315 | ఖుష్కి | పట్టా | 00.13 | చిన్న మల్లయ్య తండ్రి : కిష్టయ్య | 313 314 | 317 316 | 311 | 314 |
| 10 | 315 | ఖుష్కి | పట్టా | 00.08 | పర్వతాలు తండ్రి : కిష్టయ్య | 313 314 | 317 316 | 311 | 314 |
| 11 | 315 | ఖుష్కి | పట్టా | 00.04 | పద్మమ్మ భర్త : బాలపీరు | 313 314 | 317 316 | 311 | 314 |
| 12 | 315 | ఖుష్కి | పట్టా | 00.06 | ఎల్లమ్మ భర్త : వెంకు | 313 314 | 317 316 | 311 | 314 |
| 13 | 315 | ఖుష్కి | పట్టా | 00.09 | శ్రీనివాస్ రెడ్డి తండ్రి : సాయిరెడ్డి | 313 314 | 317 316 | 311 | 314 |
| 14 | 315 | ఖుష్కి | పట్టా | 00.04 | కృష్ణమ్మ భర్త : మల్లారెడ్డి | 313 314 | 317 316 | 311 | 314 |
| 15 | 314 | ఖుష్కి | పట్టా | 00.07 | శేఖర్ రెడ్డి తండ్రి : రాంరెడ్డి | 313 | 315 | 315 | 320 |
| 16 | 314 | ఖుష్కి | పట్టా | 00.05 | రామచంద్రి తండ్రి : నరసింహ్మా | 313 | 315 | 315 | 320 |
| 17 | 314 | ఖుష్కి | పట్టా | 00.07 | కుర్మయ్య తండ్రి : నరసింహ్మా | 313 | 315 | 315 | 320 |
| 18 | 311 | ఖుష్కి | పట్టా | 00.13 | నరసింహ్మా రెడ్డి తండ్రి : చంద్రారెడ్డి | 312 | 309 | 310 | 315 |
| 19 | 310 | ఖుష్కి | పట్టా | 00.15 | నాగిరెడ్డి తండ్రి : ధర్మారెడ్డి | 280 | 309 | 281 | 311 |
| 20 | 310 | ఖుష్కి | పట్టా | 00.23 | రామలింగయ్య తండ్రి : మల్లయ్య | 280 | 309 | 281 | 311 |
| 21 | 281 | ఖుష్కి | పట్టా | 00.02 | రోడ్డు | 257 280 | 282 | 256 | 310 |
| 22 | 281 | ఖుష్కి | పట్టా | 00.20 | కృష్ణయ్య తండ్రి : హన్మంతు | 257 280 | 282 | 256 | 310 |
| 23 | 256 | ఖుష్కి | పట్టా | 00.31 | సిద్ది రాములు తండ్రి : లింగప్ప | 257 | 282 | 255 | 281 |
| 24 | 255/2 | ఖుష్కి | ప్రభుత్వం | 00.01 | ప్రభుత్వం | 227 | 282 | 254 | 256 |
| 25 | 255/3 | ఖుష్కి | ప్రభుత్వ/అసైన్డ్ | 00.08 | యం.రాం రెడ్డి తండ్రి: ఈశ్వర్‌రెడ్డి | 227 | 282 | 254 | 256 |
| 26 | 255/4 | ఖుష్కి | ప్రభుత్వ/అసైన్డ్ | 00.03 | సిద్ది రాములు తండ్రి: లింగం | 227 | 282 | 254 | 256 |
| 27 | 255/5 | ఖుష్కి | ప్రభుత్వ/అసైన్డ్ | 00.04 | లక్ష్మి రెడ్డి తండ్రి: బాల్‌రెడ్డి | 227 | 282 | 254 | 256 |
| 28 | 255/6 | ఖుష్కి | ప్రభుత్వం | 00.03 | ప్రభుత్వం | 227 | 282 | 254 | 256 |
| 29 | 255/2 | ఖుష్కి | ప్రభుత్వం | 00.03 | ప్రభుత్వం | 227 | 282 | 254 | 256 |
| 30 | 255/2 | ఖుష్కి | ప్రభుత్వం | 00.03 | ప్రభుత్వం | 227 | 282 | 254 | 256 |
| 31 | 254 | ఖుష్కి | పట్టా | 00.03 | సురేష్ తండ్రి: బుడ్డ బీరయ్య | 227 | 282 | 252 | 255 |
| 32 | 254 | ఖుష్కి | పట్టా | 00.14 | నర్సింహ్మారెడ్డి తండ్రి: బక్కిరెడ్డి | 227 | 282 | 252 | 255 |
| 33 | 254 | ఖుష్కి | పట్టా | 00.10 | లోకా రెడ్డి తండ్రి: రాం రెడ్డి | 227 | 282 | 252 | 255 |
| 34 | 252 | ఖుష్కి | పట్టా | 01.16 | మల్లాయపల్లి వెంకటరెడ్డి తండ్రి: నారాయణ రెడ్డి | 253 | 251 | 229 | 254 |
| 35 | 253 | ఖుష్కి | పట్టా | 00.06 | గుంటి వెంకట రాములు | 228 | 252 | 228 | 254 |
| 36 | 229/3 | ఖుష్కి | ప్రభుత్వ/అసైన్డ్ | 00.09 | మహేశ్వర్ రెడ్డి తండ్రి: వెంకటరెడ్డి | 228 229 | 230 210 | 212 | 252 |
| 37 | 229/4 | ఖుష్కి | ప్రభుత్వ/అసైన్డ్ | 00.06 | బాలకిష్టయ్య తండ్రి: రాము చంద్రయ్య (అనుభవదారు) (ఎం.వెంకట్ రెడ్డి తండ్రి: నారాయణరెడ్డి) | 228 229 | 230 210 | 212 | 252 |
| 38 | 229/6 | ఖుష్కి | ప్రభుత్వ/అసైన్డ్ | 00.10 | నర్సింహా తండ్రి: బాలయ్య | 228 229 | 230 210 | 212 | 252 |
| 39 | 229/7 | ఖుష్కి | ప్రభుత్వ/అసైన్డ్ | 00.19 | నర్సింహ తండ్రి: రామచంద్రయ్య | 228 229 | 230 210 | 212 | 252 |
| 40 | 229/4 | ఖుష్కి | ప్రభుత్వ/అసైన్డ్ | 00.21 | నర్సింహా తండ్రి: బాలయ్య | 228 229 | 230 210 | 212 | 252 |
| 41 | 211 | ఖుష్కి | పట్టా | 00.11 1/2 | రామకృష్ణ తండ్రి: నర్సింహా | 212 218 | 229 | 212 | 229 |
| 42 | 211 | మెట్ట | పట్టా | 00.11 1/2 | లక్ష్మయ్య తండ్రి: నర్సింహా | 212 218 | 229 | 212 | 229 |
| 43 | 212 | మెట్ట | పట్టా | 00.04 | రోడ్డు | 213 217 | 211 | 204 | 211 |
| 44 | 212 | మెట్ట | పట్టా | 00.02 | రామకృష్ణ తండ్రి: నర్సింహా | 213 217 | 211 | 204 | 211 |
| 45 | 212 | మెట్ట | పట్టా | 00.16 | రాములు తండ్రి: యల్లయ్య | 213 217 | 211 | 204 | 211 |
| మొత్తం విస్తీర్ణం (ఎ-గుం.లు) | | | | 11-28 | | | | | |

ఈ నోటిఫికేషన్ భూసేకరణ, పునరావాసం మరియు పునరావాసం చట్టం 2013 (నెం.30/2013)లోని నిబంధన 11(1) ప్రకారం సంబంధిత భూయజమానులకు సరియైన భూ నష్ట పరిహారం చెల్లించుటకు గాను ఇట్టి నోటిఫికేషన్ జారీ చేయనైనది. చట్టంలోని చాప్టర్ (2)లోని సామాజిక ప్రభావ అధ్యయన నివేదిక మరియు చాప్టర్ (3)లోని ఆహార భద్రత మరియు పరిరక్షణ వంటి అంశములు వర్తించవు.
భూమి యొక్క ప్లాన్ మరియు వివరములు శ్రీయుత జిల్లా కలెక్టర్, వనపర్తి మరియు భూసేకరణ అధికారి మరియు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గారి కార్యాలయములలో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైనా పని దినములలో కార్యాలయ పని వేళలలో పరిశీలించుకోవచ్చును. సదరు చట్టంలోని సెక్షన్-12లో గల అధికారాలను అనుసరించి తెలంగాణ ప్రభుత్వం/శ్రీయుత జిల్లా కలెక్టర్/భూసేకరణ అధికారి & స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే), ఆర్.యల్.ఐ.యస్.పి -II పెబ్బేర్ Hq IDOC, వనపర్తి మరియు అతని సిబ్బందికి సదరు భూమిపైకి ప్రవేశించుటకు, సర్వే మరియు ఇతర పనులు చేపట్టుటకు, భూమిని తీసుకోవటానికి, త్రవ్వటానికి అధికారం ఇవ్వడానికి, ఇతర పనులు అమలు చెయ్యడానికి అనుమతించనైనది.
చట్టం యొక్క సెక్షన్ 11(4) ప్రకారం భూసేకరణకు ప్రతిపాదించబడిన భూమి విషయములో శ్రీయుత జిల్లా కలెక్టర్, వనపర్తి గారి అనుమతులు లేకుండా ఏ వ్యక్తి ఎటువంటి లావాదేవీలు చేయుకూడదు లేదా భూమి యొక్క ఏదైనా లావాదేవికి కారణం కాకూడదు. అమ్మకం/కొనుగోలు మొదలైనవి చేయుకూడదు లేదా ముందస్తు అనుమతి లేకుండా నోటిఫికేషన్ ప్రచురించిన తేదీ నుండి భూమిపై ఎటువంటి ఏదైనా ఆక్రమణలను సృష్టించకూడదు అని తెలియచేయనైనది.
అధీకృత అధికారి చట్టం యొక్క ఏదైనా ఉంటే సమర్పించుటకు అభ్యంతరాలు, ఆక్షేపణలు గాని మరియు వారి భూముల పరిష్కారం కోసం ఆసక్తి ఉన్న/ప్రభావితమైన వ్యక్తుల నుండి వచ్చిన వాదనలు, ఈ నోటిఫికేషన్ ప్రచురించిన తేదీ నుండి 60(అరవై రోజులు)లోపు భూమిపై ఆసక్తి ఉన్న వ్యక్తులు భూసేకరణ చట్టంలోని సెక్షన్-15 ననుసరించి శ్రీయుత జిల్లా కలెక్టర్, వనపర్తి/భూసేకరణ అధికారి/ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే) ఆర్.యల్.ఐ.యస్.పి, యూనిట్-2, పెబ్బేర్ at Hq IDOC, వనపర్తి గారికి లిఖితపూర్వకంగా తెలియచేయగలరు.
సం/- ప్రత్యేక ఉప కలెక్టర్ భూసేకరణ ఎల్.ఐ.ఎస్.పి, యూనిట్-2, పెబ్బేర్. సం/- అదనపు కలెక్టర్, వనపర్తి సం/- జిల్లా కలెక్టర్, వనపర్తి
DIPR RO.NO:520/LA/PP/Advt/Pub/2026-27



బుధవారం కొడంగల్‌లో సర్ ఫారంలో
వివరాలను నమోదు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

## ఓటు పోగొట్టుకుంటే గుర్తింపు ఉండదు

### ఓటరు జాబితాలో పేరు లేకుంటే సంక్షేమ పథకాలు కోల్పోతారు

### కొడంగల్‌లో ఎస్సీ,ఎస్టీ,మైనార్టీల ఓట్లు తప్పిపోకుండా చూడాలి

### ఎస్ఐఆర్‌పై బిఎల్‌ఎలకు సిఎం రేవంత్‌రెడ్డి దిశా నిర్దేశం

**కొడంగల్, జులై 22, ప్రభాతవార్త:** ఓటు హక్కు లేకపోతే చనిపోయిన వారితో సమానమని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. బుధవారం వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో తన స్వగృహంలో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ప్రక్రియపై కొడంగల్ నియోజకవర్గ స్థాయి ఏజెంట్లతో వరిగి, తాండూర్ శాసనసభ్యులు టి.రామ్మోహన్‌రెడ్డి, బుయ్యాని మనోహర్‌రెడ్డి, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పోరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డిలతో కలిసి నిర్వ హిం చిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొడంగల్‌లో రేవంత్‌రెడ్డిని దెబ్బతీయాలని కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. 119 నియోజకవర్గాలను అభివృద్ధి చేయడం కోసంరోజుకు 18 గంటలు పనిచేసినా నాకు సమయం సరిపో వడం లేదన్న సీఎం కొడంగల్‌లో కుట్రలు చేసేవారిని బొంద పెట్టే బాధ్యత మీపై ఉందన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను చేపట్టేందుకు ఆగస్టు 3వ తేదీ వరకు భారత ఎన్నికల సంఘం గడువును పొడిగించిందన్నారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ,మైనార్టీ ఓట్లను తొలగించాలని బిజెపి ప్రయత్నిస్తుందని సిఎం ఆరో పించారు. బిజెపి, బీఆర్ఎస్ ఒక్కటై కాంగ్రెస్ దొంగదెబ్బ తీయాలని గూడు పుఠాని చేస్తున్నాయని విమర్శించారు. ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ, మహిళ ఓట్లు తప్పిపోకుండా చూడాలని ఆయన అన్నారు. పేదలకు అండగా నిలబడి అందరూ ఓటు హక్కు నమోదు అయ్యేలా చూడాలని ఆయన తెలిపారు.

## 25 నుంచి జనసేన కార్యాచరణ

### పార్టీనేతల పర్యటనల షెడ్యూలు ఖరారు

**హైదరాబాద్, జులై 22, ప్రభాతవార్త:** తెలంగాణలో వచ్చే జెడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపల్ కార్పొరేషన్ తదితర స్థానిక సంస్థల ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని జనసేన పార్టీ సరికొత్త కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలో పార్టీ సంస్థాగత బలోపేతం, విస్తరణతో పాటు, క్షేత్రస్థాయిలో కార్యకర్తలతో ప్రత్యక్ష సమావేశాలను నిర్వహించనుంది. ఇందులో స్థానిక ప్రజా సమస్యలపై విస్తృతంగా సమీక్షించాలని జనసేన పార్టీ తెలంగాణ నాయకత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా పర్యటనల షెడ్యూల్‌ను జనసేన విడుదల చేసింది. జనసేన పార్టీ చీఫ్, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కల్యాణ్ ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గంలో పరిధిలో మొదటి విడతసమావేశం విజయవంతంగా ముగిసింది. మిగిలిన 13 పార్లమెంట్ నియోజకవర్గాల పర్యటనలు పూర్తి చేసిన తర్వాత, చివరి విడతగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని మూడు పార్లమెంట్ నియోజకవర్గాల్లో పర్యటనలు ఉంటాయని జనసేన పార్టీ ప్రకటించింది. ఈ విస్తృత పర్యటనల షెడ్యూల్ ఈనెల 25 శనివారం రాష్ట్రంలోని చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంతో ప్రారంభంకానుంది.ఆ తర్వాత అగస్టు 1వ తేదీన మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో సమావేశం జరుగుతుంది. అలాగే 8వ తేదీ ఉదయం ఆదిలాబాద్‌లోను, సాయంత్రం నిజామాబాద్, 9వ తేదీన ఉదయం కరీంనగర్ పార్లమెంట్, సాయంత్రం పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో సమావేశాలను నిర్వహించనున్నారు. ఈ పర్యటనల తదుపరి విడతలో భాగంగా ఆగస్టు 16వతేదీ ఉదయం మెదక్‌లోను, సాయంత్రం జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల్లో జనసేన నాయకులు పర్యటిస్తారు. అనంతరం 22వ తేదీన ఉదయం నల్లగొండ, సాయంత్రం మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల్లోనూ, చివరిగా 29వతేదీన నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ పర్యటనతో ఈ విడత జనసేనపార్టీ పర్యటన షెడ్యూల్ ముగుస్తుందని పార్టీ వెల్లడించింది. ఈ పర్యటనలు శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతాయని జనసేన పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

## శివసేన ఎంపీల విలీనంపై సుప్రీం కోర్టు విచారణ

### లోక్‌సభ స్పీకర్‌కు నోటీసులు

**న్యూఢిల్లీ, జులై 22:** శివసేన (యుబిటి) ఎంపిలు ఆరుగురు షిండే వర్గంలో విలీనం చేస్తూ లోక్‌సభ స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు బుధవారం విచారణకు స్వీకరించింది. జస్టిస్ పిఎస్ నరసింహ, జస్టిస్ అలోక్ ఆరాధే నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టి, లోక్‌సభ స్పీకర్ కార్యాలయంతోపాటు ఇతర ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ వివరణకోరింది. తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది.

## 24న రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్

### కాంగ్రెస్,వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జులై22:** నీట్ పరీక్షల నిర్వహణలో జరిగిన వరుస వైఫల్యాలు, పేపర్ లీకేజీలు, అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్రవిద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల ఐక్యవేదిక (ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యుఐ, పిడిఎస్‌యు,ఎఐఎఫ్‌డిఎస్,ఎఐఎస్‌బి, ఎఐపిఎస్‌యు) తెలంగాణ రాష్ట్రకమిటీలు ఈనెల 24న రాష్ట్రవ్యాప్తంగా విద్యా సంస్థల బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ బంద్‌ను విజయవంతం చేయడానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, మేధావులు, ప్రజలు సహ కరించాలని విజ్ఞప్తి చేశాయి. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కె. మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ (ఎఐఎస్ఎఫ్), టి. నాగరాజు (ఎస్ఎఫ్ఐ), వెంకట్‌స్వామి (ఎన్ఎస్‌యుఐ),పల్లె మురళి (ఎఐఎఫ్‌డిఎస్) పాల్గొని మాట్లాడారు. దేశ విద్యావ్యవస్థను సంక్షోభంలోకి నెట్టిన వరుస వైఫ ల్యాలకు కేంద్ర ప్రభుత్వం పూర్తిబాధ్యత వహించాలన్నారు. పేపర్ లీకేజీలు, పరీక్షల నిర్వహణలో జరిగిన అవకతవకలకు కారణమైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ)ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులు, యువతపై జరిగిన పోలీసు దాడులపై స్వతంత్ర, సమగ్ర, పారదర్శక విచారణ జరిపించి బాధ్యు లపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు. విద్యా వ్యవస్థ స్వయం ప్రతిపత్తికి భంగం కలిగించే విబిఎస్‌ఏ బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలనే పిటిషన్లపై హైకోర్టు విచారణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జులై22:**పార్టీమారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలనే పిటిషన్లపై హైకోర్టువిచారణ జరిగింది. బీఆర్ఎస్, బీజేపీదాఖలు చేసిన పిటిషన్లపై, స్పీకర్ నిర్ణయాల రికార్డులను ఇంకా సమర్పించలేదని బీఆర్ఎస్ న్యాయవాదులు వివరించారు.దీనికి అదనపు సమయం కావాలని స్పీకర్ ట్రైబ్యునల్ న్యాయవాది కోరగా కోర్టు విచారణను ఆగస్టు 12కు వాయిదా వేసింది.

# జూబ్లీహిల్స్ చోరీపై వీడిన మిస్టరీ

## కంపెనీ ఉద్యోగులే నిందితులు: ఇద్దరి పట్టివేత, నగల జప్తు

**హైదరాబాద్, జూలై 22, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్‌లో బడా నగల కార్యాలయంలో ఈ నెల 17వ తేదీన జరిగిన భారీ చోరీపై మిస్టరీ వీడింది. కంపెనీలో పనిచేసే ఇద్దరు ఉద్యోగులే ఈ నేరానికి పాల్పడినట్లు తేలింది. ఈ చోరీకి పాల్పడ్డ ఇద్దరిని అరెస్టు చేయడంతో పాటు వారి వద్ద నుంచి చోరీకి గురైన కోటి 60లక్షల రూపాయల నగలను జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను టాస్క్‌ఫోర్స్ డిసిపి వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ బుధవారం మీడియాకు వెల్లడించారు. బీదర్‌కు చెందిన సన్ కాంబ్లే హరీష్ (29) అతని తమ్ముడు సన్ కాంబ్లే ఆకాష్ (25) మూడేళ్లుగా హైదరాబాద్‌లోని మంగల్‌హాట్‌లో వుంటూ వేరు వేరు చోట పనిచేస్తున్నారు. ఇందులో హరీష్ ప్రముఖ నగల సంస్థ గురుకృపా ఎక్స్‌పోర్టులో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా, ఆకాష్ మరో కంపెనీలో ఆఫీస్ బాయ్‌గా ఉన్నాడు. కాగా హరీష్ తన ఉద్యోగ బాధ్యతల్లో భాగంగా ఖరీదైన నగలను నగరంలోని ప్రముఖ జ్వెవెల్లర్స్ దుకాణాలకు తీసుకుని వెళ్లడం, అక్కడ వాటిని నిర్వాహకులకు ఇచ్చి, దీనికి సంబంధించిన చెక్కులను తీసుకోవడం చేస్తుంటాడు. అనంతరం అమ్ముడుపోని నగలను కంపెనీ లాకర్లో వుంచడం ఇతని రోజు వారి పని. అయితే కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న హరీష్ తన అవసరాల కోసం కంపెనీ లాకర్లో వున్న నగలలో కొన్నింటిని దొంగిలించాలని పథకం వేశాడు. ఈ విషయాన్ని సోదరుడు ఆకాష్‌కు చెప్పగా అతను కూడా సరే అన్నాడు. అనంతరం ఇద్దరు కలిసి జూబ్లీహిల్స్‌లోని కంపెనీ వద్ద ఈ నెల 16వ తేదీన రెక్కీ నిర్వహించారు. 17వ తేదీ రాత్రి హరీష్ ఒక్కడే కార్యా లయంలో కరెంటు సరఫరా నిలిపివేసి తన ఆచూకీ ఎవరికి తెలియకుండా వుండేందుకు వెనుక భాగంలో బాత్‌రూం గ్రిల్ పగులగొట్టి లోపలికి ప్రవేశించి లాకర్‌ను పగులగొట్టి అందులోని ఒక కిలో 28.59 గ్రాముల బంగారు నగలను దొంగిలించి తన సోదరుడు ఆకాష్‌కు ఇచ్చాడు. అనంతరం వాటిని అమ్మి సొమ్ము చేసుకోవాలని వారు అనుకున్నారు. దీనిపై 19వ తేదీ ఉదయం పోలీసులకు ఫిర్యాదు అందగా పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేబట్టారు. ఇదే సమయంలో దీనిపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు రంగంలో దిగి సాంకేతిక ఆధారాలను సేకరించగా కంపెనీలో పనిచేస్తున్న హరీష్‌పై అను మానాలు వచ్చాయి.

అతన్ని అదుపులోకి తీసుకుని విచా రించగా మొదట తనకు ఏమీ తెలియదని బుకా యించగా పోలీసులు తమ శైలిలో విచారించే సరికి నిజం అంగీకరించాడు. అనంతరం అతన్ని అరెస్టు చేసి, సోదరుడి ఇంట్లో సోదాచేయగా మొత్తం నగలు పట్టుబడ్డాయి. దీంతో అన్నదమ్ము లిద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన ఇన్‌స్పెక్టర్ యాదేందర్, ఎస్ఐ జాహెద్‌లను డిసిపి గైక్వాడ్ అభినందించారు.




జూబ్లీహిల్స్‌లో భారీ చోరీ కేసులో నిందితుల నుంచి జప్తు చేసిన
నగలను మీడియాకు చూపుతున్న టాస్క్‌ఫోర్స్ డిసిపి వైభవ్ రఘునాథ్ గైక్వాడ్

### ట్రైనీ ఐపిఎస్ లైగింక వేధింపుల కేసు

# మహిళా భద్రత విభాగానికి బదలీ

### బాధితురాలి వాంగ్మూలం నమోదు

### హైకోర్టులో కృష్ణారెడ్డికి దక్కని ఊరట

**హైదరాబాద్, జులై 22, ప్రభాతవార్త:** ట్రైనీ మహిళా ఐపిఎస్ అధికారిణిపై లైంగిక వేధింపుల కేసులో నిందితుడుగా సహచర ట్రైనీ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి ఉదంతంలో బుధవారం కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఇప్పటి వరకు ఈ కేసును అత్తాపూర్ పోలీసులు విచారిస్తుండగా దీనిని హైదరాబాద్ మహిళా భద్రతా విభాగానికి (డబ్ల్యుఎస్‌డబ్ల్యు) బదలీ చేశారు. అనంతరం ఈ విభాగం డిసిపి లావణ్యా జాదవ్ పోలీసు అకాడమిని సందర్శించి బాధితురాలి వాంగ్మూలం తీసుకోవడంతో పాటు అక్కడి అధికారులను ఈ ఘటనపై విచారించారు. మరోవైపు తనపై నమోదైన లైంగిక వేధింపుల కేసును కొట్టి వేయాలని ఉదయ్ కృష్ణారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం హైకోర్టులో జరిగిన విచారణ వాయిదా పడింది. ఈ కేసులో పోలీసులు తనపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా చూడాలని ఉదయ్ కృష్ణారెడ్డి కోరగా అందుకు న్యాయస్థానం నిరాకరించింది. దేశవ్యాప్తంగా సంచలనం రేపిన ట్రైనీ ఐపిఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. ఈ నెల 19వ తేదీన ఈ ఘటన వెలుగు చూడగా అప్పటికే ఉదయ్ కృష్ణారెడ్డిపై అత్తాపూర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. వెను వెంటనే పోలీసు అకాడమి నుంచి ఉదయ్ కృష్ణారెడ్డిని సస్పెండ్ చేసి, శిక్షణ నుంచి పంపించి వేశారు. దీని తరువాత ఈ నెల 20వ తేదీన ఉదయ్ కృష్ణారెడ్డి అతిగా మద్యం సేవించడంతో అనారోగ్యం పాలై ఆసుపత్రిలో చేరాడు. ప్రస్తుతం అతని ఆరోగ్యం కుదుట పడడంతో బుధవారం సాయంత్రం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశాడు. ఆసుపత్రి నుంచి బయటకు వచ్చిన సమయంలో మీడియాతో మాట్లాడేందుకు ఉదయ్ కృష్ణారెడ్డి నిరాకరించారు. కాగా మంగళవారంఉదయ్ కృష్ణారెడ్డి తనపై నమోదైన కేసును కొట్టి వేయాలని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా బుధవారం దీనిపై విచారణ జరిగింది. ఈ కేసును విచారించిన న్యాయస్థానం దీనికి సంబంధించిన అన్ని వివరాలు అందజేయాలని పోలీసులను ఆదేశించింది. అయితే తనపై పోలీసులు వెంటనే ఎలాంటి చర్యలు తీసుకోకుండా చూడాలని ఉదయ్ కృష్ణారెడ్డి చేసిన విజ్ఞప్తిని హైకోర్టు తిరస్కరించింది. పోలీ సుల విచారణ సాగుతున్న తరుణంలో ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమని చెబుతూ దీనిపై తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది. డిసిపి లావణ్య జాదవ్ అత్తాపూర్ పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసు ఫైల్‌ను తెప్పించుకుని వివరాలను పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆమె పోలీసు అకాడమిని సందర్శించారు. ఈ కేసులో బాధితురాలిగా వున్న కర్నాటకు చెందిన ట్రైనీ మహిళా ఐపిఎస్ అధికారిణి నుంచి వాంగ్మూలం తీసుకోవడంతో పాటు ఆమెను విచారించారు. ఈ సందర్భంగా ఉదయ్ కృష్ణారెడ్డి తనను ఎలా ఇబ్బంది పెట్టాడనే దానిపై బాధితురాలు డిసిపికి చెప్పారు. తన వైవాహిక బంధాన్ని చెడగొట్టేందుకు ఉదయ్ కృష్ణారెడ్డి ప్రైవేటు వీడియోలను వాడుకున్నాడని, ఇందులో కొన్ని మార్ఫింగ్ ఫోటోలు వున్నాయని బాధితురాలు చెప్పినట్లు తెలిసింది. తనపై ఉదయ్ కృష్ణారెడ్డి చే సిన దుష్ప్రచారం తాలూకు వివరాలను ఆమె డిసిపికి అందజేసినట్లు తెలిసింది. దీని తరువాత ఈ ఘటనపై అకాడమిలో శిక్షణలో వున్న యు వ ఐపిఎస్ అధికారులతోనూ డిసిపి మాట్లాడినట్లు తెలిసింది. ఈ ఉదంతంపై జరిపిన అంతర్గత విచారణలో వెలుగు చూసిన వివరాలను డి సిపి లావణ్య జాదవ్ సేకరించారు. అ కాడమి డైరక్టర్ సహా పలువురు అధికారులతో డిసిపి లావణ్య జాదవ్ భేటీ అయి ఈ ఘటనపై వివరాలు సేకరించినట్లు తెలిసింది. దీనిపై హైకోర్టుకు గురువారం ఒక నివేదిక అందజేసే వీలుంది.

## త్రివర్ణ పతాకం దేశభక్తికి చిరస్మరణీయ ప్రతీక: సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జులై22:**భారతదేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వం, స్వేచ్ఛ, ప్రజాస్వామిక విలువలకు ప్రతీకగా ప్రతి భారతీయుడిలో స్ఫూర్తిని నింపేది త్రివర్ణ పతాకమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. జాతీయ జెండా ఆమోద దినోత్సవం రోజున దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి ప్రాణత్యాగాలు చేసిన సమరయోధులను స్మరించుకుందామని పిలుపునిచ్చారు. మన త్రివర్ణ పతాకం వారి త్యాగాలకు, దేశభక్తికి చిరస్మరణీయ ప్రతీక అని ప్రశంసించారు. జాతీయ జెండాను గౌరవించడం ప్రతి పౌరుడి ప్రాథమిక బాధ్యత అని, న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం అనే రాజ్యాంగ విలువలను ప్రతిరోజూ ఆచరిస్తూనే ఉండాలని, మన జాతీయ పతాకానికి నిజమైన గౌరవాన్ని అందిద్దాం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు.

## గచ్చిబౌలి ఏఐజీ ఆసుపత్రిలో హీరో బాలకృష్ణకు చికిత్స



**గచ్చిబౌలి, జులై 22 ప్రభాత వార్త:** సీనిమా షూటింగ్‌లో చోటు చేసుకున్న ప్రమాదం కారణంగా టాలివుడ్ అగ్ర హీరో నందమూరి బాలక్రిష్ణ తీవ్రంగా గాయ పడ్డారు. ఈ మేరకు చికిత్స కోసం గచ్చి బౌలి ఏఐజీ ఆసుపత్రిలో చేరగా, ప్రస్తుతం వైద్యుల బ ృందం బాలక్రిష్ణకు చికి త్సను అందిస్తున్నారు. బాల క్రిష్ణ కాలుకు గాయం కావ డం, రక్తం గడ్డకట్ట డంతో వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈమేరకు ఏఐజీ ఆసుపత్రి ఆర్థోపెడిక్ వైద్య బ ృందం ఆధ్వర్యంలో బాలక్రిష్ణకు పూర్తిస్థాయి వైద్య పరీక్షలు నిర్వహి స్తున్నారు. బాలక్రిష్ణ వైద్య చరిత్ర ఆధారంగా చికిత్సను అందించేందుకు అన్ని విభాగాలను సిద్ధం చేసినట్లు ఏఐజీ ఆసుపత్రి విడుదల చేసిన హెల్త్ బులిటెన్‌లో తెలిపింది.కాగా బాలక్రిష్ణమోకాలికి శస్త్రచికిత్స జరిగినట్లు ప్రచారం జరిగినా ఆసు పత్రి వర్గాలు హెల్త్ బులిటెన్‌లో ధృవీకరించలేదు. కాగా ప్రస్తుతం బాలక్రిష్ణ ఆరోగ్యంనిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. మరోవైపు బాలక్రిష్ణ ఆరోగ్య పరిస్థితిపై అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.కాగా బాలక్రిష్ణ మోకాలికి శస్త్రచికిత్స జరిగితే ప్రస్తుతం కొనసా గుతున్న ఎన్‌బికే 111షూటింగ్‌కు అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని తెలుస్తోంది.

## అత్తపై కోడలి హత్యాయత్నం

**సికింద్రాబాద్, జులై 22 ప్రభాతవార్త:** సికింద్రాబాద్, జూలై 22: కుటుంబ తగాదాల కారణంగా ఓ కోడలు అత్తను కత్తితో మెడపై దాడి చేసి హత్యాయత్నం చేసిన సంఘటన చిలకలగూడ పోలీస్టేషన్ పరిధిలో జరిగింది. చిలకలగూడ ఎరుకల బస్తీలో నివాసం ఉండే పద్మావతి (65)ని ఆమే కోడలు విజయలక్షీ ్మ కత్తితో దాడికి పాల్పడింది. బాల్కనిలో నిలబడి ఉండగా అత్తను కోడలు బలవంతంగా బెడ్రూమ్లోకి లాక్కువెళ్లి కత్తితో మెడపై దాడి చేసింది. కొన్ని రోజులుగా వాని నివాసంలో తరచుగా తగాలు జరుగడమే కారణంగా తెలుస్తోంది. పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల ఆరు గాయ పడ్డ పద్మావతిని చికత్సి నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అనంతర చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## సింగరేణిలో ఫొటోలు, విడియోలు నిషేధం

**హైదరాబాద్, జులై 22, ప్రభాతవార్త:** సింగరేణి కాలరీస్ కీలక నిర్ణయం తీసుకుంది. సింగరేణి గనుల్లో ఫొటోలు, వీడియోలు తీయడంపై యాజమాన్యం నిషేధం విధించింది. భద్రతా కారణాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలిపింది. ఈ నిబంధనలను అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. అదే విధంగా బొగ్గు గనులు ప్రమాదకర ప్రదేశాలు కావడంతో అనధికారిక ప్రవేశాలను కూడా నిషేధించింది. సింగరేణి గనుల్లో ప్రమాణాల దృష్ట్యా పని ప్రదేశాల్లో సెల్ ఫోన్ల వినియోగంపై నిషేధం విధించగా, అధికారిక అవసరాల కోసం అనుమతించిన ఫోన్ మినహా వ్యక్తిగత ఫోన్లు వాడొద్దని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ముఖ్యంగా భూగర్భ గనులు, ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టులు, సున్నితమైన పని ప్రదేశాలలో అనుమతి లేకుండా ఫొటోలు, రీల్స్ లేదా వీడియోలు తీయడం నిబంధనలకు విరుద్ధమని, బంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సింగరేణిలో ఉండే రహస్య సమాచారం బయటకు లీక్ కాకుండా ఉండేందుకు సంస్థ యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారవర్గాలు వెల్లడించాయి.



ఈగల్ పోలీసులకు పట్టుబడ్డ ముగ్గురు గంజాయి స్మగ్లర్లు

## పట్టుబడ్డ ముగ్గురు గంజాయి స్మగ్లర్లు

**హైదరాబాద్, జులై 22, ప్రభాతవార్త:** ఏపిలోని వైజాగ్ నుంచి హైదరాబాద్‌కు రైల్లో గంజాయి తరలించి ఇక్కడ అధిక ధరలకు అమ్మేందుకు యత్నించిన ముగ్గురు గంజాయి స్మగ్లర్లను ఈగల్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వీరి వద్ద నుంచి రూ 5.88 లక్షల రూపాయల కు పైబడిన 11.767 కిలోల గంజాయిని జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను ఈగల్ డైరక్టర్ సందీప్ శాండిల్యా బుధవారం మీడి యాకు వెల్లడించారు. రాజమండ్రి టౌన్‌కు చెందిన బుర్తి రాజు కుమార్ (25), యర్నగుల లక్ష్మీ జగదీష్ (20) (ఇతను బిఎ రెండవ సంవత్సరం చదువుతున్నాడు), కోనసీమ జిల్లా ముమ్మిడివరం నివాసి మరంపూడి రవి రాజు (19) అనే కూలీ, అమలాపురం నివాసి రేశ్వంత్ అలియాస్ నిమ్ము కలిసి ఒక ముఠాగా ఏర్పడి వైజాగ్‌లో గంజాయి స్మగ్లర్ల నుంచి తక్కువ ధరకు 11.767 కిలోల గంజాయిని వారం రోజుల క్రితం కొన్నారు . అనంతరం దీనిని ఆరు ప్యాకెట్లలో భద్రంగా ప్యాకింగ్ చేశారు. దీని తరువాత ఈ నెల 21వ తేదీన నలుగురు కలిసి రైల్లో గంజాయితో పాటు నగరానికి వచ్చారు. దీనిని ముషీరాబాద్‌లోని రిసాలగడ్డ హవేలి వద్ద అమ్మేందుకు బుధవారం ఉదయం ప్రయత్నించసాగారు. దీనిపై సమాచార ం అందగానే ఈగల్ పోలీసులు ముషీరాబాద్ పోలీసులతో కలిసి దాడిచేయగా నిమ్ము పారిపోయాడు. మిగతా ముగ్గురు దొరికిపోయారు. వీరి వద్ద నుంచి రూ.5.88 లక్షల రూపాయల గంజాయిని జప్తు చేశారు. కాగా గంజాయి సహా డ్రగ్స్‌కు సంబంధించి ఎవరి వద్ద ఎలాంటి సమా చారం వున్నా 1908 లేదా 8712671111 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని ఈగల్ డైరక్టర్ సందీప్ శాండిల్యా కోరారు.




## సిజెపి ఆందోళనలపై ఢిల్లీ పోలీసులు 10 ఎఫ్ఐఆర్‌ల నమోదు

**న్యూఢిల్లీ,జులై 22:** నీట్ పేపర్ లీక్ కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్‌తో న్యూఢిల్లీలో కాకరోచ్ జనతా పార్టీ చేపట్టిన నిరసనలు హింసాత్మకంగా మారిన విషయం తెలిసిందే. ఈ నిరసనలు ఉద్రిక్తతకు దారితీయడంతో ఢిల్లీ పోలీసులు వివిధ పోలీస్ స్టేషన్లలో మొత్తం 10 ఎఫ్.ఐ.ఆర్‌లు నమోదు చేశారు. న్యూఢిల్లీ జిల్లా పరిధిలో శాంతిభద్రతల ఉల్లంఘన, రాళ్లు రువ్వడం, సార్వజనిక ఆస్తుల ధ్వంసం వంటి ఘటనలపై పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో 4, కానాట్ ప్లేస్‌లో 3, అలాగే మందిర్ మార్గ్, బారాఖంబా రోడ్, కర్తవ్య పత్ స్టేషన్లలో ఒక్కొక్కటి చొప్పున కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. పోలీసులు జారీ చేసిన నిబంధనలను ఉల్లంఘించి, నిరసనకారులు హింసాత్మక ప్రవర్తన కనబరిచారని, ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా పోలీసు సిబ్బందిపై దాడులకు పాల్పడ్డారని వెల్లడించారు. ఈ నిరసన వెనుక ముందస్తు కుట్ర ఉందా అనే కోణంలో దర్యాప్తు జరుపుతున్న పోలీసులు, నిందితులను గుర్తించేందుకు దాదాపు 250కి పైగా వీడియో ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అలాగే నిరసన పేరుతో ఉద్దేశపూర్వకంగా దాడులకు పాల్పడుతున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు పోలీస్ ఉన్నతాధికారులు చెబుతున్నారు.

## ఆ విడియోలు చూసేంత సమయం లేదు సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్

### అత్యవసర విచారణకు నిరాకరణ

**న్యూఢిల్లీ, జులై 22:** నీట్ యుజి పరీక్షల్లో అవకతవకలపై ఢిల్లీలో సిజెపి ఆధ్వర్యంలో విద్యార్థులు చేపట్టిన 'చలో సంసద్ నిరసన సందర్భంగా పోలీసుల చర్యను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై అత్యవసర విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న వారిపై పోలీసులు క్రూరంగా వ్యవహరించారని, వీడియో ఆధారాలు ఉన్నాయని పిటిషనర్ తరఫు న్యాయవాది సిజెఐ సూర్యకాంత్ ధర్మాసనం దృష్టికి తెచ్చారు. వాటిని పరిశీలించి, గురువారం విచారణ చేపట్టాలని అభ్యర్థించారు. దీనిపై స్పందించిన సిజెఐ 'తాము వీడియోలు చూడాలనుకోవడం లేదు. వాటిని చూసే సమయం మాకు లేదు. మీ, మా సమయాన్ని వృథా చేయొద్దు అని స్పష్టం చేస్తూ తక్షణ విచారణ అభ్యర్థనను తోసిపుచ్చారు.

## కేంద్రానికి, ఢిల్లీ పోలీసులకు హైకోర్టు నోటీసులు

**న్యూఢిల్లీ, జులై 22:** 'పార్లమెంట్ మార్చ్ సందర్భంగా సిజెపి కార్యకర్తలపై ఢిల్లీ పోలీసులు దమనకాండను వ్యతిరేకిస్తూ ఢిల్లీ హైకోర్టులో పిల్ దాఖలైంది. దీనిపై ఢిల్లీ హైకోర్టు చీఫ్ జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ, జస్టిస్ తేజాస్ కరియా ఆధ్వర్యంలోని బెంచ్ బుధవారం విచారణ జరిపింది. ఈ అంశంపై నాలుగు వారాల్లోగా సమాధానం చెప్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని, ఢిల్లీ పోలీసులను ఆదేశిస్తూ నోటీసులు జారీ చేసింది. ఈ ఘటనలకు సంబంధించిన సిసిటివి ఫుటేజ్, విడియోగ్రఫీ, బాడీ క్యామ్ ఫుటేజ్ వంటి ఆధారాల్ని భద్రపరచాలని సూచించింది. పోలీసులు సమాధానం చెప్పిన తర్వాత అవసరమైతే రేజాయిండర్లు దాఖలు చేయొచ్చని పిటిషనర్లకు కోర్టు సూచించింది. ఢిల్లీ పోలీసులు, కేంద్ర ప్రభుత్వం తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు హాజరయ్యారు. కేసు తదుపరి విచారణ సెప్టెంబర్ 11న జరగనుంది. సీనియర్ న్యాయవాదులు ఎన్.హరిహరణ్, గోపాల్ శంకరనారాయణన్, వికాస్ సింగ్‌లు ఈ పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

### నగరంలో దోపిడి దొంగల బీభత్సం

## కోటికి పైగా సొత్తు అపహరణ

### 25 లక్షల నగదు 54 తులాల బంగారం చోరీ



**కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలో మరోమారు దోపిడి దొంగలు రెచ్చిపోయారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత నగరంలోని భగత్ నగర్ ప్రాంతంలో ముసుగులు ధరించి ఓ ఇంట్లోకి ప్రవేశించిన దుండగులు ఇంట్లో వాళ్ళందరిని బంధించి బీరువాలో ఉన్న 25 లక్షల నగదు 54 తులాల బంగారు,30 తులాల వెండి ఆభరణాలు అపహరించుకుపోయారు. నగల దుకాణం దోపిడీ ఘటన మరువకముందే మరో ఘటన చోటు చేసుకోవడం పోలీసులను ఉలిక్కిపడేలా చేసింది. మరోవైపు నగర ప్రజల భద్రత ఈ ఘటనలతో ప్రశ్నార్థకంగా మారింది. భగత్ నగర్ లో చోటు చేసుకున్న ఈ దోపిడీ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి దాదాపు 12.30 గంటల ప్రాంతంలో భగత్ నగర్‌కు చెందిన అజ్మత్ అలీ ఇంట్లోకి సుమారు 8 మంది ముసుగు దొంగలు ఆయుధాలతో చొరబడ్డారు. నాటు తుపాకులు, కత్తులు చూపిస్తూ ఇంట్లోని వృద్ధ దంపతులతో పాటు మహిళలపై దాడికి పాల్పడ్డారు. ప్రతిఘటించేందుకు యత్నించగా, వారి కాళ్లు, చేతులు కట్టేసి, నోటికి గుడ్డలు చుట్టి గదిలో బంధించారు. అనంతరం ఇంట్లోని బీరువాలను తెరిచి సుమారు 54 తులాల బంగారు ఆభరణాలు,30 తులాల వెండి ఆభరణాలు, 25 లక్షల నగదును అపహరించారు. దోపిడీ తర్వాత పారిపోయే క్రమంలో బాధితుల ఇంటి ముందు ఉన్న రెండు ద్విచక్ర వాహనాలను కూడాతీసుకెళ్లారు. బాధితుల సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. అధికారుల పర్యవేక్షణలో పోలీసులు, క్లూస్ టీమ్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. దుండగులు పారిపోతున్న సమయంలో ఒక డమ్మీ పిస్టల్ కిందపడిపోగా, దాన్ని క్లూస్ టీమ్ స్వాధీనం చేసుకున్నారు. దొంగలు ఎత్తుకెళ్లిన వాహనాల ఆధారంగా భగత్ నగర్ నుంచి మానేరు బ్రిడ్జి మీదుగా వరంగల్ వైపు పారిపోయినట్లు గుర్తించారు. ఘటన స్థలాన్ని సిపి గౌస్ ఆలం, డిసిపిలు సందర్శించి బాధితు లను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలింపులు ముమ్మరంచేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానితులను గుర్తించామని వారిపైనేరచరిత్ర ఉన్నట్లు కూడా గుర్తించడం జరిగిందని ఆ కోణంలో దర్యాప్తు జరుపుతున్నామని సిపి గౌస్ ఆలం తెలిపారు.

**ఇంటి దొంగల పనేనా?:** బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అజ్మత్ అలీ అల్లుడు వ్యాపారంలో నష్టపోయి కరీంనగర్కు వచ్చే స్థిరపడ్డాడని ఇక్కడ కూడా నష్టపోవడంతో తిరిగి వెళ్ళాడు అని తెలిపారు. నిందితులు ఉత్తర భారతదేశానికి చెందిన హిందీ యాసలో మాట్లాడినట్లు బాధితుడు ఇచ్చిన సమాచారంతో నిందితులు మీరట్ ప్రాంతానికి చెందినవారుగా అనుమానిస్తున్నారు. అస్మత్ అలీ ఇచ్చిన సమాచారంతో కేసు ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉన్నప్పటికీ ఘటనలో పాల్గొన్న ఎనిమిది మంది ఎవరనే దానిపై సందిగ్ధత వీడటం లేదు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితులు వరంగల్ వైపు వెళ్ళినట్టు ఆధారాలు లభ్యం కావడంతో అక్కడి నుంచి రైలు ద్వారా పారిపోయి ఉంటారా అనే కోణంలోనూ దర్యాప్తు జరుపుతున్నారు. నిందితులు పారిపోయిన దృశ్యాలు సీసీ కెమెరాల ఆధారంగా లభ్యమైనప్పటికీ ఘటనకు ముందు ఎటువైపు నుంచి వచ్చారనేది లభ్యం కాలేదు. అయితే నిందితులు ఇంట్లోనే ఉన్నారా లేక సమీప ప్రాంతంలో తలదాచుకొని ఘటనకు పాల్పడి ఉంటారా అనే కోణంలోనూ విచారణ జరుపుతున్నారు.

వార్త

అంతులేని కోరికలుండడమే పెద్ద దోషం. ఇతరుల గురించి చెడుగా చెప్పడమే పెద్ద పాపం. సత్యంగా ప్రవర్తించడమే నిజమైన తపస్సు.

- గురజాడ

# దేనికోసమీ పంతం?

పార్లమెంట్ వర్షాకాలపు సమావేశాల తరుణంలో కేంద్ర ప్రభుత్వానికి ఒక తలనొప్పి కాదు, పలు నిరసనలు ముప్పేట దాడి చేస్తున్నాయి. 'నీట్' ప్రశ్నపత్రాల లీక్‌కు బాధ్యత వహించాల్సిన వారెవరూ ధైర్యంగా నైతిక బాధ్యత తీసుకునేందుకు సిద్ధంగా లేరు. కొత్తగా వెలుగులోకి వచ్చిన 'కాక్రోచ్ జనతా పార్టీ' ఇదే అంశాన్ని చేపట్టి జంతర్ మంతర్‌లో అగ్గి పుట్టిస్తోంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అన్న ఒకే ఒక డిమాండ్‌తో 'కాక్రోచ్' పార్టీ గల నెల మొదటి వారంలో ఢిల్లీలో నిరసనలు చేపట్టింది. ఆనాటి నుంచి ఈనాటివరకు 'నీట్' బాధిత విద్యార్థులు,వారి తల్లిదండ్రులు, కేంద్ర ప్రభుత్వ నిర్వాకాన్ని వ్యతిరేకించేవారు, పేపర్ లీక్‌పై విరుచుకుపడినా హస్తినలో ఏలినవారు, 'కాక్రోచ్'లదేముందిలే అని ఆ అంశాన్ని ఎటూ తేల్చకుండా నాన్చారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఆయా శాఖల వ్యవహారాలు చూసే మంత్రులు తమ శాఖ పరిధిలోకి వచ్చే అంశాల విషయంలో విమర్శలు వెల్లువెత్తినప్పుడు, అవకతవకలు బయట పడినప్పుడు నైతిక బాధ్యత వహిస్తూ ఎంతో హుందాగా రాజీనామాలు చేసేవారు. ఇప్పుడలాంటిదేమీ లేదు సరి కదా! వర్షాకాల పార్లమెంటు సమావేశాల ప్రారంభం నాడు ఢిల్లీలో విపక్షాల నేతృత్వంలో కాక్రోచ్ జనతాపార్టీ కార్యకర్తల ఆందోళన చేపట్టేవరకు పట్టించుకోలేదు. కొత్తవిద్యార్థి ఉద్యమం ఊపందుకుంటున్నా ప్రభుత్వ పెద్దలకు చీమ కుట్టినట్లనిపించడం లేదు. నీట్ పేపర్ లీక్ మహాపాపమని ప్రధాని నరేంద్రమోడీ కూడా అంటున్నారు. కానీ ఆ శాఖ మంత్రి మీద ఈగవాలనివ్వడం లేదు. 'కాక్రోచ్' ఉద్యమానికి మద్దతు బాగా పెరుగుతోంది. వర్షాకాలపు పార్లమెంటు సమావేశాల సందర్భంగా 'కాక్రోచ్' ఉద్యమకారులు పార్లమెంటు ఎదుట ధర్నా నిర్వహిస్తూ కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోసం పట్టుబట్టారు. కానీ విద్యార్థుల ఉద్యమం సిజెపి ర్యాలీపై లాఠీచార్జి, కొందరు విద్యార్థులకు గాయాలు తగలడంతో ఉద్యమం మరింత తీవ్ర రూపం దాల్చింది. ఈ వ్యవహారం రాజధానిని కుదిపేసింది. కాగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నేతృత్వంలో మిత్రపక్షాలు వెంటరాగా గురువారం సాయంత్రం లోక్ కళ్యాణ్ మార్గ్‌లోని ప్రధాని నివాసాన్ని ముట్టడించారు. దాంతో కేంద్ర మంత్రి నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలన్న డిమాండ్ కాస్తా ప్రధాని నరేంద్ర మోడీ రాజీనామా చేయాలనే డిమాండ్‌గా మారిపోయింది. ఈ ఆకస్మిక పరిణామానికి హస్తినలో రాజకీయ పక్షాల వారు ఆశ్చర్యం చెందారు. ఇదే సందర్భంలో కాక్రోచ్‌జనతా పార్టీ, కాంగ్రెస్ తదితర మిత్రపక్షాల లక్ష్యాలు మారిపోవడం చర్చించదగినది. సిజెపి తమను రాజకీయ రొచ్చులోకి లాగొద్దని రాజకీయ పక్షాలను కోరుతోంది. సిజెపి విద్యార్థుల నిరసనకు మద్దతుగా 24రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్ చుక్ ఇంకా వైద్యసేవల్లోనే ఉన్నారు. అయినా సిజెపి తన పట్టు వీడడం లేదు. అలాగే ప్రధాని కూడా 'నీట్'విషయంలో అలా జరిగి ఉండకూడదని అంటూనే బాధ్యుల్ని నిర్ణయించడంలో కప్పదాటు వైఖరి అవలంబిస్తున్నారనే అపప్రథ పొందారు. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసి ఉన్నట్లయితే సిజెపి ఆగ్రహం మొదట్లోనే చల్లారిపోయి ఉండేది. వారు జంతర్ మంతర్ వరకు వచ్చే అవకాశమే ఉండేది కాదు. ఈ ఉద్యమంలో కాంగ్రెస్ మిత్రపక్షాలు నిర్వహించే ఉద్యమం మరింత ముందుకు పోకుండా అక్కడే నిలబడి పోయి ఉండేది. కానీ పార్లమెంట్‌లో రచ్చరచ్చవుతోంది. లోక్‌సభ రాజ్యసభలో మూడో రోజు బుధవారం కూడాకాంగ్రెస్ తదితర విపక్షాల సభ్యులంతా నల్లదుస్తులు ధరించి వచ్చారు. ఇంతక్రితం మంగళవారం కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీతోబిజెపి మంత్రి జితేంద్ర సింగ్ భేటీ అయ్యారు. విషయాన్ని సంయమనంతో పరిశీలించాలని అనుకున్నారో ఏమో! కర్ర విరగకుండా, పాము చావకుండా సమస్యను ఒకొలిక్కి తీసుకురావాలన్న ప్రయత్నం జరిగింది. మరోపక్క కేంద్ర ప్రభుత్వంతో చర్చలకు సిజెపి అంగీకరించింది. ఈ చర్చల్లో ఎవరున్నా 'నీట్' గురించి ఏదైనా అడగండి, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తప్ప అనే ధోరణిలో ఉంటే సిజెపి ఉద్యమాన్ని ఆపలేరు. విద్యార్థులు,నిరుద్యోగులేఅత్యధిక మంది ఉన్న సిజెపి నిరసనలను ఆపకపోతే ఆ ఉద్యమం కేంద్ర ప్రభుత్వపాలనపై ప్రభావం చూపిస్తుంది.గతంలో ఉన్న అంశాలకు తోడు తాజాగా విద్యార్థులపైపోలీసుల లాఠీచార్జి కొత్తగా వచ్చి చేరింది. ఎన్నో దేశాల్లో 'జెన్‌జి' ఉద్యమాలు పెరిగిపోతున్న పరిస్థితులను కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోకపోతే మరింత ఇరకాటంలో చిక్కుకుంటుంది. రాహుల్, జితేంద్ర సింగ్‌ల మధ్య భేటీలో'నీట్' పరీక్షల వైఫల్యాలపై సభలో చర్చించేందుకు అంగీకారం కుదిరినా కాంగ్రెస్ ఆ మాటకు కట్టుబడి ఉండలేదని బిజెపి ఆరోపిస్తోంది. ఇంతకూ ఎవరి పంతాలు వారివన్నట్లు ఉన్న ఈ వ్యవహారంలో సమస్యల ముడి వీడితేనే తప్ప పరిష్కారం దొరకదు. ప్రశ్నపత్రాల లీకేజీలు నివారించడంజాతీయ బాధ్యత అని చెబుతున్న ప్రధాని నిరసనలు చేపడుతున్న యువత డిమాండ్‌లపట్ల సానుకూల స్పందన వ్యక్తం చేయలేకపోయారు. పైగా పిల్లల్ని రెచ్చగొట్టవద్దని యువతను సరైన మార్గంలో నడిపించే అంశంలో సమాజం బాధ్యతాయుతంగా వ్యవహరించాలంటూ కాంగ్రెస్,తదితర పక్షాలకు హితవు చెప్పారు. అంతేతప్ప సిజెపి సమస్యను పరిష్కరించే బాధ్యత,అవకాశం తనకే ఉందన్న విషయాన్నిపక్కన పెట్టినట్లుంది. రాహుల్ గాంధీ అరెస్టు కాంగ్రెస్ శ్రేణుల్లో ఆగ్రహావేశాలు నింపింది. దేశవ్యాప్తంగా బిజెపి, కాంగ్రెస్ శ్రేణుల మధ్య దాడులు మొదలయ్యాయి.'నీట్' పేపర్‌లీక్‌జీ అంశంపై విద్యార్థిల్లో గూడుకట్టుకున్న అసంతృప్తి నుంచి బయటవేసే బాధ్యత కేంద్ర ప్రభుత్వం చేతిలోనేఉంది. తక్షణమే ఈ సమస్య పరిష్కార దిశగా అడుగులు వేయాలి.

చేయక తప్పని పనిలో కూడా జాప్యం చేస్తే కాలం ఆపనిని నిస్సారంగా మార్చి వేస్తుంది.



జె.ముర్రే

దేవుడు మనకు రెండు చెవులు, రెండు కళ్లు, ఒక నాలుక ఇచ్చింది ఎక్కువ చూడమని, వినమని, తక్కువగా మాట్లాడమని.



జి. ఇలియట్

## ప్రజావాక్కు



### జ్యోతిష్కులకు సవాల్..

జాతకాలు జ్యోతిష్యం చెప్తామనేవారిని నమ్మవద్దు. మోసం, అబద్దం, బూటకం. జ్యోతిష్యం చెప్పడం మా తాత ముత్తాతలనుండి వారసత్వంగా వస్తుంది. మేము కొండ జాతివారము, మీజీవితాలను మారుస్తాము, మీ వివాహ సమస్యలు, ఆర్థిక సమస్యలు, కోర్టుసమస్యలు ఇట్టే తీరుస్తాము, దిష్టి నర దిష్టి లేకుండా చేస్తాము, దుష్టగ్రహ శక్తులనుండి రక్షిస్తాం,ఈ నంబరుకు ఫోన్ చేయండి, ముందుగా ఇంత డబ్బులు పంపండి, పని జరగక పోతే మీ డబ్బు వాపసు అంటూ టీవీలలో తెగ ప్రకటనలు వస్తున్నాయి. వీటిని అరికట్టవలసిన బాధ్యత ప్రభుత్వాల మీద ఉన్నది. కానీ అవి ఆ పని చెయ్యటం లేదు. పైగా అరికట్టవలసిన వారేదొంగబాబాల చుట్టూ తిరుగుతున్నారు. మూఢ నమ్మకాలను పెంచీ పోషిస్తున్నారు. జ్యోతిష్యం అబద్ధం.మోసం,దగా,ప్రపంచంలో జ్యోతిష్యం నిజమని ఇంతవరకు ఋజువు కాలేదు. జ్యోతిష్యం నిజమని నిరూపిస్తే కోట్ల రూపాయలు బహుమతిగా ఇస్తామని హేతువాదులు ప్రపంచమంతా సవాళ్లు చేస్తున్నారు. ఒక జ్యోతిష్కుడి వలన 2001లో నేపాల్ రాజ కుటుంబం మొత్తం హత్యగావింపబడ్డారు.

- నార్నెవెంకట సుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### ఎక్కడవేసిన గొంగళి అక్కడే..

కొన్ని గ్రామాల్లో పాలకవర్గం కొలువుదీరి ఏడు నెలలైనా ఎక్కడిగొంగడి అక్కడే వేసినట్లే ఉంది గ్రామాల్లో పరిస్థితి. ఎన్నికలప్పుడు పెద్ద పెద్ద హామీలిచ్చిన్న లీడర్లు అమలు చేయకుండా అటకెక్కించారు. వీళ్ల మీదా వాళ్ళు వాళ్ళ మీద వీళ్ళు మాయమాటలు చెప్పి అభివృద్ధి చేయకుండా అధోగతి పాలు చేస్తున్నారు. వీళ్లను ఎక్కడిక్కడ లెక్క లెక్కఅడిగి నిలదీస్తేనే అభివృద్ధి జరుగుతుంది. లేదంటే వీళ్ళునాటకాలు ఆడుతూనే ఉంటారు పదవీకాలం అంత.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### సమస్యలను వెంటనే పరిష్కరించాలి

ఏపిలోని అన్ని జిల్లాల కేంద్రాల్లో ప్రజల ఫిర్యాదులు వివిధ శాఖలకుసంబంధించి ప్రత్యక్షంగా జిల్లా మేజిస్ట్రేట్ ,కలెక్టర్ వారు స్వీకరణ చేస్తూ వారికి రసీదు ఇవ్వడం ఎంతో తృప్తికరం. వారు సమస్య స్థితిని వ్యక్తంచేయడం కూడా కొంత ఉపశమనం ఉంటుంది. ఐతే ఫిర్యాదుల సంఖ్యాశాఖలవారీ ప్రకటనతోపాటు, దీర్ఘకాల సమస్యలకు పరిష్కారానికి హెచ్చు ప్రాధాన్యత ఉంటుంది.

-బి. మేఘనాదం, విశాఖపట్నం

### పని లేని పథకం

వీబీజీరామ్‌జీలో ఎక్కువ పని దినాలు తప్ప కూలీలకు పని లేదు అని, కాంట్రాక్టర్స్ లూటీ ఉంటుందని ఒక విమర్శ ఉంది. దానికి ప్రభుత్వం చెప్పే సమాధానం ఏమిటి అంటే స్థిరమైన ఆస్తుల సృష్టి చేయడమే లక్ష్యం అని ప్రభుత్వం చెపుతుంది. ప్రభుత్వం పెంచిన 125 రోజుల లక్ష్యం చేరుకోగ లమా అనేది కొంత మంది అభివృద్ధి ఆధారిత ఆర్థిక వేత్తల మాట. వాళ్లవాదన నిజమే. ఎందుకులంటే సగటు కూలీలకు పని దినాలు కల్పించడంలో చాలా రాష్ట్రాలు 40 నుండి 50 మధ్యనే కొట్టుమిట్టడుతూ ఉన్నాయి. పైపెచ్చు తెలంగాణ లాంటి రాష్ట్రాలలో వనమాహోత్సవం పేరుతో చెట్లను పెంచే బృహత్తార కార్యక్రమాలుపెడుతున్న నేపథ్యంలో గ్రామపంచాయితీలు తమ లక్ష్యాలు చేరుకోవడంలో మునుగా లాంటివి ఇతోధికంగా పనిచేస్తాయి. 60శాతం కూలికి 40శాతం గ్రామ పంచాయితీకి ఆదాయం సమాకోరుతుంది. అంటే మునుగా పెట్టె రైతు ఏడాది పొడుగునా తానుమాత్రమే లబ్ది పొందడం కాదు గ్రామపంచాయితీకి లబ్ది చేకూరుస్తున్నాడు అన్నమాట.

- భారత అవినాష్, జనగామ

### అలవాట్లు మార్చుకోవాలి

ఆధునిక సమాజం ఎంతో పురోగమిస్తున్నకొద్దీ రోగాలు కూడా ముసురుకుంటున్నాయి. సామాన్యుడి నుండి కోటీశ్వరుడి వరకు జీవనశైలి వ్యాధుల బారిన పడుతున్నారు. పాతకాలం రోజులే బాగుండే అని తాత ముత్తాతలను గుర్తుచేసుకొంటున్నారు. కానీమారిన జీవన శైలిని మార్చుకొనేందుకు ఇష్టపడట్లేదు. మనం తినేఆహారం, తాగే పానీయాలు, శారీరక శ్రమ తగ్గడం, వాతావరణ కాలుష్యం, నీటి కాలుష్యం,ప్లాస్టిక్ భూతం, మద్యపానం ధూమపానం లాంటి వ్యసనాలు ఆరోగ్యాన్ని కాటేస్తున్నాయి. ఇలాంటి వ్యసనాలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది. కుటుంబ సభ్యుల ఆరోగ్యాన్ని కూడా దృష్టిలో పెట్టుకోవాలి.

- టి. మురళీ మోహన్, హైద్రాబాద్

### సాంకేతిక లోపం

మీసేవ మొబైల్ యాప్‌లోని టెంపుల్ ఆన్‌లైన్ సర్వీసెస్ విభాగంలో ఆన్‌లైన్ సేవలు ఓపెన్ కావడం లేదు. తరుచూ సాంకేతిక లోపాలు ఎదురవుతున్నాయి. ఈ ట్యాబ్ ద్వారా దేవాలయాలకు సంబంధించిన పూజావివరాలు, సేవల సమాచారం ప్రజలకు అందుబాటులో ఉండాల్సి ఉంది. కానీ ప్రస్తుతం ఈలోపం కారణంగా అనేకమంది భక్తులు, వినియోగదారులు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారు.

- పి. రాజశేఖర్, నల్గొండ జిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# వర్సిటీల చుట్టూ వివాదాలెందుకు?

ప్రజా సంస్థలకు సంబంధించిన నిర్ణయాలు తక్షణ అవసరాల దృష్టితో మాత్రమే కాకుండా, దీర్ఘకాల సామాజిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని తీసుకోవాలి. నాంపల్లి ప్రాంగణాన్ని దాని విద్యా, పరిశోధనా, సాంస్కృతిక స్వరూపంతో పరి రక్షించడం. బాచుపల్లిని భవిష్యత్ విస్తరణకు, ప్రపంచ స్థాయి తెలుగు సాంస్కృతిక సముదాయంగా అభివృద్ధి చేయడం, పురావస్తు సంపదకు అత్యాధునిక సంరక్షణ, ప్రదర్శన వేదికలను కల్పించడం, అంకిత భావంతో కృషి చేస్తే ఈ మూడు లక్ష్యాలు ఒకేసారి సాధ్యమే. నిజానికి సురవరం ప్రతాప రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం విషయం లో తెలంగాణ ప్రభుత్వం ముందున్నది సమస్య కాదు. భవిష్యత్ తరాలను నిర్మించడానికి సమస్య రూపంలో ఎదురైన, సంస్కృతి, భాష, విద్యారంగాల పరిరక్షణకోసం ప్రణాళిక బద్ధంగా విధానపరమైన నిర్ణయం తీసుకుని మంచి పేరు తెచ్చుకునే చక్కటి అవకాశం.



మల్లాది వేంకట గోపాలకృష్ణ

సమాజం తన భవిష్యత్తును నిర్మించుకోవడానికి రహదారులు, పరిశ్రమలేకాదు సాంకేతికత కూడా అవసరమే. అదే సమాజం తన అస్తిత్వాన్ని నిలబెట్టుకోవాలంటే జ్ఞానాన్ని, సంస్కృతిని, చరిత్రను తరతరాలకు అందించే బలమైన విద్యాసంస్థలు కూడా చాలా అవసరం. అందుకే ప్రపంచవ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు కేవలం విద్యను బోధించే కేంద్రాలే కాదు అవి సమాజపు మేధో సంపదను, సాంస్కృతిక స్మృతిని, పరిశోధనా సంప్రదాయాలను సంరక్షించే సంస్థలుగా భావిస్తారు. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఒక సాధారణ విశ్వవిద్యాలయం కాదు. తెలుగు భాష, సాహిత్యం, సంగీతం, నృత్యం, జానపద సంప్రదాయాలు, శాసనాలు, ప్రాచీన గ్రంథాలు, భాషా పరిశోధన వంటి అనేక అంశాలను, రంగాలను ఒకే విద్యా వేదికపై సమన్వయం చేసిన అరుదైన సంస్థ. అందువల్ల నాంపల్లి ప్రాంగణంపై జరుగుతున్న చర్చను కేవలం 'స్థల వినియోగం' అనే కోణంలో చూడడం సరిపోదు. ఇది ఒక సాంస్కృతిక నిర్ణయం. అంతకంటే ముఖ్యంగా, భవిష్యత్ తరాల పట్ల మన బాధ్యతను నిర్వచించే నిర్ణయం. భాషలు కేవలం జన బాహుళ్యంలో ప్రచారంలో ఉండడం వల్ల మాత్రమే జీవించవు. వాటిని పరిశోధించే విశ్వవిద్యాలయాలు, ప్రచురించే ప్రచురణా కేంద్రాలు, భద్రపరిచే గ్రంథాలయాలు, అభ్యసించే విద్యార్థులు, బోధించే అధ్యాపకులు, ప్రోత్సహించే ప్రభుత్వాలు అన్నీ కలిసి విస్తృత స్థాయిలో కృషి చేసినప్పుడే ఒక భాష సజీవంగా ఉంటుంది. తెలుగు విశ్వవిద్యాలయం అలాంటి బాధ్యతను భుజంపై వేసుకుని సజావుగా, సక్రమంగా నిర్వహిస్తున్న సంస్థ. తెలుగు భాషకు సంబంధించిన జ్ఞానాన్ని సృష్టిస్తారు. సాహిత్యాన్ని విశ్లేషిస్తారు. కళలను సంరక్షిస్తారు. అంతరించిపోతున్న జానపద సంప్రదాయాలను నమోదు చేస్తారు. పరిశోధకులను తీర్చిదిద్దుతారు. భవిష్యత్ తరాలకు ఒక సాంస్కృతిక నిరంతరత్వాన్ని అందిస్తారు. అందుకే ఇటువంటి విశ్వవిద్యాలయాల గురించి తీసుకునే ప్రతి నిర్ణయం తక్షణ అవసరాలను మాత్రమే దృష్టిలో పెట్టుకుని కాకుండా, కనీసం మరో నూరు సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తీసుకోవాలి. కొన్ని ప్రదేశాలు కేవలం భౌగోళికపరమైన గుర్తింపులు కావు. అవి కొన్ని ఆలోచనలకు ప్రతీకలు. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం నాంపల్లి ప్రాంగణం కూడా అలాంటి ప్రదేశమే. 1975లో జరిగిన తొలి ప్రపంచ తెలుగు మహాసభలు తెలుగు భాషకు ఒక శాశ్వత విద్యా, సాంస్కృతిక కేంద్రం అవసరమనే ఆలోచనకు బీజం వేశాయి.ఆ ఆలోచనకు రూపం దాల్చినప్రాంగణమే నాంపల్లి. తెలుగు భాష, సాహిత్యం,కళలు, సంస్కృతికి ఒక విశిష్ట విశ్వవిద్యాలయం ఉండాలన్న స్వర్గీయ నందమూరి తారక రామారావు దూరదృష్టికి ఇది ప్రతిరూపం. ప్రపంచంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు తమ చరిత్రను కేవలం పుస్తకాలలోనే కాదు, తమ ప్రాంగణాల్లో కూడా సంరక్షించుకుంటాయి. ఎందుకంటే సంస్థాగత నిరంతరత్వం కూడా విద్యా నాణ్యతలో ఒక భాగమే. నాంపల్లి ప్రాంగణం విషయంలో కూడా ఇదే దృక్పథం చాలా అవసరం. ఉన్నత విద్యాసంస్థలను బలోపేతం చేయడం కూడా ప్రభుత్వ బాధ్యతే. ఈ రెండు లక్ష్యాలు పరస్పర విరుద్ధాలు కావు. ఆ రెండింటినీ సమన్వయం చేసే మార్గాన్ని అన్వేషించడం కూడా అదే దూరదృష్టిని ప్రదర్శించే అవకాశం ఉంది. ప్రజా జీవితంలో ప్రతి సమస్యకు రెండు రకాల పరిష్కారాలు ఉంటాయి. ఒకటి తక్షణ అవసరాన్ని తీర్చేది. మరొకటి భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని తీసుకునేది. మంచి పాలన రెండో మార్గాన్ని ఎంచుకుంటుంది. నాంపల్లి ప్రాంగణానికి సంబంధించిన అంశంలో కూడా అలాంటి దూరదృష్టి అవసరం. ఒకవైపు చారిత్రక పురావస్తువులు



మరోవైపు తెలుగు భాషా, సాంస్కృతిక అధ్యయనానికి అంకితమైన విశ్వవిద్యాలయం. ఈ రెండూ తెలంగాణ గర్వించదగ్గ సంపదలే. ఒకదానిని కాపాడాలంటే మరొకటి బలహీనపడాల్సిన అవసరం లేదు. ప్రజాసంస్థల నిర్వహణలో ఇదే ప్రాథమిక సూత్రం. పురావస్తువులు చరిత్రను భద్రపరుస్తాయి. విశ్వవిద్యాలయాలు ఆ చరిత్రకు అర్థం చెప్పే పరిశోధకులను తయారు చేస్తాయి. మ్యూజియంలు వారసత్వాన్ని ప్రదర్శిస్తాయి. విశ్వవిద్యాలయాలు ఆ వారసత్వాన్ని అధ్యయనం చేస్తాయి, కొత్త తరాలకు పరిచయం చేస్తాయి. అందువల్ల ఈ రెండింటి మధ్య సంఘర్షణ కాదు, సమన్వయం ఉండాలి. నిత్యం వేలాదిమంది విద్యార్థులు సమున్నతమైన విద్యను ఆర్జించే విద్యాలయాన్ని పురాతన వస్తువులను భద్రపరచే జీవం లేని సౌధంగా మార్చాలనుకోవడం పూర్తిగా పొరపాటు నిర్ణయమే అవుతుంది. అటువంటి నిర్ణయానికి తగిన మూల్యాన్ని ఏ ప్రభుత్వమైనా దీర్ఘకాలంలో చెల్లించుకుని తీరక తప్పని పరిస్థితి ఏర్పడుతుంది.బాచుపల్లి ప్రాంగణం గురించి ఇప్పటివరకు ప్రధానంగా విశ్వవిద్యాలయ విస్తరణ కోణంలోనే చర్చ జరిగింది. కానీ తెలంగాణ ప్రభుత్వం మనసు పెట్టి చూస్తే దాన్ని తెలంగాణ సాంస్కృతిక భవిష్యత్తుకు ఒక విశాలమైన అవకాశంగా తోస్తుంది. తెలంగాణ ప్రభుత్వం తలచుకుంటే బాచుపల్లిలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఒక సమగ్ర తెలుగు సాంస్కృతిక ప్రాంగణాన్ని అభివృద్ధి చేసే అవకాశం ఉంది. ఆధునిక మ్యూజియం, డిజిటల్ హెరిటేజ్ ఆర్కైవ్, పురావస్తు పరిరక్షణ కేంద్రం, జానపద కళల గ్రామం, కళాకారుల శిక్షణా కేంద్రాలు, పరిశోధనా ప్రయోగశాలలు, విద్యార్థులు, పరిశోధకుల కోసం ఆధునిక అధ్యయన వేదికలు మొదలైన వాటన్నింటినీ ప్రభుత్వం పూనుకుని బాచుపల్లి ప్రాంగణంలో ఓ చక్కటి ప్రణాళికతో అభివృద్ధి చేస్తే, అది కేవలం తెలంగాణకే కాదు, దేశవ్యాప్తంగా ఒక ఆదర్శ సాంస్కృతిక నమూనాగా నిలిచే అవకాశం ఉంది. అలా చేస్తే నాంపల్లి తన చారిత్రక, విద్యా పాత్రను కొనసాగిస్తుంది. బాచుపల్లి భవిష్యత్ విస్తరణకు కేంద్రంగా ఎదుగుతుంది. రెండు ప్రాంగణాలూ పరస్పరం ఒకదానిని మరొకటి బలపరుస్తాయి.నాంపల్లి ప్రాంగణానికి సంబంధించిన నిర్ణయం ఈ తరం అవసరాలకే పరిమితం కాదు. ఇది రాబోయే దశాబ్దాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని తీసుకోవాల్సిన నిర్ణయం. తెలుగు భాషపై పరిశోధన మరింత విస్తరిస్తుంది.డిజిటల్‌ఆర్కైవింగ్కు కొత్త అవకాశాలు వస్తాయి. జానపద విజ్ఞానాన్ని భద్రపరచాల్సిన అవసరం పెరుగుతుంది. అంతర్జాతీయ స్థాయిలో తెలుగు అధ్యయనాలపై ఆసక్తి మరింత పెరగవచ్చు. ఈ అవసరాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుంటే, ఇప్పటికే ప్రజల విశ్వాసాన్ని సంపాదించిన ఒక చారిత్రక విద్యా ప్రాంగణాన్ని మరింత బలోపేతం చేయడమే దీర్ఘకాల ప్రజా ప్రయోజనానికి అనుకూలమైన నిర్ణయం. ఒక భాషకు, ఒక సంస్కృతికి, ఒక సమాజానికి నిరంతరత్వాన్ని అందించగల సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంపై జరిగే చర్చను ఒక స్థల వివాదంగా కుదించలేం. అది తెలంగాణ తన భాషా సాంస్కృతిక సంస్థల వల్ల ఎంత బాధ్యతతో వ్యవహరిస్తుందనే విషయానికి ఒక ప్రమాణంగా మిగిలిపోతుంది. నేటి నిర్ణయం ఏదైనా కళారూపాలను సంరక్షించే కళాకారుడిలపై ప్రభావం చూపుతుంది. భాషా అధ్యయనాన్ని ఎంచుకునే భావితరాలపై ప్రభావం చూపుతుంది. అందుకే ప్రజా సంస్థలకు సంబంధించిన నిర్ణయాలు తక్షణ అవసరాల దృష్టితో మాత్రమే కాకుండా, దీర్ఘకాల సామాజిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని తీసుకోవాలి. నాంపల్లి ప్రాంగణాన్ని దాని విద్యా, పరిశోధనా, సాంస్కృతిక స్వరూపంతో పరి రక్షించడం. బాచుపల్లిని భవిష్యత్ విస్తరణకు, ప్రపంచ స్థాయి తెలుగు సాంస్కృతిక సముదాయంగా అభివృద్ధి చేయడం, పురావస్తు సంపదకు అత్యాధునిక సంరక్షణ, ప్రదర్శన వేదికలను కల్పించడం, అంకిత భావంతో కృషి చేస్తే ఈ మూడు లక్ష్యాలు ఒకేసారి సాధ్యమే. నిజానికి సురవరం ప్రతాప రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం విషయంలో తెలంగాణ ప్రభుత్వం ముందున్నది సమస్య కాదు. భవిష్యత్ తరాలను నిర్మించడానికి సమస్య రూపంలో ఎదురైన, సంస్కృతి, భాష, విద్యారంగాల పరిరక్షణకోసం ప్రణాళిక బద్ధంగా విధానపరమైన నిర్ణయం తీసుకుని మంచి పేరు తెచ్చుకునే చక్కటి అవకాశం. •

# తగ్గుతున్న జననాలతో మారుతున్న జనాభా చిత్రం

సి. హెచ్. ప్రతాప్


భారత్ జనాభా నిర్మాణంలో నిశ్శబ్దంగా ఒక కీలక మార్పు చోటు చేసుకుంటోంది. ఒకవైపు మొత్తం సంతానోత్పత్తి రేటు (టోటల్ ఫెర్టిలిటీ రేట్ - టీఎఫ్ఆర్) తగ్గుతుండగా, మరోవైపు వృద్ధుల జనాభా క్రమంగా పెరుగుతోంది. ఈ రెండు పరిణామాలు భవిష్యత్ ఆర్థికవ్యవస్థ, ఆరోగ్యరంగం, సామాజిక భద్రతపై గణనీయ ప్రభావం చూపనున్నాయి. జనాభా పెరుగుదల మాత్రమే కాదు, జనాభా నాణ్యత, వయో నిర్మాణం కూడా అభివృద్ధికి కీలకమనే విషయాన్ని విధాన నిర్ణేతలు గుర్తించాల్సిన సమయం ఆసన్నమైంది. ఒక మహిళ తన జీవితకాలంలో సగటున ఎంతమంది పిల్లలకు జన్మనిస్తుందో తెలిపే సూచికనే మొత్తం సంతానోత్పత్తి రేటు (టోటల్ ఫెర్టిలిటీ రేట్ - టీఎఫ్ఆర్) అంటారు.సాధారణంగా 2.1ను ప్రత్యామ్నాయ జననాల రేటు (రిప్లేస్‌మెంట్ లెవెల్ ఫెర్టిలిటీ)గా పరిగణిస్తారు. ఈ స్థాయిలో జననాలు కొనసాగితే జనాభా దీర్ఘకాలంలో స్థిరంగా ఉంటుంది. అంతకంటే తక్కువగా ఉంటే భవిష్యత్‌లో యువజనాభా తగ్గేఅవకాశం ఉంటుంది. ఇటీవలి గణాంకాల ప్రకారం, భారత్‌లో 2019-21 నుంచి 2023-24 వరకు మొత్తం సంతానోత్పత్తి రేటు 2.0 వద్దే స్థిరంగా కొనసాగింది. ఇది ప్రత్యామ్నాయ స్థాయి కంటే తక్కువ. దాదాపు ప్రతి రాష్ట్రంలో టీఎఫ్ఆర్ తగ్గడం లేదా స్థిరంగా ఉండడం గమనార్హం. అయితే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, నాగాలాండ్ రాష్ట్రాల్లో మాత్రం స్వల్ప పెరుగుదల నమోదైంది. మరోవైపు బీహార్‌లో దేశంలోనే అత్యధిక టీఎఫ్ఆర్ 2.7గా ఉన్నప్పటికీ, గతంలో నమోదైన 3.0తో పోలిస్తే తగ్గుముఖం పట్టడం విశేషం. సంతానోత్పత్తి రేటు తగ్గడం అంటే కుటుంబ నియంత్రణ విజయవంతమైందనిమాత్రమే అర్థం కాదు. విద్యావకాశాల పెరుగుదల, మహిళలఉపాధి, పట్టణీకరణ, వివాహాల ఆలస్యం, జీవన వ్యయంపెరగడం వంటి అనేక సామాజిక ఆర్థిక అంశాలు దీనికి కారణమవుతున్నాయి. అయితే దీర్ఘకాలంలో యువ జనాభా తగ్గిపోవడం వల్ల శ్రామిక శక్తి క్షీణించే ప్రమాదం కూడా ఉంది. అదే సమయంలో భారత్‌లో వృద్ధుల జనాభా వేగంగా పెరుగుతోంది. అభివృద్ధి చెందిన పాశ్చాత్య దేశాలు,తూర్పు ఆసియా దేశాలు అధిక ఆదాయ స్థాయికి చేరుకున్న తర్వాత వృద్ధాప్య సమాజాలుగా మారాయి. కానీ భారత్‌మాత్రం దిగువమధ్య ఆదాయ దేశంగానే కొనసాగుతూనే వృద్ధాప్య సమాజం వైపు అడుగులు వేస్తోంది.ఇది దేశానికి కొత్తసవాలుగా మారనుంది. ప్రస్తుతం గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వృద్ధులకు అవసరమైన బహుళ వ్యాధులచికిత్సకు పూర్తిస్థాయిలో సిద్ధంగా లేవు. గుండె జబ్బులు, మధుమేహం, రక్తపోటు, కీళ్ల వ్యాధులు,మతిమరుపు వంటిసమస్యలు ఒకేసారి ఎదుర్కొనే వృద్ధులకు ప్రత్యేక జెరియాట్రిక్ కేర్ అవసరం.అధికశాతం వృద్ధులు ఇప్పటికీ స్వల్పమొత్తంలోని ప్రభుత్వ పింఛన్లపైనే ఆధారపడుతున్నారు. ఇదివారి ఆర్థిక భద్రతకు సరిపోదు.ఈ పరిస్థితులను దృష్టిలోఉంచుకుని ప్రభుత్వం సమగ్ర జనాభా విధానం రూపొందించాలి. ప్రతిజిల్లా ఆసుపత్రిలో ప్రత్యేక జెరియాట్రిక్ వార్డులు ఏర్పాటు చేయడం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వృద్ధులకుఅనుకూల సేవలు విస్తరించడం,లాంగ్‌టర్మ్ కేర్ వ్యవస్థను అభివృద్ధి చేయడం అవసరం. సామాజిక భద్రతా పింఛన్లను పెంచడంతోపాటు, హెల్త్ ఇన్సూరెన్స్ పరిధిని విస్తరించాలి. యువతకు నైపుణ్యాభివృద్ధి, మహిళల ఉపాధి, కుటుంబాలకు శిశు సంరక్షణ సౌకర్యాలు కల్పించడం ద్వారా సమతుల్య జనాభా నిర్మాణాన్ని ప్రోత్సహించాలి. జనాభా మార్పులను కేవలం గణాంకాలుగా కాకుండా భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా చూడాలి. •

# ఇక కొత్త సంస్కరణలతో 'ఒసిఐ' కార్డులు!



యేచన్ చంద్ర శేఖర్

భారతదేశం 2005ఆగస్టులోపౌరసత్వ చట్టం 1955 సవరణ ద్వారా ఓవర్సీస్ సిటిజన్‌షిప్ ఆఫ్ ఇండియా (ఓసిఐ) పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ కార్యక్రమాన్ని 2006 జనవరిలో హైదరాబాద్‌లో జరిగిన ప్రవాస భారతీయ దివస్ సదస్సులో లాంఛనంగా ప్రారంభించారు.ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రవాస భారతీయుల నుండి 'ద్వంద్వ పౌరసత్వం'కోసం వస్తున్న నిరంతర డిమాండ్లను నెరవేర్చడానికి ఈ కార్డును ప్రవేశపెట్టారు. భారత రాజ్యాంగం ద్వంద్వ పౌరసత్వాన్ని ఖచ్చితంగా నిషేధించినందున, ఒక వారధిగా ఓసిఐని సృష్టించారు. ఇది భారతీయ సంతతికి చెందిన విదేశీయులకు (పిఐఐ పర్సన్ ఆఫ్ ఇండియన్ ఆరిజిన్) భారతదేశంలో నిరవధికంగా నివసించేందుకు, ఉపాధి పొందేందుకు హక్కును, జీవితకాల వీసాను అందిస్తుంది. కానీ అసలు భారతీయ పౌరసత్వం లేదా ఓటింగ్ హక్కులను మంజూరు చేయదు. ప్రపంచవ్యాప్తంగా సుమారు 53లక్షల మంది నమోదిత ఓసిఐ కార్డుదారులున్నారు. వీరిలో అత్యధికులు భారతీయులు అధికంగా నివసించే అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్, ఆస్ట్రేలియా కెనడాలలో ఉన్నారు. దరఖాస్తుదారు గతంలో భారత పౌరసత్వం కలిగి ఉన్నా, 1950 జనవరి 26 నాటికి భారతదేశ పౌరుడు లేదా పౌరురాలిగా మారడానికి అర్హత కలిగి ఉన్నా, లేదా అటువంటి అర్హత కలిగిన వ్యక్తి సంతానం, మనవలు లేదా మునిమనవలు అయి ఉన్నా, సాధారణంగా అటువంటి వ్యక్తులు ఓసిఐ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. అయితే, పాకిస్థాన్,బంగ్లాదేశ్ పౌరులు మాత్రం దీనికి అర్హులు కారు. ఓసిఐ కార్డుదారులకుప్రామాణిక వీసా అవసరం లేకుండా భారతదేశంలో పర్యటించడానికి నివసించడానికి బహుళప్రవేశ, జీవితకాల ప్రాప్యతను అందిస్తుంది. భారతదేశంలో ఎంత కాలం బస చేసినా ఫారిన్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ వద్ద నమోదు చేసుకోవలసిన అవసరం నుండి వీసాదారునికి మినహాయింపు లభిస్తుంది. దేశీయ విమాన ఛార్జీలుజాతీయ స్మారక చిహ్నాలలో సమాన ప్రవేశ రుసుములతో సహా, ప్రవాస భారతీయుల (ఎన్నారైల)తో సమానమైన ఆర్థిక, ద్రవ్య,విద్యా ప్రయోజనాలను ఓసిఐ కార్డుదారులకు అందిస్తుంది. విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా)ప్రకారం, ఓసిఐ కార్డుదారులు భారతదేశంలో వ్యవసాయ భూములు,తోటభూములు లేదా ఫామ్‌హౌస్‌లను చట్టబద్ధంగా కొనుగోలు చేయలేరు. అయితే, వీరు ఈ ఆస్తులను వారసత్వం ద్వారా లేదా భారతదేశంలో నివసిస్తున్న బంధువు నుండి బహుమతిగా పొందవచ్చు.అయితే, వాటిని మరొక ఓసిఐ కార్డుదారుకు గానీ లేదా విదేశీ జాతీయునికి గానీ అమ్మకూడదు. భారతదేశం ద్వంద్వ పౌరసత్వాన్ని అనుమతించదు కనుక ఓసిఐ కార్డు ద్వంద్వ పౌర




సత్వ అనుమతి పత్రం కాదు. ఓసిఐ కార్డుదారులు విదేశీ జాతీయులుగానే పరిగణించబడుతారు కనుక వారు భారత దేశ సందర్శనకు విధిగా తమ విదేశీ పాస్‌పోర్ట్‌ను ఉపయోగించాలి. భారత పౌరులకు రాజ్యాంగబద్ధంగా సంక్రమించే ఓటు హక్కు వీరికి ఉండదు. అంతేకాదు, వీరు ఎలాంటి ప్రభుత్వ పదవులు లేదా రాజ్యాంగ పదవులను (ఉదా., రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి లేదా న్యాయమూర్తి) చేపట్టలేరు. మిషనరీ, జర్నలిస్టిక్ లేదా పర్వతారోహణ కార్యకలాపాలు చేపట్టడానికి లేదా నోటిఫైడ్ పరిమిత/రక్షిత ప్రాంతాలను సందర్శించడానికి వీరు తప్పనిసరిగా అధికారిక ముందస్తు అనుమతి పొందాలి. ఈ కార్డు, అర్హులైన విదేశీ పౌరులు తమ ఓసిఐ వివరాలను తమ మొబైల్ ఫోన్లలో సురక్షితంగా నిల్వ చేసుకోవడానికి,ఇమ్మిగ్రేషన్ చెక్‌పాయింట్ల వద్ద తమ పాస్‌పోర్ట్‌తో పాటు వాటిని సమర్పించడానికి అనుమతిస్తుంది. ఈ వ్యవస్థ, కొత్త దరఖాస్తుదారులు ఇప్పటికే ఓసీఐ కార్డు పొందిన వారు ఇద్దరూ తమ డిజిటల్ కార్డులను ఆన్‌లైన్ ఓసీఐ సర్వీసెస్ పోర్టల్,ఇండియన్ వీసాను మొబైల్ యాప్ ద్వారా నేరుగా దరఖాస్తు చేసుకోవడానికి డౌన్‌లోడ్ చేసుకోవడానికి వీలు కల్పిస్తుంది.ఇఓసిఐ పొందిన తర్వాత కూడా ఇప్పటికే ఉన్న భౌతిక ఓసీఐ కార్డులు చెల్లుబాటులో ఉంటాయి. అయితే, ఇఓసిఐ కార్డు పొందినప్పటికీ, విదేశీ విమానయాన సంస్థల సిబ్బందికి ఈ నూతన ప్రక్రియ పట్ల పూర్తి అవగాహన ఏర్పడే వరకు భారతదేశ పర్యటన సందర్భంగా ప్రతిసారి కూడా ఫిజికల్ బుక్‌లెట్‌ను తమతో ఉంచుకోవాలి. 20ఏళ్లు పైబడిన కార్డుదారులు ఓసిఐ పోర్టల్‌లో తమ కొత్త పాస్‌పోర్ట్ వివరాలను మాత్రమే నమోదు చేయవలసి ఉంటుంది. భౌతిక ఓసిఐ కార్డు జారీ సమయంతో పోలిస్తే ఇఓసిఐ కార్డు జారీసమయానికి చాలా తక్కువ సమయం పడుతుంది. సాధారణంగా భౌతిక ఓసిఐ కార్డు జారీకి 6 నుండి 8 వారాలు పట్టేదానితో పోలిస్తే, ఇఓసిఐ కార్డు 15 పనిదినాలలోనే వేగవంతంగా జారీ చేయబడుతుంది. ఇఓసిఐకి భౌతిక కార్డుతోపోలిస్తే,తక్కువ పత్రాలు అవసరమవుతాయి. అంతేకాదు, మొబైల్ ఫోన్లో డౌన్లోడ్ చేసుకునే వెసులుబాటు ఉండడంతో దీనిని ఎప్పుడైనా, ఎక్కడైనా అవసరమైనప్పుడు సంబంధిత అధికారులకు చూపించేందుకు ఎంతో అనుకూలంగా ఉంటుంది. భౌతిక ఓసిఐ కార్డును ఏ విధంగా పాడవకుండా సురక్షితంగా భద్రపర్చుకోవలసి ఉంటుంది. కానీ ఇఓసిఐ కార్డుతో ఇక అటువంటి బెంగ ఉండదు. ఆన్‌లైన్‌లో ఉండడంతో అది పూర్తిగా సురక్షితం.ఇఓసిఐ కార్డుతో భారతీయ విమానాశ్రయాలలో ఇమ్మిగ్రేషన్ ధృవీకరణ వేగవంతంగా పూర్తవుతుంది. భారత దేశ పౌరసత్వ (సవరణ) నిబంధనలు, 2026, ఓసిఐ దరఖాస్తు ప్రక్రియను డిజిటలైజ్ చేయడం ద్వారా దరఖాస్తులనుడూప్లికేట్‌లో (రెండుప్రతులు) సమర్పించాలనే మునుపటి నిబంధనను తొలగించింది. ఎవరైనా ఓసిఐకార్డు కలిగిన వ్యక్తి స్వచ్ఛందంగా తమ కార్డును రద్దు చేసుకోవాలనుకుంటే ప్రత్యేక ఓసిఐ పోర్టల్‌లో ఫారం ట్రిపుల్ ఎక్స్‌ని పూరించడం ద్వారా ఆన్‌లైన్‌లో సులభంగా రద్దు చేసుకోవచ్చు. ప్రస్తుతం ఉన్న భౌతిక ఓసిఐ కార్డులన్నీ చెల్లుబాటులోనే ఉంటాయి.కాబట్టి, తమ కార్డును ఇఓసిఐగా మార్చుకోవాల్సిన అవసరంలేదు. చిరునామా, సంప్రదింపు నంబర్ లేదా ఇతర వివరాలలో మార్పుల కోసం తదుపరిసారి అప్‌డేట్ చేసినప్పుడు,సిస్టమ్ స్వయంచాలకంగా ఇఓసిఐని జారీ చేస్తుంది. •

# దేశంలో ముగిసిన ప్రజాస్వామ్యం



## పార్లమెంటులో, వీధుల్లో అన్నీ అప్రజాస్వామిక పరిస్థితులే

### విపక్ష ఎంపీలు నల్లజెండాలతో పార్లమెంటు వద్ద ఆందోళన

**న్యూఢిల్లీ:** విద్యార్థుల ఉద్యమానికి సంఘీభావంగా నల్ల దుస్తులు ధరించిన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. దేశంలో ప్రజాస్వామ్యం పూర్తిగా ముగిసిపోయిందని, పార్లమెంట్‌లోనూ, బయట వీధుల్లోనూ అప్రజాస్వామిక పరిస్థితులు నెలకొన్నాయని ఆమె ఆరోపించారు. బుధవారం పార్లమెంట్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడిన ప్రియాంక గాంధీ, యువత, విద్యార్థులకు సంబంధించిన అత్యంత కీలకమైన అంశాలపై చర్చ జరగకుండా ప్రభుత్వం పదేపదే అడ్డుకుంటోందని విమర్శించారు. ప్రతిపక్ష నేతలకు సభలో మాట్లాడే అవకాశమే ఇవ్వడం లేదని, ఇది ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధికారిక నివాసం లోక్ కళ్యాణ్ మార్గ్ వద్ద మంగళవారం కాంగ్రెస్ చేపట్టిన నిరసనను ప్రస్తావిస్తూ, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ, శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత ముఖ్యమైనవని ప్రియాంక అన్నారు. శాంతియుత నిరసనలో ఎలాంటి అప్రజాస్వామికత లేదని, కానీ పార్లమెంట్‌లో జరుగుతున్న పరిణామాలు, వీధుల్లో నిరసనకారులపై వ్యవహరిస్తున్న తీరు మాత్రం పూర్తిగా అప్రజాస్వామికమని విమర్శించారు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని, ఇతర ప్రతిపక్ష సభ్యులు లేచి మాట్లాడేందుకు ప్రయత్నించిన ప్రతిసారీ వారిని అడ్డుకుంటున్నారని ఆమె ఆరోపించారు. సభాపతికూడా చర్చ జరగాలంటే ముందుగా ప్రభుత్వ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని చెప్పడం ఆశ్చర్యకరమని, "ఇదేనా ప్రజాస్వామ్యం? ప్రజాస్వామ్యం ముగిసిపోయింది" అని ప్రియాంక వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా, విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు ప్రదర్శించిన దౌర్జన్యాన్ని నిరసిస్తూ ప్రతిపక్ష ఎంపీలు బుధవారం నల్ల దుస్తులు ధరించి పార్లమెంట్ వెలుపల ఆందోళన చేపట్టారు. ఈ నిరసనలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు పలువురు కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీల ఎంపీలు పాల్గొన్నారు. ప్రధానమంత్రి నివాసం వద్ద జరిగిన కాంగ్రెస్ నిరసన సందర్భంగా రాహుల్ గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్‌తో పాటు పలువురు నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయంపై స్పందించిన ప్రియాంక, తమను అరెస్ట్ చేయడం పెద్ద విషయం కాదని అన్నారు. "మేము విద్యార్థులకు అండగా నిలబడి వారి గొంతుకను వినిపిస్తున్నాం. అసలు ప్రశ్న ఏమిటంటే విద్యార్థులపై జరిగినది సరైందా కాదా అని ప్రశ్నించారు.

దేశంలోని ప్రతి తల్లిదండ్రి, ప్రతి విద్యార్థి, ప్రతి ఉపాధ్యాయుడు ఈ సమస్య ఎంత తీవ్రమైందో తెలుసునని ఆమె అన్నారు. విద్యార్థులు తమ హక్కులను మాత్రమే కోరుతున్నారని, ఎంతో కష్టపడి చదువుకుని భవిష్యత్తును నిర్మించుకోవాలనుకునే యువత భవిష్యత్తును ప్రభుత్వం నాశనం చేస్తోందని ఆరోపించారు. ఈ సందర్భంగా కేంద్ర బడ్జెట్ కేటాయింపులపై కూడా ప్రియాంక విమర్శలు చేశారు. దేశ యువత విద్య కోసం కేవలం రూ.1.4 లక్షల కోట్లు మాత్రమే కేటాయిస్తున్న ప్రభుత్వం, అదానీ, అంబానీ సంస్థలకు రూ.16 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేస్తోందని ఆరోపించారు. రైతులకు, పేదలకు, విద్యార్థులకు ప్రభుత్వం ఎలాంటి న్యాయం చేయడం లేదని విమర్శించారు. మంగళవారం జరిగిన ఘటనలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ తదితరులు ప్రధానమంత్రి నివాసం వద్ద ఆకస్మిక ధర్నా చేపట్టి మోడీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అత్యంత భద్రత కలిగిన ప్రాంతంలో ఈ నిరసన జరగడంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ప్రధానమంత్రి కార్యాలయ సహాయ మంత్రి జితేంద్ర సింగ్, కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ నిరసనకారులను అక్కడి నుంచి వెళ్లిపోవాలని కోరినా వారు వెనక్కి తగ్గలేదు. దీంతో సాయంత్రం పోలీసులు బలవంతంగా రాహుల్ గాంధీతో పాటు పలువురు ప్రతిపక్ష నేతలను అదుపులోకి తీసుకున్నారు.

రాహుల్ గాంధీని మోడల్ టౌన్‌లోని ఛత్రసాల్ స్టేడియానికి తరలించగా, ప్రియాంక గాంధీతో పాటు మరికొందరు ఎంపీలను మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. అనంతరం కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ వారిని పోలీస్ స్టేషన్‌లో కలిశారు. విద్యార్థులు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని, తమపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, తమపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారని రాహుల్ గాంధీ తెలిపారు. ఈ అంశం ప్రస్తుతం దేశంలో అత్యంత కీలకమైన సమస్యగా ప్రతిపక్షం భావిస్తోందని, అందుకే లోక్‌సభ, రాజ్యసభల్లో దీనిపై సమగ్ర చర్చ జరిపి తమ అభిప్రాయాలు వ్యక్తం చేసే అవకాశం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.



బుధవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీతో భేటీ అయిన శరద్ పవార్, సుప్రియా సూలే

# ప్రధాని మోడీతో పవార్, సుప్రియ భేటీ

## శరద్ ఎన్సీపి ఎన్డీయేలో చేరేందుకు రంగం సిద్ధం?

**న్యూఢిల్లీ,జులై 22:** ఒకవైపు నీట్ లీకేజీతో పాటు పలు అంశాలపై పార్లమెంట్ వెలుపల విపక్ష ఎంపీలు తీవ్ర స్థాయిలో నిరసనలు, నినాదాలతో హోరెత్తిస్తుంటే మరోవైపు ప్రధాని కార్యాలయంలో జరిగిన ఒక కీలక భేటీ దేశ రాజకీయాల్లో పెను దుమారాన్ని రేపుతోంది. ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్, ఆయన కుమార్తె సుప్రియా సూలేలు ప్రధాని నరేంద్ర మోడీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోల్లో ప్రధాని మోడీ స్వయంగా శరద్ పవార్‌ను చిరునవ్వుతో చేతిని పట్టుకుని ఆహ్వానించడం, ఇద్దరు నాయకులు ఎంతోసంతోషంగా నవ్వుకుంటూ చర్చించుకోవడం కనిపించింది. రైతుల సమస్యలు, నీటిపారుదల రంగానికి సంబంధించిన పలు అంశాలపై పవార్ ప్రధానికి వినతిపత్రం సమర్పించినట్లు సమాచారం. ప్రస్తుత పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లును ఆమోదింపజేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం మూడింట రెండొంతుల మెజారిటీ కోసం ప్రయత్నాలు చేస్తోంది. ఈ సమయంలో 8 మంది ఎంపీలు ఉన్న శరద్ పవార్ పార్టీ మద్దతు ప్రభుత్వానికి చాలా కీలకంగా మారింది. దేశవ్యాప్తంగా 50 శాతం సీట్ల పెంపుపై ప్రభుత్వం లిఖిత పూర్వక హామీ ఇస్తే ఈ బిల్లుకు మద్దతు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని ఇటీవలే సుప్రియా సూలే సంకేతాలు ఇచ్చారు. ఈ పరిణామాల మధ్య శరద్ పవార్ పార్టీ ఎన్డిఎ కూటమిలో చేరుతుందనే ఊహాగానాలు కూడా మొదలయ్యాయి. మహారాష్ట్రలోని రెండు ఎన్సీపీ వర్గాలు (అజిత్ పవార్, శరద్ పవార్ వర్గాలు) మళ్లీ విలీనమైతేనే ఎన్డీఎలో అధికారికంగా భాగస్వామ్యం కల్పిస్తామని, వ్యక్తిగతంగా లేదా విడివిడిగా చేర్చుకునే ఉద్దేశం లేదని బిజెపి స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. విపక్ష ఇండియా కూటమి కేంద్ర ప్రభుత్వంపై విమర్శల దాడిని తీవ్రతరం చేసిన సమయంలోనే, ఆ కూటమిలోని కీలక నేత శరద్ పవార్ ప్రధానితో భేటీ కావడం చర్చనీయాంశంగా మారింది.

## నిరాహార దీక్ష విరమించండి

### వాంగ్‌చుక్‌కు సిజెపి విజ్ఞప్తి

### ఆస్పత్రిలో విపక్ష ఎంపిల పరామర్శ

**న్యూఢిల్లీ, జులై 22:** పరీక్షల గందరగోళానికి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సిజెపిచేస్తున్న నిరసనకు బలాన్నిచ్చిన సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్షను విరమించాలని బొద్దింక జనతా పార్టీ విజ్ఞప్తి చేసింది. "సోనమ్‌సార్‌కు సిజెపి విజ్ఞప్తి అని 'ఎక్స్‌'లో ఒక పోస్ట్‌లో సిజెపి పేర్కొంది. "అత్యంతగౌరవంతో, కృతజ్ఞతతో, దయచేసి మీ నిరాహార దీక్షను విరమించాలని తాము మిమ్మల్ని కోరుతున్నాము. మీ త్యాగం దేశవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులకు స్ఫూర్తినిచ్చింది. జులై 20న, యువత మీకు, ఈ ఉద్యమానికి మద్దతుగా నిలిచేందుకు వివిధ రాష్ట్రాల నుంచి ప్రయాణించి వచ్చారు. ఈ పోరాటం ఏ ఒక్క వ్యక్తి కన్నా గొప్పదని, విద్యార్థులు న్యాయానికి అర్హులని మీరు నిరూపించారు. కానీ ప్రస్తుతం, మీరు మీ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి. మీ నిరాహార దీక్షతో ఈ పోరాటం ముగిసిపోదని మేము వాగ్దానం చేస్తున్నాము. పరీక్షల న్యాయం కోసం మాడిమాండ్లు నెరవేరే వరకు తాము నిరసనలను కొనసాగిస్తాము, ఈ పోరాటాన్ని ముందుకు తీసుకువెళ్తాము. దీనిని కొనసాగించడానికి తాము చేయగలిగినదంతా చేస్తాము. తాము ఈ ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్తాము" అని సిజెపి శపథం చేసింది.

**విపక్ష ఎంపిలు పరామర్శ**

గురుగ్రామ్‌లోని మెదాంత ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వాంగ్‌చుక్‌ను విపక్ష ఎంపిలు పరామర్శించారు. వాంగ్‌చుక్‌ను కలిసిన వారిలో కాంగ్రెస్ రాజ్యసభ ఎంపి వివేక్ తంఖా, టిఎంసి రాజ్యసభ ఎంపి సాగరిక ఘోష్, సిపిఎం రాజ్యసభ ఎంపి జాన్ బ్రిట్టాస్ ఉన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో విద్యా రంగంలో జవాబుదారీతనం అంశాన్ని చేపడతామని ఎంపిలు ఈ సందర్భంగా వాంగ్‌చుక్‌కు హామీనిచ్చాయి.

## జడ్జిల రిటైర్మెంట్ వయసు

# 61యేళ్లకు పెంపు

### ఈ విషయాన్ని పరిశీలించండి: రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను కోరిన సుప్రీం కోర్టు



**న్యూఢిల్లీ, జులై 22:** న్యాయాధికారుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 61 యేళ్లకు పెంచే విషయాన్ని పరిశీలించాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను సుప్రీంకోర్టు కోరింది. దేశవ్యాప్తంగా జిల్లా న్యాయాధికారుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 యేళ్లకు ఏకరీతిగా పెంచాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై బుధవారం విచారణ జరుపుతూ, భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్, జస్టిస్‌లు జయమాల్య బాగ్చి, వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాన్ని జారీ చేసింది. "అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలు (యుటిలు), తమ తమ అధికార పరిధిలోని హైకోర్టులతో సంప్రదించి ఈ విషయంపై ఒకనిర్ణయం తీసుకోవాలని ఆదేశిస్తున్నాము. ఒకవేళ వారు అంగీకరిస్తే, ఆ రాష్ట్రాల్లోని న్యాయాధికారులు 61 యేళ్ల వయస్సు వరకు సర్వీసులో కొనసాగడానికి అనుమతించబడతారు. అటువంటి కొనసాగింపు ఈ విచారణల తుది ఫలితానికి లోబడి ఉంటుంద్ధి అని ధర్మాసనం ఆదేశించింది.

ఈ నిబంధన ఏప్రిల్ 1, 2026 నుంచి అమల్లోకి వస్తుంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల పదవీ విరమణ వయస్సు 65యేళ్లు కాగా, హైకోర్టు న్యాయమూర్తులు 62 యేళ్ల వయస్సులో పదవీ విరమణ చేస్తారు. దేశవ్యాప్తంగా జిల్లా న్యాయాధికారుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 యేళ్లకు ఏకరీతిగా పెంచాలా వద్దా అనే ప్రధాన న్యాయపరమైన ప్రశ్నపై తుది తీర్పునకు ఈ మధ్యంతర ఏర్పాటు ఆటంకం కలిగించదని కూడా అది పేర్కొంది. "రాష్ట్రాలు లేదా హైకోర్టులు ఏ వైఖరి తీసుకున్నప్పటికీ, ప్రారంభంలోనే రూపొందించిన ఈ న్యాయపరమైన ప్రశ్నను ఈ కోర్టు స్వతంత్రంగా నిర్ణయిస్తుందని తాము స్పష్టం చేస్తున్నామ్మ్ అని ధర్మాసనం తెలిపింది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తమ తమ హైకోర్టులను సంప్రదించిన అనంతరం, రెండు వారాల్లోగా తమ వాదనను రికార్డు చేయాలని ఆదేశించింది.

## దేశానికి మీరు ఎంతో అవసరం..

# దీక్ష విరమించండి



### వాంగ్‌ఛుక్‌ను కలిసిన అభిజిత్ దీప్కే

**న్యూఢిల్లీ,జులై 22:** ఆమరణ నిరాహార దీక్ష కొనసాగిస్తున్న పర్యావరణ వేత్త సోనమ్ వాంగ్‌చుక్‌ను దీక్ష విరమించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే. ఈ మేరకు బుధవారం తన సోషల్ మీడియా వేదికగా ప్రకటన విడుదల చేశారు. దేశానికి సోనమ్ వాంగ్‌చుక్ అవసమరమని, అందువల్ల ఆయన దీక్ష విరమించాలని కోరారు. ఆయన ఆరోగ్యం ఇంకా క్షీణిస్తుండటంపై అభిజీత్ ఆందోళన వ్యక్తంచేశారు. సోనమ్ వాంగ్‌చుక్ తన ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, దీక్ష విరమించాలని కోరారు. దేశానికి ఆయన అవసరం ఉందన్నారు. ఇదే సమయంలో తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు జంతర్‌మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన కొనసాగిస్తామన్నారు. సోనమ్ వాంగ్‌చుక్ ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించిన తర్వాత ఆయన దీక్ష విరమించాలని అభిజీత్ దీప్కే కోరడం ఇదే మొదటిసారి. సోనమ్ ఆరోగ్యాన్ని ఇంకా ప్రమాదంలోకి నెట్టడం తమకు ఇష్టం లేదన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కోరుతూ దాదాపు 24 రోజులుగా వాంగ్‌చుక్ నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు.

ఆయనను ఆస్పత్రికి తరలించినప్పటికీ అక్కడ కూడా దీక్ష చేస్తున్నారు. దీంతో ఆయన ఆరోగ్యం క్షీణిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. మరో వైపు నీట్ పేపర్ లీకేజ్, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వంటి అంశాల్లో సిజెపితో చర్చలకు కేంద్రం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి జేపీ నడ్డా కూడా తెలిపారు. ఈ విషయంలో సిజెపి నేతలకు మద్దతు లభిస్తోంది. అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు ఉద్యమకారులు కూడా చర్చలకు సిద్ధంగానే ఉన్నారు.

# ఆడబిడ్డల బట్టలు చించేస్తారా!

### లోక్‌సభలో ఎంపి అఖిలేష్ యాదవ్ ఫైర్



**న్యూఢిల్లీ,జులై 22:** నీట్ పరీక్ష పత్రాల లీకేజీ వ్యవహారంపై లోక్‌సభలో జరిగిన చర్చ సందర్భంగా సమాజ్ వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ కేంద్ర ప్రభుత్వ వైఖరిని తప్పుపట్టి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల అంశం కాంగ్రెస్, బిజెపి లేదా సమాజ్ వాదీ పార్టీ ఇళ్లకు పరిమితమైనది కాదని, దేశంలోని కోట్లమంది విద్యార్థులు, యువత భవిష్యత్తుకు సంబంధించినదని ఆయన స్పష్టం చేశారు. పేపర్ లీకేజీలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని అఖిలేష్ డిమాండ్ చేశారు. సభలో ప్రతిపక్షాల గొంతుకను సరిగ్గా వినకపోతే, రోడ్లపైకి వచ్చి పోరాడటంతప్ప మరోమార్గం ఉండదని హెచ్చరించారు. నిరసనకారులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం, మహిళా విద్యార్థినులను ఈడ్చుకెళ్లడం వంటి అమానవీయ చర్యలకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తీరును ఆయన ఎండగట్టారు. విద్యార్థుల కోసం తామందరం పోరాడుతున్నామని, వాళ్ల సమస్యలు వినకపోతే ఇలాంటి పరిణామాలే సంభవిస్తాయని అఖిలేష్ పేర్కొన్నారు. లాఠీఛార్జీ చేయడాన్ని తప్పుపట్టారాయాన. తమ గొంతుకను వినిపించడానికి రోడ్డెక్కిన విద్యార్థుల కాళ్లు చెతులు విరగ్గొట్టారని, తలలు పగులగొట్టారని గుర్తు చేశారు. ఆడపిల్లల బట్టలు చింపారని ఆవేదన వ్యక్తం చేశారు. అలా మీరు చేస్తారా అని స్పీకర్ ను ఉద్దేశించి నిలదీశారు. గత్యంతరం లేని పరిస్థితుల్లోనే తాము లోక్‌కల్యాణ్ మార్గ్ వద్ద బైఠాయించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. అదే సమయంలో కాంగ్రెస్ సభ్యుడు కెసి వేణుగోపాల్‌కు ఎక్కువ సమయం పాటు మాట్లాడే అవకాశం ఇవ్వడం పట్ల అఖిలేష్ యాదవ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సభ్యులు కూర్చున్న వైపు వేలెత్తి చూపుతూ వారితో ఏవైనా లోపాయకారి ఒప్పందాలు కుదుర్చుకున్నారా అని స్పీకర్‌ను ప్రశ్నించారు. తమకు అవకాశం ఇవ్వాలంటూ పదే పదే అడుగుతున్నప్పటికీ పట్టించుకోకుండా కాంగ్రెస్ ఎంపిలతో మాట్లాడించడం సమంజసం కాదని చెప్పారు.

# ఇరాన్‌పై యుద్ధానికి అమెరికా రూ.3.6 లక్షలకోట్లు వ్యయం

### ప్రతినిధుల సభలో రక్షణమంత్రి పీట్ హెగ్సెత్ నివేదిక



**వాషింగ్టన్, జులై 22:** ఇరాన్‌తో కొనసాగుతున్న సైనిక చర్యల కోసం అమెరికాకు అక్షరాలా 37.5 బిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో సుమారు రూ. 3.6 లక్షల కోట్లు ఖర్చయిందని అమెరికా రక్షణ శాఖ మంత్రి పీట్ హెగ్‌సెత్ వెల్లడించారు. యుద్ధాన్ని కొనసాగించేందుకు, క్షీణిస్తున్న వనరులను తిరిగి సమకూర్చుకునేందుకు మరిన్ని అత్యవసర నిధులు కావాలని ట్రంప్ ప్రభుత్వం కోరుతున్న నేపథ్యంలో ఆయన ఈ వివరాలను చట్టసభ సభ్యులకు అందించారు. సెనేట్ అప్రాప్రియేషన్స్ కమిటీ ఎదుట జరిగిన విచారణలో హెగ్‌సెత్ ఈ నూతన అంచనాలను తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ 30తో ముగియనున్న నేపథ్యంలో ఆలోపు అయ్యే ఖర్చులనుకూడా కలుపుకుని ఈ అంచనాను రూపొందించారు. గతంలో మే, జూన్ నెలల్లో ఈ వ్యయం సుమారు 29 నుంచి 30 బిలియన్ డాలర్లుగా ఉంటుందని అంచనా వేయగా, ప్రస్తుతం ఆ సంఖ్య గణనీయంగా పెరిగింది. యుద్ధ కార్యకలాపాల కోసం సుమారు 67బిలియన్ డాలర్ల అదనపురక్షణ నిధులను కేటాయించాలని జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ ఛైర్మన్ జనరల్ డాన్ కెయిన్‌తో కలిసి హెగ్‌సెత్ సెనేట్‌ను అభ్యర్థించారు. ఈ ఏడాది ఫిబ్రవరి చివర్లో అమెరికా, ఇజ్రాయెల్ దాడులతో మొదలైన ఈఘర్షణ, ఈ నెల ప్రారంభంలో కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణ విఫలం కావడంతో మళ్లీ తీవ్రరూపం దాల్చింది. ప్రస్తుతం ఇరుపక్షాల మధ్య ప్రతిరోజూ దాడులు, ప్రతిదాడులు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన హార్ముజ్ జలసంధిపై ఇరాన్ పట్టును బలహీనపరిచే లక్ష్యంగా అమెరికా దాడులు సాగుతున్నాయి. ఈ జలసంధిలో ఏర్పడిన అంతరాయాలు అమెరికాలో గ్యాస్ ధరల పెరుగుదలకు కారణమయ్యాయి. ఈ ఘర్షణలో ఇప్పటివరకు 17 నుంచి 18 మంది అమెరికా సైనికులు ప్రాణాలు కోల్పోయారని, వంద మందికి పైగా గాయపడ్డారని పెంటగాన్ వెల్లడించింది. గాయపడినవారిలో చాలామంది తిరిగి విధుల్లో చేరినట్లు అధికారులు తెలిపారు. యుద్ధ వ్యూహం, కాలపరిమితిపై స్పష్టమైన సమాచారం ఇవ్వడం లేదని ఇరు పార్టీల చట్టసభ సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా మధ్యంతర ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ యుద్ధం వల్ల కలుగుతున్న ఆర్థిక, మానవ నష్టాన్ని డెమొక్రాట్లు ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. అత్యవసర నిధులు వెంటనే మంజూరు చేయకపోతే, సైనిక శిక్షణను తగ్గించాల్సి వస్తుందని, పరికరాల నిర్వహణ దెబ్బతిని దేశ రక్షణ సంసిద్ధతపై ప్రభావం పడుతుందని హెగ్‌సెత్ హెచ్చరించారు.

## నల్లదుస్తులతో పార్లమెంటుకు

# ఇండియా కూటమి ఎంపిలు

**న్యూఢిల్లీ,జులై 22:** ప్రధాని అధికారిక నివాసం వద్ద మంగళవారం జరిగిన హైడ్రామా తర్వాత రెండోరోజు బుధవారం కూడా ఇండియా కూటమి ఎంపీలు తమ నిరసనను తీవ్రతరం చేశారు. పోలీసుల దౌర్జన్యానికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతూ ఎంపీలందరూ నల్ల దుస్తులు ధరించి పార్లమెంట్‌కు చేరుకున్నారు. పార్లమెంట్ వెలుపల గుమిగూడిన విపక్ష నేతలు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చిన చలో సంసద్ మార్చ్‌కు మద్దతుగా నిన్న విపక్షాలు ఆందోళన చేపట్టాయి. ఈ క్రమంలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ సహా పలువురు ఇండియా కూటమి నేతలు ప్రధాని నివాసం వద్ద నిరసనకు యత్నించారు. పోలీసులు వారిని బలవంతంగా అదుపులోకి తీసుకుని వ్యాన్లు, బస్సుల్లో తరలించారు. ఈ ఘటన రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది.

ఈ అరెస్టులు, పోలీసుల తీరును తీవ్రంగా ఖండిస్తూ విపక్ష ఎంపీలు నేడు నల్ల దుస్తుల్లో పార్లమెంట్‌కు వచ్చారు. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్ సహా పలు పార్టీల ఎంపీలు మకర ద్వార్ వద్ద నిలబడి ప్రభుత్వ వైఖరిపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ మాట్లాడుతూ నిన్న ప్రతిపక్ష నేతను సిగ్గులేకుండా అరెస్ట్ చేసి, గాయపరిచిన తీరు దారుణం. దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ అమలవుతోందని చెప్పడానికి ఇదే నిదర్శనం. రాజ్యాంగం ఉనికిలో లేదు. ఈ ప్రభుత్వంతో శాంతియుతంగా పోరాడటమే మా ముందున్న ఏకైక మార్గమని తీవ్రంగా విమర్శించారు.

# సంక్షిప్త వార్తలు

## టిఎంసి ఎంపి కల్యాణ్‌బెనర్జీ లోక్‌సభనుంచి సస్పెన్షన్



**న్యూఢిల్లీ,జులై 22:** లోక్‌సభ సమావేశాల సందర్భంగా మహిళా ఎంపీలపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న కారణంతో టిఎంసి పార్టీ ఎంపీ కల్యాణ్ బెనర్జీపై సస్పెన్షన్ వేటుపడింది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రస్తుత పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ముగిసే వరకు సభ నుంచి కల్యాణ్ బెనర్జీని సస్పెండ్ చేశారు. బుధవారం మధ్యాహ్నం ప్రతిపక్షాల నిరసనల నడుమ సభ వాయిదా పడిన తర్వాత టిఎంసి ఎంపీ కల్యాణ్ బెనర్జీకి.. మాజీ టిఎంసి సభ్యులు కకోలి ఘోష్ దస్తీదార్, శతాబ్ది రాయ్, మితాలి బాగ్ మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా కల్యాణ్ బెనర్జీ తమను ఉద్దేశించి అసభ్యకరమైన భాష వాడారని, దూషించారని ఆరోపిస్తూ సదరు మహిళా ఎంపీలు లోక్‌సభ స్పీకర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

## సాయుధబలగాల్లో అగ్నివీర్‌లకు 50% రిజర్వేషన్

**న్యూఢిల్లీ,జులై 22:** కేంద్ర సాయుధ బలగాల్లోకి మాజీ అగ్నివీరులను పరీక్ష లేకుండానే తీసుకోవాలని, 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర హోం శాఖ నిర్ణయించింది. సాధారణంగా బలగాల్లోకి ఎంపిక కోసం నిర్వహించే ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ వంటి పరీక్షలు వీరు రాయాల్సిన అవసరం లేదు. ఇప్పటివరకు ఉన్న 10 శాతం ఉన్న రిజర్వేషన్ 50 శాతానికి పెంచడం విశేషం. నాలుగేండ్ల పదవీకాలం పూర్తయ్యాక అగ్నిపథ్ పథకం నుంచి బయటకు వచ్చే సైనికులకు మరొకసారి సాయుధ బలగాల్లో ఉపాధి లభించనుంది.

## నెతన్యాహు అరెస్టుపై వెనక్కి తగ్గిన మమ్‌దానీ

**న్యూయార్కు, జులై 22:** ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు న్యూయార్క్ వస్తే అంతర్జాతీయ నేర న్యాయస్థానం (ఐసిసి) వారెంట్ ఆధారంగా అరెస్ట్ చేస్తానన్న ఎన్నికల హామీ నుంచి న్యూయార్క్ మేయర్ జోహ్రాన్ మామ్దానీ వెనక్కి తగ్గారు. నగర పరిపాలనా రంగానికి అటువంటి అరెస్టులు చేసే స్వతంత్ర చట్టపరమైన అధికారం లేదని న్యాయ సమీక్షలో తేలడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు.

## సౌదీ అణు ఒప్పందానికి ట్రంప్ ఆమోదం



**వాషింగ్టన్, జులై 22:** పశ్చిమాసియాలో కీలక పరిణామం చోటు చేసుకుంది. సౌదీ అరేబియాతో అత్యంత ప్రాధాన్యమున్న 30 యేళ్ల పౌర అణు ఒప్పందానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారికంగా ఆమోదంతెలిపారు. ఈచారిత్రక ఒప్పందం ద్వారా సౌదీ అరేబియా భూభాగంలోనే యూరేనియం శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేసే అవకాశం లభిస్తుంది. వాషింగ్టన్, రియాద్ సంయుక్తంగా నిర్వహించే అధ్యయనంలో సాధ్యమేనని తేలితే, అమెరికన్ కంపెనీలు ఈ శుద్ధి కేంద్రాన్ని నిర్మిస్తాయి. తద్వారా విదేశీ పోటీదారులను పక్కనపెట్టి, సౌదీ అణు మౌలిక సదుపాయాల నిర్మాణంలో అమెరికా సంస్థలు పదిలమైన స్థానాన్ని దక్కించుకోవడమే కాకుండా వేల కోట్ల డాలర్ల వ్యాపార ఒప్పందాలను పొందుతాయి.

## ఉగ్రకాల్పుల్లో జవాను మృతి, మరొకరికి తీవ్రగాయాలు



**శ్రీనగర్,జులై 22:** జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఒక జవాన్ మరణించగా, మరొకరు గాయపడ్డారు. ఈ ఘటన బుధవారం, జమ్మూ కాశ్మీర్‌లోని అనంత్‌నాగ్–కోకెర్‌నాగ్ రోడ్డు మార్గంలో జరిగింది. స్పెషల్ ఆపరేషన్ గ్రూప్ (ఎస్ఒజి)కి చెందిన ఇద్దరు జవాన్లు బుధవారం ఉదయం అనంత్‌నాగ్–కోకెర్‌నాగ్ రోడ్డులో విధులు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో అక్కడికి వచ్చిన తీవ్రవాదులు ఈ జవాన్లపై కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్పందించిన ఇతర భద్రతా సిబ్బంది వెంటనే వారిని చికిత్స కోసం స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఆ ఇద్దరిలో తీవ్ర గాయాల కారణంగా ఒక జవాన్ అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు.



## నీట్ పేపర్ లీక్‌పై కేంద్ర మంత్రి రాజీనామా చేయాలి

### చలో లోక్‌భవన్ విజయవంతం, స్వచ్ఛందంగా పాల్గొన్న ప్రజలు: మహేష్ కుమార్ గౌడ్

**హైదరాబాద్ జులై 22,ప్రభాతవార్త:** నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, ఎఐసిసి పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకులతోపాటు ప్రజలు స్వచ్ఛందంగా వచ్చిన నిరసన తెలపడంతో ఛలో రాజ్‌భవన్ విజయవంతమైందని టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. బుధవారం ఛలోరాజ్‌భవన్ అనంతరం మహేష్ కుమార్ గౌడ్ విలేఖరులతో మాట్లాడుతూ పదేళ్లలో 152సార్లు పేపర్ లీకేజి మోదీ పాలనలో జరిగిందని దీనితో విద్యార్థులు ఆత్మస్థైర్యం కోల్పోతున్నారని ఆవేదన చెందారు. నీట్ పేపర్ లీక్ కారణంగా దేశవ్యాప్తంగా సుమారు 22 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, దీనికి బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీక్ అంశంపై ప్రశ్నించినందుకు లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో పాటు ఇతర ప్రతిపక్ష ఎంపీలను అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. దేశంలో పోలీసు రాజ్యం నడపాలని చూస్తే ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు మరియు యువత అంగీకరించరని ఆయన పేర్కొన్నారు. యువత భవిష్యత్తుతో బిజెపి ప్రభుత్వం చెలగాటమాడుతోందని, కానీ విద్యార్థుల హక్కుల కోసం రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతూనే ఉంటుందని స్పష్టం చేశారు. కొంతమంది "పైడ్ ఆర్టిస్టులు" ద్వారా ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించిన ఆయన, దేశ యువత మాత్రం రాహుల్ గాంధీ నాయకత్వానికే మద్దతుగా నిలుస్తోందన్నారు. రాజ్‌భవన్ వద్ద జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ విప్ బలమూరి వెంకట్, మాజీ మంత్రి షబ్బీర్ అలీ, రోహిన్ రెడ్డి, పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్పొరేషన్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారని తెలిపారు. నీట్ పేపర్ లీక్ ఘటనపై కేంద్ర ప్రభు త్వం బాధ్యత వహించాలని, విద్యార్థులకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

## రాహుల్ గాంధీ అరెస్ట్ ప్రజాస్వామ్యంపై దాడి

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**హైదరాబాద్ జులై 22,ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఢిల్లీ జంతర్ మంతర్‌లో విద్యార్థులపై లాఠీ ఛార్జికి నిరసనగా శాంతియుత మార్గంలో ప్రశ్నిస్తే ఆయనపై దాడి చేసి గాయపరిచి, నిరంకుశంగా అరెస్ట్ చేయడాన్ని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. కేంద్రంలో ఉన్న అధికార పార్టీ రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తోందని ఆయన మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలను ఎండగట్టడానికి మరియు రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా టిపిసిసి ఆధ్వర్యంలో ఛలో లోక్ భవన్ పిలుపుతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు స్వచ్ఛందంగా నిరసన వ్యక్తం చేసి బిజెపి పాలన వైఖరిని ఎండగట్టారని అన్నారు. 'ప్రశ్నించే గొంతుకలను అరెస్టులతో ఆపలేరని, రాహుల్ గాంధీ వెనుక దేశ ప్రజలందరూ ఉన్నామని బలమైన సంకేతం మోడీకి పంపారని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి ప్రతీ ఒక్కరూ ముందుకు రావలసిన సమయం ఇది' అని అన్నారు.


## గిరిజన గ్రామాల్లో పౌష్టికాహార కార్యక్రమాలు

### పైలట్ ప్రాజెక్టుగా భద్రాచలం

**హైదరాబాద్, జులై 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని గిరిజన గ్రామాల్లోని పిల్లలు, గర్భిణులు, బాలింతల్లో పోషకాహార లోపాన్ని (మల్నూట్రిషన్) నిర్మూలించడానికి ఇంటర్నేషనల్ క్రాప్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది సెమీ ఆరిడ్ ట్రాపిక్స్ (ఇక్రిశాట్) ప్రభుత్వం మరియు వివిధ భాగస్వామ్య సంస్థలతో కలిసి కీలకమైన పోషకాహార కార్యక్రమాలను నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. ఈ మేరకు మంగళ, బుధవారాల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ప్రతినిధి బృందం పర్యటించి సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) అధి కారులతో భేటీ అయింది. ఇక్రిశాట్ తన పరిశోధనల ద్వారా స్థానికంగా పండే చిరుధాన్యాలు (మిల్లెట్స్), పప్పుధాన్యాలతో ప్రత్యేక పోషక విలు వలున్న ఆహార ఉత్పత్తులను తయారుచేసి గిరిజన ప్రాంతాలకు అందిం చనుంది. ముఖ్యంగా మధ్యాహ్న భోజన పథకం ద్వారా గిరిజన పిల్లలకు పోషకాహారం అందించేందుకు ఇక్రిసాట్, మరో ప్రైవేటు సంస్థతో కలిసి ఒక పైలట్ ప్రాజెక్టును సిద్ధం చేస్తున్నాయి. ఈ పైలెట్ ప్రాజెక్టులో భాగంగా రాష్ట్రంలోని భద్రాచలంలో రక్తహీనతతో బాధపడుతున్న పిల్లలను గుర్తించి, వారికి మద్దతు ఇవ్వడంతో పాటు, బలవర్ధక ఆహార ఉత్పత్తిని కూడా బలోపేతం చేస్తుంది. గిరిజన గ్రామాల్లోని పిల్లలకు, గిరిజన సంక్షేమ పాఠశాలల్లో చదువుతున్న ఏడు నుంచి 10 సంవత్సరాల వయస్సు గల వారికి పోషకాహారం అందించేందుకు ఐసీఆర్ఐఎస్ఏటీ, గ్రూప్ ఒక పైలట్ ప్రాజెక్టును ప్రారంభించాలని యోచిస్తున్నాయి. దీనికి సంబంధించి ఈ బృందం కొత్తగూడెంలో పర్యటించి, భద్రాచలం సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ప్రాజెక్ట్ ఆఫీసర్ బి.రాహుల్‌ను కలిశారు. ఈబృందం భద్రాచలం పట్టణంలోని పోషకాహార శుద్ధికేంద్రాన్ని, గిరిజనగ్రామాల్లోని ఇతర పాఠశాలలను సందర్శించనుంది.

## త్రికరణశుద్ధితో విధులు నిర్వహించి లోక్‌భవన్ ప్రతిష్టను మరింత పెంచాలి

### లోక్‌భవన్ పరివార్‌తో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆత్మీయ సమావేశం



బుధవారం లోక్‌భవన్ పరివార్‌తో మాట్లాడుతున్న గవర్నర్ శివప్రతాప్ శుక్లా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జులై22:** లోక్‌భవన్ ధికారులు, ఉద్యోగులు, సిబ్బందితో బుధవారం రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఉద్యోగితో వ్యక్తిగతంగా మాట్లాడిన గవర్నర్, వారి కుటుంబ సభ్యుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. లోక్ భవన్‌లో పనిచేసే ఉద్యోగులకు హోదాలతో నిమిత్తం లేకుండా లోక్ భవన్ ఉద్యోగిగా ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. లోక్‌భవన్‌లో పనిచేసే అవకాశం రావడం గర్వించదగ్గ విషయమని, ప్రతి ఉద్యోగి లోక్ భవన్ ప్రతిష్ఠను కాపాడే బాధ్యతతో పనిచేయాలని సూచించారు. త్రికరణశుద్ధితో, అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ లోక్‌భవన్ గౌరవం, ప్రతిష్ట మరింత పెరిగేలా కృషి చేయాలన్నారు. ఉద్యోగులు తమ ఆరోగ్యంకు ప్రాధాన్యం ఇవ్వాలని గవర్నర్ సూచించారు. లోక్‌భవన్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కోసం ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించాలని లోక్ భవన్ వైద్యాధికారులకు సూచించారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం దాన కిషోర్, సంయుక్త కార్యదర్శి శశికిరాణా చారి, డిప్యూటీ సెక్రటరీ జి.పల్లవి తదితరులు పాల్గొన్నారు.

# కరెంటు అప్పు 5% వడ్డీతో తిరిగి చెల్లింపు

### రాష్ట్రాల విద్యుత్ సంస్థల మధ్య ఒప్పందం
### డిమాండ్ తీర్చేందుకు డిస్కంల కొత్త ప్లాన్

**హైదరాబాద్, జులై 22, ప్రభాతవార్త:** విద్యుత్ సంస్థల వ్యవహార శైలి కొత్త పుంతలు తొకుతున్నాయి. ఇప్పటి వరకూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు అందినకాడల్లా అప్పులు చేసి నడిపిస్తుండగా, తాజాగా కరెంట్‌ను కూడా అప్పులు తీసుకోవడం ప్రారంభించాయి. సాధారణంగా అవసరానికి డబ్బును అప్పుగా తీసుకుని వడ్డీతో కలిపి చెల్లించడం తెలుసు. కానీ ఇప్పుడు రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు కరెంట్‌ను కూడా అప్పుగా తీసుకోవడం విశేషం.? ఇందుకు గాను అసలు కరెంట్‌తో పాటు, వడ్డీగా మరికొన్ని యూనిట్లు కూడా చెల్లించాల్సి ఉంటుంది. ఈ విధంగానే ఉత్తర తెలంగాణ, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు) ఇటీవల కరెంటును అప్పుగా తీసుకుని, తిరిగి కరెంటునే వడ్డీతో సహా ఇచ్చేలా ఇతర రాష్ట్రాలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాయి. భారీ కొనుగోలు వ్యయాన్ని తగ్గించుకోవడానికి విద్యుత్ పంపిణీ సంస్థలు ఎంచుకుంటున్న ఈ మార్గం ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఉత్తరాది రాష్ట్రాల్లో ఈ సమయంలో విద్యుత్ డిమాండ్ తక్కువగా ఉంటుంది. ఇదే సమయంలో తెలంగాణలో సాగు పనులు ముమ్మరంగా సాగుతుండటంతో డిమాండ్ గరిష్ట స్థాయికి చేరుతోంది. దీన్ని ఆసరాగా చేసుకుని, ఉత్తరప్రదేశ్ పవర్ కార్పొరేషన్‌తో తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు ఈ మధ్య కీలక ఒప్పందం చేసుకున్నాయి. ఆనెలాఖరు వరకు రోజుకు గరిష్టంగా 3,000 మెగావాట్ల విద్యుత్‌ను తెలంగాణ తీసుకునేలా ఈ ఒప్పందంలో ప్రతిపాదించాయి. ఈ విధంగా అప్పు తీసుకున్న విద్యుత్తుకు అదనంగా 5శాతం కరెంటును కలిపి తిరిగి చెల్లించాలి. ఇక అప్పు తిరిగి ఇచ్చే సమయం చూస్తే తెలంగాణలో డిమాండ్ తగ్గే ఏప్రిల్ 20 నుంచి ఈ నెల 10 మధ్య ఈ బకాయిని చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నాయి. తాజాగా ఇదే తరహాలో మధ్యప్రదేశ్ విద్యుత్ సంస్థతో కూడా రోజుకు 500మెగావాట్ల కోసం చర్చలు జరుగుతున్నాయి. ఇక రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రికార్డు స్థాయిలో విద్యుత్‌కు డిమాండ్ పెరుగుతుండటంతో అందుకు సరిపడా సేకరిస్తున్న పంపిణీ సంస్థలు అప్పుల వైపు కూడా దృష్టిసారించాయి. రాష్ట్రంలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 30లక్షల వ్యవసాయ విద్యుత్‌కనెక్షన్లు (బోర్లు) ఉన్నాయి. ఖరీఫ్ పంటల సాగుకు నీటి అవసరాలు పెరగడంతో విద్యుత్ వినియోగం క్రమేపీ పెరుగుతోంది. బయటి మార్కెట్లో (ఎనర్జీ ఎక్స్ఛేంజ్) విద్యుత్ కొనాలంటే యూనిట్‌కు రూ. 10 వరకు ధర పలుకుతోంది. దీనివల్ల పంపిణీ సంస్థలకు రోజుకు సుమారు రూ. 50కోట్లు అదనంగా వెచ్చించాల్సి వస్తోంది. ఈ భారీ ఆర్థిక భారం నుంచి బయటపడటానికే కరెంటు అప్పుగా తీసుకుని తిరిగి 5 శాతంతో అదనంగా ఇచ్చే ఈ పద్ధతిని విద్యుత్ పంపిణీ సంస్థల అధికారులు ఎంచుకున్నారు. పంపిణీ సంస్థల దగ్గర మిగులు కరెంట్ ఉన్నప్పుడు పక్క రాష్ట్రాలకు ఇచ్చి, అవసరమైనప్పుడు వడ్డీతో సహా వెనక్కి తీసుకోవడం వల్ల అటు వినియోగదారులకు అంతరాయం లేని విద్యుత్ అందుతుంది, ఇటు పంపిణీ సంస్థలపై భారం పడదనే ఉద్దేశ్యంతో అప్పుల వైపు దృష్టి సారించాయి.

# బిఆర్ఎస్ పాలనలో ప్రజల గోడు వినేవారే లేరు

### క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల కోసం మళ్లీ దరఖాస్తు చేసుకోవాలి

### ప్రధాని మోడీ, విద్యామంత్రి ప్రధాన్ రాజీనామా చేయాలి: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



బుధవారం గాంధీభవన్‌లో నిర్వహించిన మంత్రులతో ముఖాముఖిలో వినతులు స్వీకరిస్తున్న మంత్రి పొంగులేటి

**హైదరాబాద్ జులై 22,ప్రభాతవార్త:** పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ప్రజలు తమ సమస్యలను చెప్పు కోవడానికి అవకాశం ఉండేదికాదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంత్రుల కూడా ప్రజలకు అందుబాటులో ఉండేవారుకాదని అన్నారు. బుధవారం గాంధీభవన్‌లో ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. కొన్ని సమస్యలపై అక్కడికక్కడే కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం గాంధీ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు ప్రతివారం క్యాబినెట్‌లో ఒకమంత్రి ప్రజలతో ముఖాముఖి నిర్వహిస్తు వీలైనంతవరకు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. బుధవారం నిర్వహించిన ముఖాముఖిలో చాలావరకు ఇండ్ల గురించి దరఖాస్తులు వచ్చాయన్నారు. వారి ఆశలకు అనుగుణంగా తమ ప్రభుత్వం మొదటి విడతలో 4.50 లక్షలు, రెండో విడతలో 2.50 లక్షలు మొత్తం 7లక్షల ఇండ్లను మంజూరు చేసిందన్నారు. గడచిన పది సంవత్సరాలలో ఆనాటి ప్రభుత్వం పేదలకు అరకొరగా నగరానికి 30,40 కిలోమీటర్ల దూరంలో ఇండ్లు నిర్మించిందని ఫలితంగా తమ జీవనోపాధి దెబ్బతింటుందన్న ఆందోళనతో పేదలు ఆ ఇళ్లల్లో అడుగు కూడా పెట్టలేదన్నారు. ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా పేదవాడు పుట్టి పెరిగిన చోటే నివాసం కల్పించాలన్న ఆలోచనతో నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకొని ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. ఇప్పుడు నిర్మించబోయే ఇండ్ల విలువ 40నుంచి కోటి రూపాయిల వరకు ఉంటుందని ఇంటిస్థలంలో వాటా కూడా కల్పిస్తున్నామని తెలిపారు. పైలట్ ప్రాజెక్ట్‌గా 16 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. గతంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారు ఈ ఇండ్ల కోసం మీ సేవ, వాట్సాప్, వెబ్‌సైట్ ద్వారా మరో సారి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. భూములకు సంబంధించిన వచ్చిన దరఖాస్తుల్లో పరిష్కరించగలిగిన అన్నింటికీ పరిష్కారం చూపిస్తామన్నారు. దేశంలో యువతను దెబ్బతీసిన నీట్ పరీక్ష లీకేజీపై శాంతియుతంగా ఢిల్లీలో ధర్నా చేస్తున్న యువతపైన, మద్దతు తెలిపిన కాంగ్రెస్ అగ్రనేతలు మల్లిఖార్జన్ ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీలపై లాఠీఛార్జి చేయడం కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని మంత్రి పొంగులేటి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలకు సమాధానం చెప్పలేక పార్లమెంటును పలుమార్లు వాయిదా వేయడం, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడం ప్రభుత్వ చేతకానితనాన్ని ఎత్తిచూపుతుందన్నారు. తక్షణమే ప్రధాని మోదీ, మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎఐసిసి పిలుపు మేరకు ఈరోజు హైదరాబాద్‌లో ర్యాలీ నిర్వహించామని, నీట్ పరీక్ష రాసిన 22లక్షల మంది అభ్యర్థులకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

## హెటెరో ఫార్మాస్యూటికల్స్‌తో అవగాహన ఒప్పందం

### కుదుర్చుకున్న ఇంటర్మీడియట్ విద్యాశాఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జులై22:** తెలంగాణ ప్రభుత్వ ఇంటర్మీడియట్ విద్యాశాఖ, రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలను అందించి, ఉపాధి అవకాశాలను మెరుగుపరచే లక్ష్యంతో హెటెరో ఫార్మాస్యూటికల్స్ సంస్థతో అవ గాహన ఒప్పందం (ఎంఓయు) కుదుర్చుకుంది. ఈ ఒప్పంద మార్పిడి కార్యక్రమం ఇంటర్మీడియట్ విద్యాశాఖ డైరెక్టర్ అభిలాష అభినవ్, జాయింట్ డైరెక్టర్ యెంక్యా నాయక్, రాష్ట్ర వృత్తి విద్యా సంస్థ (ఎస్ఐవిఈ) ప్రిన్సిపాల్ డా. జ్యోత్స్నా రాణి, అలాగే హెటెరో సంస్థ ప్రతినిధులు డా. ఎస్.వెంకట జయపాల్ రెడ్డి (వైస్ ప్రెసిడెంట్-హెచ్ఆర్), మాధురి ఐ. (సీనియర్ మేనేజర్-హెచ్ఆర్), కర్ణకంటి వేణుమాధవ్ (ఆఫీసర్-హెచ్ఆర్) సమక్షంలో జరిగింది. ఈ భాగస్వామ్యం ద్వారా హెటెరో సంస్థ పరిశ్రమలతో పరస్పర అనుసంధానం, క్యాంపస్ నియామకాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు, ఇంటర్న్‌షిప్‌లు, అధ్యాపకులకు పరిశ్రమల పరిచయం, సీఎస్ఆర్ కార్యక్రమాల కింద ప్రయోగశాలల అభివృద్ధి, అలాగే ముఖ్యంగా లైఫ్ సైన్సెస్,అనుబంధ విభాగాల్లో చదువుతున్న ఇంటర్మీడియట్, వృత్తి విద్యార్థులకు ఉపాధి అవకాశాలను కల్పించనుంది.

ఈ సందర్భంగా డైరెక్టర్ అభిలాష అభినవ్‌మాట్లాడుతూ విద్యార్థులకు సార్థకమైన వృత్తి అవకాశాలు కల్పించాలనే మా నిబద్ధతకు ఈ భాగస్వామ్యం నిదర్శనం. హెటెరోతో కలిసి పనిచేయడం ద్వారా ఫార్మాస్యూటికల్ రంగానికి అవసరమైన శిక్షణతో పాటు, దీర్ఘకాలిక స్థిరమైన ఉపాధి అవకాశాలను యువతకు అందిస్తున్నామన్నారు. హెటెరో సంస్థ వైస్ ప్రెసిడెంట్ (హెచ్ఆర్) వెంకట జయపాల్ రెడ్డి మాట్లాడుతూ 'తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యాశాఖతో మా భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంపట్ల మేము గర్విస్తున్నాము. ఇంటర్మీడియట్ అర్హత కలిగిన యువతకు 300కు పైగా ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా రాష్ట్ర యువత ఉపాధి సామర్థ్యాన్ని పెంపొందించే ప్రభుత్వ లక్ష్యానికి మేము తోడ్పడుతున్నాము. వృత్తి విద్యను మరింత బలోపేతం చేయడం, విద్యార్థుల ఉపాధి సామర్థ్యాన్ని పెంచడం, ప్రముఖ పరిశ్రమలతో స్థిరమైన భాగస్వామ్యాలను నెలకొల్పడం ద్వారా తెలంగాణ యువతకు మెరుగైన భవిష్యత్తును అందించడంలో ఈ ఒప్పందం కీలక అడుగుగా ఇంటర్మీడియట్ విద్యాశాఖ భావిస్తోంది.

# రాష్ట్ర థర్మల్ కేంద్రాల్లో 42.8 మిలియన్ టన్నులు బొగ్గు నిల్వలు


### విద్యుత్ ఉత్పత్తిపై రోజూ పర్యవేక్షణ: స్పష్టం చేసిన కేంద్ర విద్యుత్ అథారిటీ

**హైదరాబాద్, జులై 22, ప్రభాతవార్త:** ప్రస్తుత విద్యుత్ డిమాండ్‌ను తీర్చడానికి తెలం గాణతో పాటు, దేశంలోని బొగ్గు ఆధారిత విద్యుత్ ప్లాంట్ల వద్ద తగినంత బొగ్గు నిల్వలు ఉన్నాయని కేంద్ర విద్యుత్ అథారిటీ స్పష్టం చేసింది. తెలంగాణలోని థర్మల్ పవర్ ప్రాజెక్టుల వద్ద ఈ నెల 14వరకూ 42.8 మిలియన్ టన్నుల బొగ్గు అందుబాటులో ఉందని, ఇది 85 శాతం ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ వద్ద 14రోజులకు సరిపోతుందని కేంద్ర విద్యుత్ అథారిటీ తన నివేదికలో తెలిపింది. బొగ్గు సరఫరాలను ప్రతిరోజూ పర్యవేక్షి స్తున్నామని, గరిష్ట డిమాండ్ సమయంలో నిరంతరాయ థర్మల్ విద్యుత్ ఉత్పత్తికి మద్దతు ఇచ్చేందుకు బొగ్గు రేక్‌లకు ప్రాధాన్యత ఇస్తు న్నామని అందులో పేర్కొంది. తెలంగాణలో, ఈ నెల 14నాటి కేంద్ర విద్యుత్ అథారిటీ తాజా రోజువారీ ఇంధన నివేదిక ప్రకారం, 1,000 మెగావాట్ల సామర్థ్యం గల రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సంస్త జెన్‌కో కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ (కొత్త)లో 85 శాతం పీఎల్ఎఫ్ వద్ద 4.34 రోజులకు సరిపడా 68,000 టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నట్లు వెల్లడైందని తెలిపింది. అదే నివేదిక ప్రకారం, 3,200 మెగావాట్ల సామర్థం గల తెలంగాణ జెన్‌కోకు చెందిన యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం వద్ద 3.58 రోజులకు సరిపడా 1,56,400 టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నట్లు తెలిపింది. పెరుగుతున్న డిమాండ్ మరియు ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో, తెలంగాణ థర్మల్ స్టేషన్లకు బొగ్గు రవాణాకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు సింగరేణి కాలరీస్ కంపెనీ ఇటీవల రూపొందించిన నివేదికలు తెలిపాయి. సింగరేణి ఉత్పత్తి చేసే బొగ్గులో సుమారు 72 శాతాన్ని టీఎస్‌జెన్‌కో థర్మల్ స్టేషన్లు, ఎన్‌టీపీసీ రామగుండం, సింగరేణి థర్మల్ ప్లాంట్‌కు సరఫరా చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. తెలంగాణలోని థర్మల్ స్టేషన్లు సాధారణంగా 10 నుంచి 15 రోజులకు సరిపడా బొగ్గు నిల్వలను కలిగి ఉంటాయని, అదే సమయంలో రాష్ట్ర సొంత విద్యుత్ ఉత్పాదన వ్యవస్థకు పెద్ద అంతరాయం లేకుండా సరఫరాలు కొనసాగుతాయని నివేదికలు స్పష్టం చేశాయి. కాగా దేశవ్యాప్తంగా ఉన్న థర్మల్ విద్యుత్ ప్లాంట్ల వద్ద బొగ్గు నిల్వలు సమీపకాల విద్యుత్ డిమాండ్‌ను తీర్చడానికి సరిపోతాయని వెల్లడించింది.

కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ, విద్యుత్, రైల్వే మరియు బొగ్గు మంత్రిత్వ శాఖ లతో కూడిన ఒక ఉమ్మడి కమిటీ ద్వారా బొగ్గు సర ఫరాను ప్రతిరోజూ పర్యవేక్షి స్తున్నామని తెలిపింది. గరిష్ట డిమాండ్ సమయంలో నిరంతరాయ ఉత్పత్తిని నిర్ధారిం చడానికి బొగ్గు రేక్‌లకు మరియు విద్యుత్ కేంద్రాలకు దాని పంపిణీకి ప్రాధాన్యత ఇస్తున్నామని కేంద్ర విద్యుత్ అథారిటీ తన నివేదికలో స్పష్టం చేసింది.

# ఎసిబి వలలో మరో భారీ అవినీతి చేప

### రూ.150కోట్ల అక్రమాస్తులతో దొరికిన తెలంగాణ రెడ్కో డిఇ వెంకటరమణ



వెంకటరమణ ఇంట్లో ఎసిబి సోదాలు చేస్తున్న దృశ్యం

**హైదరాబాద్, జులై 22, ప్రభాతవార్త:** సర్కారీ విభాగాల్లో కీలక హోదాలో వుంటూ అక్రమాలకు పాల్పడి వందల కోట్ల రూపాయల ఆస్తులను సంపాదించిన మరో అవినీతి అధికారి ఎసిబికి పట్టుబడ్డారు. తెలంగాణ పునరుత్పాదక ఇంధన సంరక్షణ సౌరశక్తి (తెలంగాణ రెడ్కో)లో డివిజనల్ ఇంజనీర్‌గా పని చేస్తున్న ముత్యం వెంకటరమణ ఇంటితో పాటు ఖమ్మంలోని ఆయన కార్యాలయంలో ఎసిబి అధిరారులు బుధవారం ఉద యం నుంచి రాత్రి వరకు సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణ వద్ద భారీగా నగలతో పాటు నగదు, స్థిరచరాస్తులను ఎసిబి అధికారులు జప్తు చేశారు. రాష్ట్ర ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో నడిచే తెలంగాణ రెడ్కోలో కొంతకాలంగా అక్రమాలు పెరిగిపోయినట్లు ఆరోపణలు రాగా దీనిపై ఎసిబి అధికారులు దృష్టి సారించారు. ఈ విభాగంలో కీలక హోదాలో వున్న పలువురిపై తీవ్రమైన అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఇం దులో వెంకటరమణ కూడా వుండడంతో ఆయనపై ఎసిబి అధికారులు నిఘా వుంచి అక్రమాస్తులపై ఆరా తీయగా ఇవన్నీ నిజమని తేలింది. దీ నిపై పూర్తి వివరాలు తెప్పించుకున్న తరువాత ఎసిబి డిఎస్‌పి మజీద్ అలీఖాన్ ఆధ్వర్యంలో అధికారులు 12 బృందాలుగా ఏర్పడి హైదరాబాద్ లోని మాదాపూర్‌లో గల ఆయన ఇంటితో పాటు ఖమ్మంలోని కొత్తగూడెంలో గల కార్యాలయంలోనూ సోదాలు జరిపారు. దీంతో పాటు వెంక టరమణ బంధువులు, సన్నిహితుల ఇళ్లలోనూ సోదాలు జరిపారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లిలో కోటీ 23 లక్ష ల 46 వేల రూపాయల విలు వచేసే నాలుగు ప్లాట్లు, కోటీ 82 లక్షల రూపాయల విలువచేసే వాణిజ్య భవనం, గుట్టల బేగంపేట్‌లో రెండు కోట్ల 90 లక్షల రూపాయల వి లువచేసే మరో ఖరీదైన భవనం వెలుగు చూడగా దీంతో పాటు కూకట్‌పల్లిలో పది అపార్ట్‌మెంట్లను నిర్మిస్తున్నట్లు తేలింది. దీని విలువ 20 కోట్ల రూపాయలు వుంటుందని ఎసిబి అంచనా వేసింది. ఆయన బ్యాంకుఖాతాలో 52 లక్షల 2585 రూపాయల నగదు, 40 లక్షల రూపాయల బంగారు నగలు, 45 లక్షలరూపాయల ఖరీదు చేసే నాలుగు వాహనాలు, 30 లక్షల రూపాయల ఖరీదు చేసే గృహోపకరణ వస్తువులు, ఆయన ఇంట్లో కోటి రూపాయల బంగారు నగలతో పాటు 30 లక్షల రూపాయల విలువచేసే వెండి నగలు పట్టుబడ్డాయి. దీంతో పాటు భారీ గా ఆస్తుల పత్రాలు, వాహనాలు, 19 విదేశీ మద్యం సీసాలు పట్టుబడ్డాయి. విదేశీ మద్యం బాటిళ్లను అబ్కారీ శాఖకు అప్పగించారు. వెంకటర మణ భార్య ఒక రియల్ ఎస్టేట్ కంపెనీలో డైరెక్టర్‌గా వుండడం, ఆ సంస్థలో భారీగా అక్ర మాలు జరిగినట్లు ఎసిబి గుర్తించింది. వెంకటరమణ భార్య మరికొన్ని కంపెనీలకు పలు హోదాల్లో వుంటున్నట్లు తేలడంతో వాటిపైనా ఎసిబిఅధికారులు దాడులు చేశారు. దాడుల సందర్భంగా వె ంకటరమణ ఇంటితో పాటు ఆయన బంధువులు, సన్నిహితుల ఇళ్ల నుంచి సోదాలు ముగిసే వరకుఎవరినీ బయటకు వెళ్లనివ్వలేదు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్య సేవలు అందేలా చేశారు. వెంకటరమణ వద్ద పట్టుబడ్డ అక్రమాస్తులు 27 కోట్ల 65లక్షల 2135 రూపాయలుగా తేలింది. బహిరంగ మార్కెట్లో దీని విలువ 150 కోట్ల రూపాయలకు పై బడి వుంటుందని ఎసిబి అధికారులు చెబుతున్నారు. కాగా 2019 డిసెం బరు 12వ తేదీన వెంకట రమణను 25 వేల రూపా యల లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులు పట్టుకున్నారు. అప్పట్లో కూడా ఆయన ఇంట్లో భారీగా అక్ర మాస్తులు వెలుగు చూశాయి. అక్రమాస్తుల కేసులో ఎసిబి అధికారులు వెంకటరమణను అరెస్టు తమ కస్టడీ లోకి తీసుకుని విచారిస్తున్నారు.

## కాంగ్రెస్ అహింస వదిలితే బిజెపి నేతలు తిరగలేరు

### ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూరి వెంకట్

**హైదరాబాద్,జులై 22,ప్రభాతవార్త:** కాంగ్రెస్ నేతలు అహింస మార్గం వదిలి, తిరగబడితే బిజెపి నేతలు రాష్టంలో తిరగలేరనీ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. నీట్ పేపర్ లీకేజీ అంశంలో కేంద్రం దిగొచ్చే వరకు ఆందోళన కొనసాగిస్తామనీ ఆయన తెలిపారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ దాడులకు భయపడే పార్టీ కాంగ్రెస్ కాదనీ పేర్కొన్నారు. భయమనేది కాంగ్రెస్ పార్టీ బ్లడ్ లోనే లేదనీ దేశ స్వాతంత్రం కోసం అహింస మార్గంలో తెల్ల దొరలను గడగడలాడించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదనీ గుర్తు చేసుకొన్నారు. దేశం కోసం ప్రాణాలను పణంగా పెట్టిన చరిత్ర రాహుల్ గాంధీ కుటుంబానిదనీ చెప్పారు. పోలీసుల ముందే విద్యార్థులపై బిజెపి, ఆర్ ఎస్ ఎస్ నేతలు కర్రలతో దాడులు చేసిన హింసాత్మక చరిత్ర మీదనీ విమర్శించారు. విద్యార్థులు, యువకుల భవిషత్ కోసమే రాహుల్ గాంధీ, ఆరాటం, కాంగ్రెస్ పోరాటం. వారికి న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ ఆందోళనలు మరింత ఉధృతం చేస్తుందనీ హెచ్చరించారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న నేతలపై దాడులు చేయడం, అరెస్టు చేయడం అప్రజాస్వామికమనీ విమర్శించారు. ముందు గాంధీ భవన్ పై బిజెపి నేతలు దాడి చేసి, ఫ్లెక్సీలు చించి వేశారు. దీనికి నిరసనగా కాంగ్రెస్ నాయకులు, బిజెపి కార్యాలయం ఎదుట శాంతి యుతంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సమయంలో చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్న బిజెపి, ఆర్ఎస్ఎస్ గుండాలు, కర్రలు, రాళ్లతో కాంగ్రెస్ నేతలతో పాటు పోలీసులు, మీడియా ప్రతి నిధులపై దాడులు చేశారనీ విమర్శించారు. రాజకీయాల్లో ఈ దాడుల విష సంస్కృతి మంచిది కాదు. అది వాళ్లకు కూడా మంచిది కాదు. మొన్న ఆర్మూరు లోనూ బిజెపి, ఆర్ఎస్ఎస్ నేతలు కర్రలతో ఇలాగే దాడులు చేశారని గుర్తుచేశారు.

# ప్రాణాలు బలిగొన్న నిర్లక్ష్యం.. బ్యాటరీ పేలి బాలుడు మృతి

**చింతలమానేపల్లి, జులై 22, ప్రభాతవార్త:** ఆడుతూపాడుతూ కళ్లముందు తిరగాల్సిన పసిగుడ్డు క్షణాల వ్యవధిలో జరిగిన అనూహ్య ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. బాలుడు చేసిన చిలిపి చేష్ట ప్రాణాల మీదికి తెచ్చి ఆ తల్లిదండ్రుల జీవితాల్లో తీరని విషాదం నింపింది. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలంలోని గూడెం గ్రామంలో జరిగిన ఈ హృదయ విదారక ఘటన అందరినీ కంటతడి పెట్టించింది. గూడెం గ్రామానికి చెందిన నికాడి గణేష్ కుమారుడు లోకేష్ బుధవారం ఉదయం తన ఇంటిలో ఆడుకుంటున్నాడు. ఆ సమయంలో అక్కడ పడి ఉన్న ఒక బ్యాటరీ ఆ బాలుడి కంటపడింది. పసివయసు కావడంతో దాని ప్రమాదం గురించి తెలియని ఆ బాలుడి, ఆటలాడుతూ ప్రమాదవశాత్తు నోటితో గట్టిగా కొరికాడు. ఊహించని విధంగా ఆ బ్యాటరీ ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలిపోయింది.

ఈ ఘోర ప్రమాదంలో బాలుడి ముఖం, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. రక్తపు మడుగులో విలవిల్లాడుతున్న కొడుకు ను చూసి కుటుంబ సభ్యులు లబోదిబోమన్నారు. వెంటనే ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేసినప్పటికీ, మార్గమధ్యలోనే ఆ పసిప్రాణం గాలిలో కలిసిపోయింది. కళ్లముందే కొడుకు విగతజీవుడిగా మారడాన్ని తట్టుకోలేక తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్న తీరు అక్కడివారందరినీ కలచివేసింది. అర్ధాంతరంగా బాలుడి తనువు చాలించడంతో గూడెం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న వెంటనే కౌటాల సీఐ సంతోష్, ఎస్సై కమలాకర్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు ఆరా తీశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.




బ్యాటరీ పేలుడులో మృతిచెందిన లోకేష్(ఫైల్)

# దేశవ్యాప్తంగా ఇక భారీ వర్షాలు!

## వాతావరణ వ్యవస్థలో ఐదు కీలక మార్పులు

## రుతుపవనాల్లో కదలిక..ఐఎండి విశ్లేషణ



**న్యూఢిల్లీ, జులై 22:** దేశవ్యాప్తంగా మరోసారి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. కొంత విరామం తర్వాత రుతుపవనాలు మళ్లీ ఉధృతంగా మారాయి. అనేక రాష్ట్రాల్లో వర్షపాతంలో అకస్మాత్తుగా వచ్చిన మార్పు లేదా పెరుగుదల గురించి వాతావరణ శాస్త్రవేత్తలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. భారతదేశం అంతటా ఐదు వాతావరణ వ్యవస్థలు కలిసి పనిచేస్తున్నాయని భారత వాతావరణ శాఖ (ఐఎండి) పేర్కొంది. దేశం లోపలి భాగంలో దట్టమైన మేఘాలు, తేమతో కూడిన వాతావరణం ఏర్పడినట్లు ఇస్రో ఉపగ్రహ చిత్రాలు కూడా చూపిస్తున్నాయి. ఐఎండి ప్రకారం, ఈ ప్రాంతంలోని 'మాన్సూన్ ట్రఫ్', నాలుగు 'సైక్లోనిక్ సర్క్యులేషన్స్' (చక్రవాత ప్రసరణ వ్యవస్థలు) ప్రస్తుత రుతుపవన పరిస్థితులకు కారణం. బంగాళాఖాతంపై మూడుకు పైగా చక్రవాత వ్యవస్థలు, అరేబియా సముద్రంపై మరొక వ్యవస్థ ఏర్పడ్డాయి. ఇవన్నీ కలిసి తేమను భారత ప్రధాన భూభాగం వైపు లాగుతూ, విస్తృత వర్షపాతానికి అనుకూలమైన పరిస్థితులను సృష్టిస్తున్నాయి. ఈ యేడాది ఎల్‌నినో ప్రభావం రుతుపవనాలపై ఉంటుందనే అంచనాలు ఉన్నప్పటికీ, ప్రస్తుతం ఏర్పడిన ఐదు సైక్లోనిక్ సర్క్యులేషన్లు, రుతుపవనాల ద్రోణి కలిసి స్థానికంగాబలమైన వర్ష పరిస్థితులను సృష్టిస్తున్నాయని నిపుణులు తెలిపారు.

**అరేబియా సముద్రం నుండి బంగాళాఖాతం వరకు విస్తరించిన 'మాన్సూన్ ట్రఫ్':** నైరుతి రుతుపవనాల సమయంలో, అల్పపీడనంతో కూడిన ఒక పొడవైన ప్రాంతం ఏర్పడుతుంది, దీనినే 'మాన్సూన్ ట్రఫ్' అంటారు. ఇది బంగాళాఖాతం, అరేబియా సముద్రం నుండి తేమతో కూడిన గాలిని తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఈ ట్రఫ్ క్రియాశీలకంగా మారినప్పుడు, మేఘాలు వేగంగా ఏర్పడి దేశంలోని చాలా ప్రాంతాల్లో ఉరుములతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయి. సీజన్ మొత్తంపై ఎల్‌నినో ప్రభావం ఉన్నప్పటికీ, ఇలాంటి స్వల్పకాలిక వాతావరణ వ్యవస్థలు కొన్ని రోజుల పాటు భారీ వర్షాలను కురిపించగలవని వాతావరణ శాస్త్రవేత్తలు వివరించారు. బంగాళాఖాతం, అరేబియా సముద్రంలో ఏర్పడిన ఐదో సైక్లోనిక్ సర్క్యులేషన్లు (వాయుగుండాలు) కలిసి రుతుపవనాలకు బలం చేకూరుస్తున్నాయని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)కు చెందిన ఇన్‌శాట్-3డిఆర్, ఇన్‌శాట్-3డిఎస్ ఉపగ్రహ చిత్రాలు వెల్లడించాయి. ఈ వ్యవస్థల ప్రభావంతో ఢిల్లీతోపాటు ఉత్తర, మధ్య, తూరు ్ప భారతదేశంలో మళ్లీ విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. బుధవారం ఉదయం ఇస్రో ఉపగ్రహాలు సేకరించిన చిత్రాలను భారత వాతావరణ శాఖ విశ్లేషించింది. ప్రస్తుతం హర్యానా, ఈశాన్య మధ్యప్రదేశ్, నైరుతి రాజస్థాన్, ఉత్తర ఛత్తీస్‌గఢ్, పశ్చిమ-మధ్య బంగాళాఖాతం ప్రాంతాల్లో ఐదు సైక్లోనిక్ సర్క్యులేషన్లు ఉన్నట్లు గుర్తించింది. అదే సమయంలో బంగాళాఖాతంలోని వాయుగుండాన్ని ఈశాన్య అరేబియా సముద్రంతో అనుసంధానించే రుతుపవనాల అల్పపీడన ద్రోణి కూడా చురుగ్గా కొనసాగుతోంది. దీంతో రెండు సముద్రాల నుంచి తేమగాలులు దేశంలోకి ప్రవేశించి వర్షాలకు అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

భారత వాతావరణ శాఖ అంచనా ప్రకారం, మరో నాలుగైదు రోజుల పాటు దేశంలోని పలు ప్రాంతాల్లో రుతుపవనాలు చురుగ్గా కొనసాగనున్నాయి. ముఖ్యంగా కొంకణ్-గోవా, గుజరాత్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, బీహార్, ఈశాన్య రాష్ట్రాలు, పశ్చిమ హిమాలయ ప్రాంతాల్లో విస్తృతంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో లోతట్టు ప్రాంతాల్లో నీటిమునిగే పరిస్థితులు, రవాణా అంతరాయాలు ఏర్పడే అవకాశముందని ఐఎండి హెచ్చరించింది.

# రూ.250 కోట్ల రాష్ట్రవాటాతో ఆదిలాబాద్ సిమెంట్ కార్పొరేషన్ పునరుద్ధరణ సాధ్యమే

## సిఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాసిన బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జులై22:** ఆదిలాబాద్ సీసీఐ (సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) పునరుద్ధరణపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ఆదిలాబాద్ అభివృద్ధికి సీసీఐ పునరుద్ధరణ కీలకమని,రూ.250 కోట్ల రాష్ట్ర వాటాతో పునరుద్ధరణ సాధ్యమేనని కేటీఆర్ సుదీర్ఘ లేఖలో పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపకపోవడమే జాప్యానికి కారణమన్న కేటీఆర్ సీసీఐ పునరుద్ధరణపై రేవంత్ ఇచ్చిన హామీలను గుర్తు చేశారు.గతంలో బీఆర్ఎస్ హయాంలో చేసిన ప్రతిపాదనలను ప్రస్తావించారు. ఆదిలాబాద్ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. రెండున్నరేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వ చిత్త శుద్ధి లోపం వల్లే జాప్యం జరిగిందని. సీసీఐపై ఆరు కీలక ప్రశ్నలకు సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇటీవలే సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం కేటీఆర్, సీసీఐ సాధన సమితి బృందం ఢిల్లీకి వెళ్లి కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కలిసిందని తెలిసిందే. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ ఆదిలాబాద్ నుంచి మాజీ మంత్రి జోగురామన్న, ఎంపీ వద్దిరాజు రవిచంద్రతోపాటు సీసీఐ సాధాన సమితి సభ్యులను అందరినీ తీసుకొని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామిని కలిశామని పేర్కొన్నారు. 1980వ దశకంలో ఏర్పాటు చేయబడ్డ సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్లాంట్ ఒకదశలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 6 వేల మందికి ఉద్యోగాలు కల్పించిందని అన్నారు. రాబోయే 100 సంవత్సరాల వరకు మీకు మైన్ స్టోన్ రిజర్వ్‌లు కూడా మీకు ఉన్నాయి. 4 లక్షల మెట్రిక్ టన్నుల కెపాసిటీతో ఉన్న ఈ ప్లాంట్‌ను నడిపేందుకు అవకాశాలు సంపూర్ణంగా ఉన్నాయన్నారు.

గతంలో 2019లో కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా మాటిచ్చారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఈ ప్లాంట్‌ను తప్పకుండా తెరిపిస్తామని పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా చెప్పారు. ప్లాంట్‌ను తెరిపిస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారాం కూడా మాటిచ్చారు. కానీ ఈ రోజు ఆదిలాబాద్ సీసీఐని తుక్కు కింద అమ్మేస్తున్నరని కేంద్ర మంత్రి కుమారస్వామికి వివరంగా చెప్పామని పేర్కొన్నారు.

# రైల్వే సమస్యలను పరిష్కరించండి

## సౌత్ సెంట్రల్ రైల్వే జిఎంకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య వినతి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జులై22:** పెద్దపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధి వేగవంతం చేయాలని, మౌలాలి ఫుట్ ఓవర్ బ్రిడ్జ్‌ను నాచారం వైపు నిర్మించాలని కోరుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య సౌత్ సెంట్రల్ రైల్వే జిఎం సంజయ్‌కుమార్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు.అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ కింద పెద్దపల్లి రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలని కోరారు. మౌలాలి రైల్వే స్టేషన్‌లో ప్రస్తుతం ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ గూడ్స్ ట్రాక్‌ల వరకు మాత్రమే ఉందని దానిని విస్తరించాలని కోరారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జ్‌లేకపోవడంతో దుర్గానగర్ కాలనీ,నాచారం, మల్లాపూర్ ప్రాంతాలకు చెందిన వేలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు,పారిశ్రామిక రంగ సిబ్బంది ప్రతిరోజూ రైల్వే గేటు వద్ద గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని రైల్వే జీఎం దృష్టికి తీసుకెళ్లారు.

# త్వరలో దాశరథి విగ్రహం ఏర్పాటు

## మహాకవి దాశరథి కృష్ణమాచార్య 101వ జయంతి వేడుకల్లో ప్రకటించిన సాంస్కృతికశాఖ ప్రత్యేక కార్యదర్శి ఎ.వాణీప్రసాద్

## సీనియర్ పాత్రికేయుడు గుడిపాటి వెంకటేశ్వర్లుకు దాశరథి పురస్కారం ప్రదానం

**రవీంద్రభారతి, జులై 22 ప్రభాతవార్త :** ప్రభుత్వం త్వరలో దాశరథి కృష్ణమాచార్య విగ్రహాన్ని హైదరాబాద్ నగరంలో ఏర్పాటుచేసే ఆలోచనలో ఉందని, అలాగే దాశరథి పేరున ఉద్యానవనం, నిజామాబాద్ ఖిల్లా జైలును దాశరథి స్మృతి చిహ్నంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నం చేస్తామని తెలంగాణ ప్రభుత్వ యువజనాభ్యుదయ, పర్యాటక, సాంస్కృతికశాఖల ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి ఎ.వాణీప్రసాద్ ఐఎఎస్ అన్నారు. దాశరథి తన కవితలు, రచనల ద్వారా తెలంగాణ రాష్ట్రం, సమాజం కోసం పోరాడారని, ఇలాంటి ప్రతీ వైతాళికుడు, మహానుభావుడిని జ్ఞాపకం చేసుకోవడం వల్ల మన భవిష్యత్తు కూడా స్థిపరడుతుందన్నారు. తెలుగింట దాశరథి పాట వినపడకుండా పొద్దు పొడవదు, గూకదని ఆమె స్పష్టం చేశారు. భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో బుధవారం రాత్రి రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి అధ్యక్షతన దాశరథి కృష్ణమాచార్య 101వ జయంతి ఉత్సవాలు, ప్రతిష్టాత్మక డా. దాశరథి కృష్ణమాచార్య సాహిత్య పురస్కారం ప్రదానం నయనానందకరంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎ.వాణీప్రసాద్, గౌరవ అతిథులు




దాశరథి సాహిత్య పురస్కారంతో గుడిపాటి దంపతులను సత్కరిస్తున్న ఎ.వాణీప్రసాద్, ఎ.నరసింహారెడ్డి, జి.వి.వెన్నెల, ఎ.వేణుగోపాల్, లక్ష్మణ్, ఇందిర తదితర అతిథులు

తెలంగాణ సాంస్కృతిక సారధి అధ్యక్షురాలు డా. జి.వి.వెన్నెల, కాళోజీ అవార్డు గ్రహీత డా. అమ్మంగి వేణుగోపాల్, దాశరథి కుమారుడు దాశరథి లక్ష్మణ్, కుమార్తె ఇందిర తదితరులతో కలిసి డా. దాశరథి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రముఖ కవి,రచయిత, సీనియర్ పాత్రికేయుడు గుడిపాటి వెంకటేశ్వర్లు దంపతులకు ప్రతిష్టాత్మక డా. దాశరథి కృష్ణమాచార్య సాహిత్య పురస్కారం ప్రదానం చేసి లక్ష వెయ్యి నూటపదహారు రూపాయల నగదు, జ్ఞాపిక, శాలువతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఏనుగు నరసింహారెడ్డి అధ్యక్షోపన్యాసంలో ఎన్నో సంఘర్షణల తెలంగాణ నేలలో పుట్టిన అభ్యుదయ ఉద్యమకవి దాశరథి అని కొనియాడారు. నిజాం పాలన అంతమయ్యేవరకు జైలుశిక్షను కూడా లెక్కచేయకుండా పోరాటం చేసిన గొప్ప సాహితీవేత్త అన్నారు. జి.వి.వెన్నెల బడుగు బలహీనవర్గాల శ్రేయస్సు ఆలోచనలతో ఎన్నో కవితలు రాసారన్నారు.

# ప్రణాళికల ద్వారానే వ్యవసాయ రంగాన్ని పరిరక్షించగలం

## రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా.జి.చిన్నారెడ్డి

**బేగంపేట జులై 22,ప్రభాతవార్త:** సమన్వయ పాలన శాస్త్రీయ ఆధారిత ప్రణాళికల ద్వారానే వ్యవసాయం,అనుబంధ రంగాలను పరిరక్షించగలమని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా.జి. చిన్నారెడ్డి అన్నారు.బుధవారం ప్రజాభవన్‌లో తెలంగాణా రాష్ట్ర ప్రణాళికా మండలి ఉపాధ్యక్షులు డా.చిన్నారెడ్డి అధ్యక్షతన ఎలినినో సన్నద్ధతపై రాష్ట్రనిపుణుల కమిటీ తొలి సమావేశం నిర్వహణ,శాస్త్రీయ విశ్లేషణ ఆధారంగా రాష్ట్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించే దిశగా సమావేశం నిర్వహించారు.వాతావరణ మార్పుల ప్రభావం రోజు రోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ముందస్తు సన్నద్ధత అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్రంలో ప్రస్తుత ఎలినినో పరిస్థితుల ప్రభావాన్ని అంచనా వేయడం,వ్యవసాయం, అనుబంధ రంగాల కోసం రాష్ట్ర స్థాయి అత్యవసరణ కార్యాచరణ ప్రణాళిక రూపొందించండం ఉపశమన అనుసరణ చర్యలను సిఫార్స్ చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 27మంది సభ్యులతో కూడిన బహుళ విభాగాల నిపుణుల కమిటీ తొలి సమావేశం చిన్నారెడ్డి అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశంలో చిన్నారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత నైరుతి రుతుపవనాల కాలంలో తెలంగాణాలో అసాధారణ వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. జూన్ 1నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో సగటున 30శాతం వర్షపాత లోటు నమోదైందని, 10జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా 23జిల్లాల్లో లోటు వర్షపాతం ఉందని తెలిపారు. జులై 17న జరిగిన రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో ముఖ్యమంత్రి ఎలినినో ప్రభావంపై సమగ్ర అధ్యయనం చేసి తగిన ఉపశమన, అనుసరణ చర్యలను సూచించేందుకు ఈ నిపుణుల కమిటీని ఏర్పాటు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేసారు.వరి విస్తీర్ణాన్ని తగ్గించి కూరగాయలు,చిరుధాన్యాలు,నూనె గింజలు, పప్పుధాన్యాలు, వంటి ప్రత్యా మ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. పశుగ్రాస సాగును ప్రోత్సహించడంతో పాటు పశువులకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు నీటి తొట్ల ఏర్పాటు మరమ్మతులకు ప్రభుత్వం సహకారం అందిస్తుందని చెప్పారు.తాగునీటి కొరత లేకుండా అన్ని గ్రామాలు,తండాలకు సురక్షిత తాగునీటి సరఫరా నిరంతరంగా కొనసాగించేలా ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపట్టిందని తెలిపారు.



బుధవారం చిన్నారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బహుల విభాగాల నిపుణుల కమిటీ సమావేశం

ఈ సమావేశంలో నీటి పారుదల శాఖ కార్యదర్శి శ్రీధర్,ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్,ప్రధాన ముఖ్య అటవీ సంరక్షణాధికారి వినయ్ కుమార్,పంచాయితీ రాజ్ గ్రామీణాబివృద్ధి శాఖ కమీషనర్ దివ్య దేవరాజన్,వ్యవసాయ శాఖ డైరక్టర్ గోపి,భారత వాతావరణ శాఖ శాస్త్రవేత్త డా.స్టెల్లా ,ఉద్యాన శాఖ డైరక్టర్ యాస్మిన్ భాషా,తదితర శాఖల ఉన్నతాధికారులు పరిశోధనా సంస్థలు విశ్వ విద్యాలయాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎన్‌సివిఇటి, ఎన్ఐఆర్‌డిపిఆర్‌ను అవార్డింగ్ బాడీగా గుర్తింపు

**అత్తాపూర్, జులై 22,ప్రభాతవార్త :** జాతీయ వృత్తి విద్యా, శిక్షణ మండలి మరియు భారత ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖకు చెందిన స్వయంప్రతిపత్తి సంస్థ అయిన జాతీయ గ్రామీణాభివృద్ధి మరియు పంచాయతీ రాజ్ సంస్థ (ఎన్ఐఆర్‌డిపిఆర్), అవార్డింగ్ బాడీ (ఎబి-డ్యూయల్)గా ఎన్‌సివిఈటి గుర్తింపు కోసం బుధవారం ఒప్పందంపై సంతకం చేశాయి. ఈ గుర్తింపు ద్వారా ఎన్ఐఆర్‌డిపిఆర్ తన ఆమోదిత లేదా స్వీకరించిన అర్హతల కోసం, అవార్డింగ్ బాడీ యాజమాన్యంలో లేదా పూర్తి నిర్వహణలో ఉన్న క్యాంపస్‌లు లేదా శిక్షణా కేంద్రాలలో నేరుగా శిక్షణ ఇస్తున్న చోట, అభ్యాసకులకు అవార్డులు ఇవ్వడానికి, మూల్యాంకనం చేయడానికి మరియు ధృవీకరించడానికి అర్హత పొందుతుంది. నైపుణ్యాభివృద్ధి మరియు వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి మరియుఎన్‌సివిఈటి కార్యనిర్వాహక సభ్యులైన నిరంజన్ కుమార్ సుధాన్షు అధ్యక్షతన ఈ ఒప్పంద సంతకాల కార్యక్రమం జరిగింది.

# ఎల్ నినో ఎఫెక్ట్..ఖరీఫ్‌లో విద్యుత్ డిమాండ్ రెట్టింపు

## సాగునీరు లేక పంపు సెట్లే ఆధారం

## ఆగస్టు-నవంబర్ మధ్య భారీ డిమాండ్

## రోజూ 6,500-7,000 మెగావాట్లకు పెరిగే ఛాన్స్

## సబ్సిడీ కింద సర్కార్‌కు రూ.14,500 కోట్లు ఖర్చు

## వర్షాభావంతో విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రణాళిక

**హైదరాబాద్, జులై 22, ప్రభాతవార్త:** ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సాగునీటి ప్రాజెక్టులలోకి నీటి ప్రవాహం దాదాపుగా లేకపోవడంతో, తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ రంగంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరగనుంది. రాష్ట్ర విద్యుత్ శాఖ ప్రాథమిక అంచనాల ప్రకారం, ఈ ఏడాది ఆగస్టు నుంచి నవంబర్ మధ్య ఉండే గరిష్ట వ్యవసాయ కాలంలో, కేవలం వ్యవసాయ పంపుసెట్ల కోసమే విద్యుత్ డిమాండ్ రోజుకు సుమారు 7,000 మెగావాట్లు ఉండవచ్చని అంచనా వేసింది. ప్రధానంగా వరి, పత్తి వంటి అధిక నీటి వినియోగం గల పంటల సాగుకు దూరంగా ఉండాలని ప్రభుత్వం రైతులకు పదేపదే విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ, రాష్ట్రంలో ఈ రెండు ప్రధాన పంటల సాగు విస్తీర్ణం పెరుగుతూనే ఉంది. ఇటీవలి వరకు రాష్ట్రంలోని జలాశయాలలో నీటిమట్టాలు దాదాపు డెడ్ స్టోరేజ్‌లో ఉన్నందున, వేసిన పంటలను కాపాడుకోవడానికి, నాట్లు వేయడంతో పాటు, సీజన్ పూర్తయ్యేంత వరకూ సాగు చేసేందుకు ఏకైక మార్గం వ్యవసాయ పంపుసెట్లను నడపడమే రైతుల ముందు ఉన్న ప్రధాన అవకాశంగా భావిస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో దాదాపు 30 లక్షల పంపుసెట్లు పనిచేస్తున్నాయి. కానీ ఎల్ నినో కారణంగా వాతావరణ, వర్షాభావ పరిసిన్థతులు ,న్నంగా ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ అవసరాల కోసం విద్యుత్ డిమాండ్ అత్యధిక స్థాయిలో ఉండబోతోంది. వ్యవసాయ రంగం అవసరాలను తీర్చడానికి వచ్చే నెల నుంచి రోజుకు సుమారు 6,500 మెగావాట్ల నుంచి 7,000 మెగావాట్ల విద్యుత్ అవసరం అవుతుందని విద్యుత్ శాఖ అధికారులు ప్రాథమిక ప్రణాళికలో స్పష్టం చేశారు. గత ఖరీఫ్ సీజన్లలో, సగటున విద్యుత్ డిమాండ్ రోజుకు 3,500 మెగావాట్లకు మించలేదు. కానీ ఈ సారి వర్షాభావంతో అది రెట్టింపు చేరుకుంటుందని అంచనా వేశారు. కాగా 'రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ నిమిత్తం రాయితీ కోసం రూ.14 వేల కోట్లు ఖర్చు చేస్తోంది. ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరంలో, ఖరీఫ్ సీజన్‌లో అన్ని పంపుసెట్‌లను పనిచేయిస్తే, ఈ ఖర్చు ఇంకా పెరిగి సుమారు రూ.14,500 కోట్లు అవుతుందని విద్యుత్ శాఖకు చెందిన ఉన్నతాధికారులు తెలిపారు. వ్యవసాయ అవసరాల కోసం పంపు సెట్లపై ఆధారపడే రైతులు విద్యుత్ వినియోగం పెరగడంతో రాష్ట్రానికి పెద్ద భారం అవుతుందని లెక్కకడుతున్నట్లు వెల్లడించారు. ఎల్ నినో ప్రభావంతో భూగర్భ జలమట్టాలు పడిపోతున్న దృష్ట్యా, పంపు సెట్లను ఎక్కువ గంటలు నడపడం వల్ల వచ్చేరుతుపవన కాలం వరకు ఇతర గృహ అవసరాలకు కూడా నీటి కొరత అనే మరో పెద్ద సంక్షోభం ఏర్పడుతుందని అధికారులు తెలిపారు. ఈలోగా, వ్యవసాయ రంగానికి నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ఒక ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నామని అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలో సుమారు 30 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నందున, రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆయన అన్నారు. భూగర్భ జలాల పరిరక్షణ చర్యలతో పాటు నీటి పొదుపు పద్ధతులను కూడా పాటించాలని రైతులకు సూచించినట్లు ఆయన తెలిపారు.

# విద్యార్థులు, యువతను తప్పు దారిపట్టిస్తున్న విపక్షాలు

## కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ధ్వజం

**న్యూఢిల్లీ,జులై 22:** నీట్‌యూజీ 2026 ప్రశ్న పత్రం లీక్ వ్యవహారంపై దేశ రాజధానిలో విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతున్న వేళ కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రతిపక్షాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. విద్యార్థులు, యువతను రాజకీయ ప్రయోజనాల కోసం సాధనంగా ఉపయోగించేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. విద్యార్థులకు ఎలాంటి అన్యాయం జరగకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్పష్టంచేశారు. ప్రధాని మోడీ నాయక త్వంలోని ప్రభుత్వంవిద్యార్థులు,యువత సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉందని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. విద్యార్థుల ప్రతిఆందోళనను విని పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యత అని చెప్పారు.


# భారత్ సంతతి శాస్త్రవేత్తపై లైంగికవేధింపుల ఫిర్యాదు, రాజీనామా

**వాషింగ్టన్,జులై 22:** భారతీయ మూలాలు ఉన్న ప్రఖ్యాత శాస్త్రవేత్త సచ్చిదానంద పండా కాలిఫోర్నియాలోని సాల్క్ ఇన్స్‌టిట్యూట్ కంపెనీకి రాజీనామా చేశారు. ఆయనపై లైంగిక వేధింపుల ఆరోపణలు నమోదు అయ్యాయి. ఆ రీసెర్చ్ సెంటర్‌లో సుమారు 22 ఏళ్లుగా ఆయన వివిధ పరిశోధనలు నిర్వహించారు. ప్రముఖ బయోలజిస్ట్‌గా ఆయనకు గుర్తింపు ఉన్నది. ఆగస్టు 13వ తేదీ నుంచి ఆయన రాజీనామా అమలులోకి రానున్నది. ఆయన ల్యాబ్‌లో పనిచేస్తున్న ఓ మహిళా రీసర్చ్ అసిస్టెంట్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సాల్క్ కంపెనీ దర్యాప్తు చేపట్టింది. వర్క్‌ప్లేస్‌లో అసభ్య ప్రవర్తన కారణంగా ప్రస్తుతం ఆయన్ను అడ్మినిస్ట్రేషన్ లీవ్‌పై పంపారు. అయితే సచ్చిదానందపై ఫిర్యాదు చేసిన మహిళ తన ఉద్యోగాన్ని వదిలేసి వెళ్లిపోయింది. ఈ ఏడాది రెండో సారి సచ్చిదానందపై వేధింపుల ఆరోపణల్లో సాల్క్ కంపెనీ విచారణ చేపట్టింది. కానీ తానేమీ లైంగిక వేధింపులకు పాల్పడలేదని శాస్త్రవేత్త సచ్చిదానంద పండా తెలిపారు.

# ఇరాన్ ఇకపై దాడిచేస్తే వంతెనలు, విద్యుత్‌ప్లాంట్లు మొత్తం పేల్చేస్తాం

## ఇరాన్ దాడులపై మరోసారి ట్రంప్ సీరియస్ వార్నింగ్

**వాషింగ్టన్,జులై 22:** హర్మూజ్ జలసంధి కేంద్రంగా పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. ఈ వ్యూహాత్మక జలమార్గంలో రాకపోకలు సాగించే వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడుల్ని తీవ్రతరం చేయడంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఆ దేశానికి హెచ్చరికలు చేశారు. హర్మూజ్ జలసంధిలో ఏదైనా ఓడపై ఇరాన్ దాడి చేస్తే, దానికి వెంటనే ప్రతీకారం ఉంటుందని, మౌలిక సదుపాయాలపైనా వైమానిక దాడులు జరుపుతామని స్పష్టం చేశారు. ఇరాన్ ప్రతీ దాడికి బదులుగా టెహ్రాన్‌లోని ఒక ప్రధాన వంతెన లేదా విద్యుత్ ప్లాంట్‌ను అమెరికా బాంబులతో పేల్చేసి, పూర్తిగా ధ్వంసం చేస్తుందని అన్నారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ట్రూత్ సోషల్‌లో ట్రంప్ ఇరాన్‌కు వార్నింగ్ ఇచ్చారు. ఇరాన్‌తో ఘర్షణలు మళ్లీ ఉధృతమవుతున్న నేపథ్యంలో ట్రంప్ చేసిన తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇప్పటి నుంచి ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ హర్మూజ్ జలసంధిలో ఏదైనా ఏ ఓడపై అయినా మిసైల్, రాకెట్, డ్రోన్ లేదా ఇతర ఏ ఆయుధంతో అయినా దాడి చేస్తే, అమెరికా వెంటనే ఇరాన్ రాజధాని టెహ్రాన్ నగరంలో లేదా దాని సమీపంలో ఉన్న ఒక వంతెనను లేదా విద్యుత్ ప్లాంట్‌ను బాంబులతో ధ్వంసం చేస్తుందని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. కొద్ది రోజుల కిందట



యుద్ధ విరమణకు సంబంధించి కుదిరిన తాత్కాలిక ఒప్పందాన్ని లెక్కచేయకుండా ఇరు దేశాలు మళ్లీ భీకర దాడులు చేసుకుంటున్నాయి. దీంతో గల్ఫ్ ప్రాంతంలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. గతంలో కూడా ఇరాన్ పౌర మౌలిక సదుపాయాల్ని లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించిన ట్రంప్ ఇప్పుడు మరోసారి అదే వైఖరిని పునరుద్ఘాటించారు. ప్రపంచ చమురు రవాణాలో ఐదో వంతు జరిగే హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు పెరగడం అంతర్జాతీయ ఇంధన మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపుతుందని, ఇప్పటికే క్రూడాయిల్ ధరలు భారీగా పెరుగుతున్నాయని నిపుణులు అంటున్నారు. ఇదిలా ఉండగా అమెరికా సెంట్రల్ కమాండ్ వరుసగా 11వ రాత్రి అయిన మంగళవారం కూడా ఇరాన్ సైనిక స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ప్రకటించింది. వాణిజ్య నౌకల రాకపోకలకు అంతరాయం కలిగించే ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని బలహీనపరచడమే ఈ చర్యల లక్ష్యమని వెల్లడించింది. ఇక్కడ ఇరాన్‌తో దౌత్య చర్చలకు తాము సిద్ధంగా ఉన్నప్పటికీ, ఇరాన్ అంత సీరియస్‌గా లేదని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో మండిపడ్డారు. అంతర్జాతీయ జలమార్గాలపై ఇరాన్ ఆధిపత్యం చూపించడం లేదా సుంకాల్ని వసూలు చేయడాన్ని అంగీకరిస్తే ప్రపంచవ్యాప్తంగా ప్రమాదకర పరిస్థితులు ఏర్పడతాయని హెచ్చరించారు. ఇదే సమయంలో హర్మూజ్ జలసంధిలోని వ్యూహాత్మకంగా అత్యంత ప్రాధాన్యం ఉన్న లారక్ దీవిపై అమెరికా క్షిపణి దాడి చేసిందని ఇరాన్ ప్రభుత్వ అనుబంధ మీడియా సంచలన ఆరోపణలు చేసింది. ఈ ఘటనతో ఇప్పటికే ఉద్రిక్తంగా ఉన్న అమెరికా ఇరాన్ సంబంధాలు మరింత తీవ్రరూపం దాల్చినట్లు తెలుస్తోంది.

# బిజెపి కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్తత

## రాంచందర్‌రావు,బిజెపి నేతలు అరెస్ట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జులై22:** గాంధీభవన్ ముట్టడికి బుధవారం బీజేపీ పిలుపు ఇచ్చింది. ఈ నేపథ్యంలో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు, ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో బీజేపీ నేతలు పోలీసుల చర్యలను వ్యతిరేకిస్తూ నిరసనకు దిగారు. నేతల అరెస్టుల సందర్భంగా పోలీసులకు, బీజేపీ కార్యకర్తలకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యాలయం పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో భద్రతను పోలీసులు మరింత కట్టుదిట్టం చేశారు. బీజేపీ నాయకుల అరెస్టుపై పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాగా, ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నివాసం ఎదుట మంగళవారం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆందోళన చేశారు. దీనికి నిరసనగా బీజేపీ అగ్రనేతలు గాంధీభవన్‌ను ముట్టడించాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో బీజేపీ కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకోవడంతో హై టెన్షన్ నెలకొంది. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, రాకేశ్‌రెడ్డిని, ఇతర నేతలను,బిజెపి తమిళనాడు కర్ణాటక రాష్ట్రాల సహా ఇంచార్జ్ పొంగులేటి సుధాకర్ రెడ్డిని పోలీసులు అరెస్టు చేసి గోషామహల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

**కరీంనగర్‌లో బండి సంజయ్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత :** ఇక, కరీంనగర్‌లో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కార్యాలయం వద్ద కూడా ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ పార్టీకి



చెందిన నాయకులు, కార్యకర్తలు బండి సంజయ్ కార్యాలయం వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో అక్కడ భారీగా పోలీసులు మోహరించారు. పోలీసులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షి స్తూ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు చేపట్టారు.

**బీజేపీ నేతల అరెస్టును ఖండించిన కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి:** ప్రధానమంత్రి నివాసం ముట్టడికి కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేయడంపట్ల తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు నాయకత్వంలో బుధవారం హైదరాబాద్‌లో చేపట్టిన నిరసన కార్యక్రమం సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యాలయం ముందుకు శాంతియుతంగా ప్రదర్శన చేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, పార్టీ ఎమ్మెల్యేలు, బీజేపీ నాయకులను, కార్యకర్తలను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రకటించారు.

# నీట్ పరీక్షను దేశవ్యాప్తంగా రద్దుచేయాలి: టివికె డిమాండ్

**చెన్నై,జులై 22:** దేశవ్యాప్తంగా నిర్వహించే నీట్ పరీక్షను కేంద్రం పూర్తిగా రద్దు చేసి, వైద్య విద్యపై పూర్తి హక్కులను రాష్ట్రాలకే ఇవ్వాలని తమిళనాడుకు చెందిన అధికార టీవీకే పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన చేసింది. ప్రస్తుతం నీట్ పేపర్ లీకేజీపై దేశవ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఢిల్లీలో సీజేపీ, కాంగ్రెస్ సహా ప్రతిపక్షాల ఆధ్వర్యంలో ఆందోళన జరుగుతోంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో నిరసనలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో టీవీకే పార్టీ స్పందించింది. నీట్ పరీక్ష నిర్వహణలో అవకతవకలపై చర్యలు తీసుకుంటే మాత్రమే చాలదని వైద్యవిద్యలో ప్రవేశం కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే నీట్ పరీక్షనే పూర్తిగా రద్దుచేయాలని ఆ పార్టీ డిమాండ్ చేస్తోంది. వైద్య విద్య నిర్వహణపై పూర్తి బాధ్యతల్ని రాష్ట్రాలకే అప్పగించాలని కూడా టీవీకే డిమాండ్ చేస్తోంది. ఇందుకోసం విద్యాను రాజ్యాంగంలోని ఉమ్మడి జాబితా నుంచి రాష్ట్ర జాబితాలోకి మార్చాలని కూడా కోరుతోంది. దీనివల్ల ఈ సమస్యకు పూర్తి పరిష్కారం లభిస్తుందని వెల్లడించింది. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వానికి చట్టపరంగా ఏదైనా ఇబ్బంది ఉంటే, అంతవరకు తాత్కాలికంగా రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారాలు ఇవ్వాలని సూచించింది.

దీనివల్ల సాధారణ విద్యతోపాటు వైద్యవిద్యపై రాష్ట్రాలకు పూర్తి హక్కు లభిస్తుందని తెలిపింది. నీట్ సమస్య పరిష్కారానికి ఇదే చక్కని పరిష్కారం అని గతంలోనే తమ నాయకుడు విజయ్ చెప్పారని ఆ పార్టీ వెల్లడించింది. ఇదే సమయంలో తమిళనాడులో ప్రతిపక్ష డీఎంకేపై మండిపడింది.

# అంతర్జాతీయ మహిళా క్రికెట్‌లో ఆణిముత్యం నల్లపురెడ్డి శ్రీచరణి

## ఎపి జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ నాగలక్ష్మి


టీమిండియా మహిళా క్రికెటర్ నల్లపురెడ్డి శ్రీచరణి సత్కరిస్తున్న జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ నాగలక్ష్మి

**విజయవాడ, జులై 22 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యుత్ రంగ ఉద్యోగుల కుటుంబాల నుంచి భారత క్రికెట్‌కు ప్రాతినిధ్యం వహించిన ప్రతిభావంతులైన క్రీడాకారులు రావడం మొత్తం విద్యుత్ కుటుంబానికే గర్వకారణమని ఆంధ్ర ప్రదేశ్ విద్యుత్ ఉత్పత్తి సంస్థ (ఎపి జెన్‌కో) మేనేజింగ్ డైరెక్టర్ నాగలక్ష్మి, పేర్కొన్నారు. ఒకప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డు (ఎపి ఎస్ఇబి)లో ఉద్యోగిగా పనిచేసిన మొహ్మద్ అజీజుద్దీన్ కుమారుడిగా భారత పురుషుల క్రికెట్ జట్టుకు నాయకత్వం వహించిన మాజీ కెప్టెన్ మొహమ్మద్ అజారుద్దీన్ దేశానికి విశిష్ట సేవలు అందించారన్నారు. నేడు రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు (ఆర్‌టిపిపి) ఉద్యోగి చంద్రశేఖర్ రెడ్డి కుమార్తె నల్లపురెడ్డి శ్రీచరణి భారత మహిళల క్రికెట్ జట్టులో స్థానం సంపాదించి దేశం తరపున రాణించడం విద్యుత్ రంగ చరిత్రలో మరో గర్వించదగ్గ విషయం అని ఆమె అన్నారు. బుధవారం విజయవాడలోని విద్యుత్ సౌధలో ఎపి జెన్‌కో ఆధ్వర్యంలో భారత మహిళల క్రికెట్ జట్టు సభ్యురాలు నల్లపు రెడ్డి శ్రీచరణికి ఘన సన్మాన కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లా డుతూ, భారత పురుషుల జట్టులో మొహమ్మద్ అజారుద్దీన్, మహిళల జట్టులో నల్లపురెడ్డి శ్రీచరణి వంటి క్రీడాకారులు విద్యుత్ రంగ ఉద్యోగుల కుటుంబాల నుంచి దేశానికి ప్రాతినిధ్యం వహించడం ప్రతి విద్యుత్ ఉద్యోగికి స్ఫూర్తిదాయకమని అన్నారు. విద్యుత్ రంగ ఉద్యోగుల కుటుంబాల నుంచి భారత క్రికెట్‌కు ఇద్దరు అంతర్జాతీయ క్రీడాకారులు రావడం విద్యుత్ శాఖకు విశేష గౌరవాన్ని తీసుకువచ్చిందని ఆమె పేర్కొన్నారు. వైఎస్సార్ కడప జిల్లా నుంచి భారత మహిళల క్రికెట్ జట్టుకు ఎంపికైన తొలి మహిళా క్రికెటర్లలో ఒకరిగా నిలిచిన శ్రీచరణి, గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా కృషి, పట్టుదల, ప్రతిభ ఉంటే అంతర్జాతీయ స్థాయికి చేరుకోవచ్చని యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొ న్నారు. విద్యుత్ రంగ ఉద్యోగుల కుటుంబాల్లోని పిల్లలు విద్య, క్రీడలు, ఇతర రంగాల్లో మరెన్నో ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ, నల్లపురెడ్డి శ్రీచరణి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి భారతదేశానికి, ఆంధ్ర ప్రదేశ్‌కు, విద్యుత్ కుటుంబానికి మరింత కీర్తి తీసుకురావాలని జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ నాగలక్ష్మి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా శ్రీ చరణి మాట్లాడుతూ, తనతండ్రి పని చేస్తున్న సంస్థలో తనకు జరిగిన ఈ సన్మానం పట్ల ఆమె ఆనందం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో జరుగబోయే క్రికెట్ పోటీల్లో మరింత మెరుగైన ప్రతిభను కనబరుస్తానని ఆమె ధీమా వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో శ్రీచరణి కుటుంబ సభ్యులతో పాటు ఎపి జెన్‌కో డైరెక్టర్లు ఉషా, సుజయ్ కుమార్, అశోక్ కుమార్ రెడ్డి, ఎపిపిడిసిఎల్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఎపి ట్రాన్స్‌కో డైరెక్టర్లు ఎవికె భాస్కర్, జెవి రావు, వెంకటరమణమూర్తి పాల్గొన్నారు.

# తిరుమలలో వేడుకగా మలయప్ప పల్లవోత్సవం



**తిరుమల, జులై 22 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలలో బుధవారం సాయంత్రం పల్లవోత్స వం వేడుకగా జరిగింది. మైసూరు మహారాజు జయంతిని పురస్కరించుకుని ఈ పల్లవోత్స వాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. సాయంత్రం సహస్రదీపాలంకారసేవ అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఊరేగింపుగా కర్ణాటక సత్రానికి వేంచేపు చేసి మైసూర్ సంస్థానం తరపున మహారాణి, యువరాజు ఆతిథ్యాన్ని స్వీకరించారు. అనంతరం కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు, మైసూరు సంస్థానం ప్రతినిధులు స్వామి, అమ్మవార్లకు ఆహ్వానం పలికి ప్రత్యేక హారతి సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యం సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు నరేష్, దర్శన్, ఆలయ పేష్కార్ రామకృష్ణ, అర్చకులు పాల్గొన్నారు.




# కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుపతిలో నిరసన


**తిరుపతి, జులై 22 ప్రభాతవార్త ప్రతినిధి:** నీట్ పరీక్షల్లో అక్రమార్కులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో కాంగ్రెస్ ఎంపి, లోకసభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నాయకత్వంలో ప్రియాంక గాంధీతో బాటు ఆ పార్టీ ఎంపీలు ఆందోళనకు దిగితే వారిని బలవంతంగా అరెస్టు చేసి నిర్బంధించడాన్ని తిరుపతిలో నిరసన వ్యక్తం చేశారు. అణచివేయాలని చూస్తే మరింతగా ఉద్యమాలు విస్తరిస్తాయన్నారు. దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ప్రధాని ఇంటి ముందు బైఠాయించడం ఇదే తొలిసారి అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఉద్యమాలు తీవ్రతరం అవుతాయని కాంగ్రెస్ తిరుపతి అధక్షుడు గౌడపేర చిట్టిబాబు హెచ్చరించారు. రాహుల్, ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ ఎంపిల అరెస్టుకు నిరసనగా కాంగ్రెస్ నేతలు తిరుపతిలో నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయం ముందు కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చిత్రపటం దగ్ధం చేశారు. ఈ ర్యాలీలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. ఎన్ఎస్ యుఐ జిల్లా అధ్యక్షుడు శివ బాలాజీ, తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాలగురవం బాబు, తిరుపతి అర్బన్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు, కాంగ్రెస్ పార్టీ నేతలు వెంకట నరసింహులు, కంభంపాటి మురళీకృష్ణ, తలప దామోదర్ రెడ్డి, రమేష్ రెడ్డి, దాసరి రత్నం, చిరంజీవి, కరీముల్లా, శ్రీనివాస్ గౌడ్, ఇళయరాజా, చిత్తూరు శివశంకర్, తవన్ కళ్యాణ్, శివకుమార్, గొడుగు చింత గోపి జ్యోతీశ్వర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పరిశ్రమల నిధులతో అంగన్‌వాడి భవనాలు


అంగన్‌వాడి భవనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**శ్రీకాళహస్తిరూరల్, జులై 22 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని గ్రామాల్లో పరిశ్రమల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్లు శాసన సభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి వివరించారు. బుధవారం శ్రీకాళహస్తి మండలం చల్లపాళెం బిసి కాలనీలో అంగన్‌వాడి భవనాన్ని, అలాగే తిరుమంజనం వారి కండ్రిగలో ఆర్‌ఓ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. వీటికి నిధులు హిందూస్తాన్ బెవరేజస్(కోకా కోలా) సియస్ఆర్ ప్రాజెక్టు నిధులతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ పిల్లల అభివృద్ధి కోసం కోకా కోలా యాజమాన్యం ముందుకు రావటం అభినందనీయం అన్నారు.
ఈ కార్యక్రమాల్లో కోకా కోలాకు చెందిన హిమాన్సు, జడ్‌పిటిసి వెంకట సుబ్బారెడ్డి, మార్కెటింగ్ కమిటి చైర్మన్ చెంచయ్య నాయుడు, మండలాధ్యక్షుడు కృష్ణయాదవ్, బత్తిరెడ్డి, తాటపర్తి రవీంద్రనాధ్ రెడ్డి, జగదీశ్వర రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, కామేష్ యాదవ్, సుదర్శనం రెడ్డి, సిడిపిఓ శాంతి దుర్గ, అంగన్‌వాడి సిబ్బంది పాల్గొన్నారు.

# కన్నుల పండువగా ద్రౌపదీ సమేత అర్జునుడు ఊరేగింపు



**శ్రీకాళహస్తి, జులై 22 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వ రాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్స వాల్లో భాగంగా ద్రౌపదీ సమేత అర్జునుడు వధూవరులుగా పట్టణంలో బుధవారం దర్శనమిచ్చారు. ఆలయం వద్ద కన్నుల పండువగా అర్జునుడు ద్రౌపదీ వివాహం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ఇఓ బికె వెంకటేశులు, డిప్యూటి ఇఓ ఎన్ఆర్ కృష్ణారెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యుడు వాకచర్ల గుర్రప్పశెట్టి, ఎంఎస్‌రెడ్డి, దేవస్థానం అధికారులు, ఉద్యోగస్తులు హాజరయ్యారు. బుధవారం ఉదయం స్వామి అమ్మవార్లు సప ్పర వాహనంలో దర్శనమిచ్చారు.
కళ్యాణ ముస్తాబుతోనే అర్జునసమేత ద్రౌపదీ అమ్మవారిని చక్కగా సప్పరంలో ప్రతిష్టించారు. ఆలయ సంప్రదాయంతో పూజారి పురుషోత్తంలు స్వామి అమ్మవార్లకు హారతులిచ్చి ఊరేగింపును ప్రారంభించారు.
మేళ తాళాలు పంబజోళ్ల మోతతో ఊరేగింపు జయరామారావువీధి, బజారువీధి, తేరువీధి, నెహ్రూవీధి, నగరి వీధుల మీదుగా సాగింది. మధ్యాహ్నం ఆలయంలో రాజసూయ యాగం ఘట్టాన్ని భారతంలో చదివి భక్తులకు వినిపించారు. రాత్రి రాజసూయ యాగాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం రాత్రి వర్షం కురుస్తున్నా స్వామి అమ్మవార్ల గ్రామోత్స వంను కన్నుల పండువగా నిర్వహించారు.

# పిల్లలే మన సంపద

- వారి చదువులే మనకు తరగని ఆస్తి
- విద్యా శాఖ మంత్రి నారా లోకేష్



**విజయవాడ, జులై 22 ప్రభాతవార్త ప్రతినిధి:** పిల్లలే మన సంపద. వారి చదువులే మనకు తరగని ఆస్తి అని ఎపి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారు. 'తల్లికి వందనం' కార్యక్రమంలో లబ్దిదారులకు నిధులు జమ బుధవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ 'ఎక్స్'లో తల్లివందనం లబ్దిదారులను అభినందిస్తూ పోస్టు చేసారు. "విద్యే మన రాష్ట్ర వెలకట్టలేని పెట్టుబడి. ఏ ఒక్క చిన్నారి విద్యకు దూరం కాకూడదనేది మా కూటమి ప్రభుత్వం లక్ష్యం. అందుకే ఒక ఇంట్లో ఎంతమంది పిల్లలు చదివితే అంతమందికి ఎటువంటి ఆంక్షలు లేకుండా ఇచ్చే పథకం తల్లికి వందనం రూపొందించారు. వరుసగా రెండో ఏడాది తల్లికి వందనం నిధులు విద్యా సంవత్స రం ఆరంభంలోనే విడుదల చేసాం. తల్లికి వందనం ద్వారా ఈ ఏడాది 67.47 లక్షల మంది విద్యార్థుల తల్లులు 42.70 లక్షల మంది బ్యాంకు ఖాతాల్లో రూ.10,120.78 కోట్లు జమ చేస్తున్నాం. ఈ ప్రక్రియ 24 వరకు కొనసాగుతుంది. పిల్లలను చదివించే ప్రతి తల్లికీ నా వందనమ్ణ అని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

# తిరుమల సమాచారం



## శ్రీవారి సేవలో వ్యాసాశ్రమం పరిపూర్ణానందస్వామి

**తిరుమల, జులై 22 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆషాడమాసం సందర్భంగా తిరుపతి జిల్లా ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందగిరి స్వామి శిష్యులతో కలసి బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం ఆలయం వద్దకు విచ్చేసిన స్వామివారికి టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ ఆలయ సాంప్రదాయంగా స్వాగతం పలికారు. ఆలయంలోపల తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. ఆనందనిలయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీవారి ఆశీస్సు లతో మంచి వర్షాలు కురవాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నారు.

## గోవిందరాజస్వామి ఆలయంలో 26న తులసి మహాత్యం ఉత్సవం



**తిరుమల, జులై 22 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో ఈనెల 26న పవిత్రమైన తులసి మహాత్యం ఉత్స వం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున 4.30 గంటల నుండి 6.30 గంటల వరకు గోవిందరాజస్వామి గరుడవాహనాన్ని అధిరోహించి ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దివ్య దర్శనభాగ్యం కల్పించనున్నారు. అనంతరం ఉదయం 6.30 గంటల నుండి 7.30 గంటల వరకు స్వామివారి ఆస్థానం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అర్చకులు తులసి మహాత్యం గురించి పురాణ పఠనం చేసి తులసీదేవి వైభవాన్ని భక్తులకు వివరిస్తారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేస్తారు. ఈ దివ్య ఉత్స వంలో పాల్గొని గోవిందరాజ స్వామి అనుగ్రహం పొందాలని టిటిడి భక్తులను ఆహ్వానిస్తోంది.

## మేఘావృతంతో ఆలయ ప్రాంగణం కనువిందు

**తిరుమల, జులై 22 ప్రభాతవార్త ప్రతినిధి:** మారిన వాతావరణంతో శేషాచలంలోని తిరుమల ఆలయం పరిసరాలు ఆహ్లాదకరంగా మారాయి. బుధవారం ఉదయం శ్రీవారి ఆలయం ముందు పావురాలు సందడి చేస్తూ భక్తులను ఆకట్టుకున్నాయి. గుంపుగా వచ్చిన పావురాలు ఆలయం ముందు విహరించడం ఆధ్యాత్మిక వాతావరణానికి మరింత అందాన్ని తీసుకువచ్చింది. భక్తులు తమ సెల్‌ఫోన్‌లలో ఈ అనుభూతిని చిత్రీకరించారు.



# తిరుమల ఘాట్‌లో ఆంజనేయస్వామి విగ్రహం చోరీ


- రాతి విగ్రహం మాయంపై దిగ్భ్రాంతి



**తిరుమల, జులై 22 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల నుండి తిరుపతికి వెళ్ళే మొదటిఘాట్‌లోని 7వ మైలువద్ద ఉన్న ప్రసన్నాంజనేయస్వామి విగ్రహం క్రింది భాగంలోని ఒక అడుగు రాతివిగ్రహం చోరీ జరిగింది. అర్ధరాత్రి దాటిన తరువాత జరిగిన ఈ చోరీ సంఘటన అటు భక్తుల్లో ఇటు టిటిడిలో పెద్ద దుమారం రేపుతోంది. దేవుని విగ్రహాన్ని చోరీ చేసుకెళ్ళడం వెనుక ఉన్న పెద్ద తతంగం ఏమిటనేది ఇప్పుడు హిందూ వర్గాల్లో కలకలంగా మారింది. బుధవారం వేకువజామున 2గంటల ప్రాంతంలో 7వ మైలువద్ద ఒక అడుగు ఆంజనేయస్వామి రాతివిగ్రహం ఎలా చోరీ జరిగిందనేది ఇప్పుడు భక్తులను తీవ్రంగా కలచివేస్తోంది. ఆ సమయంలో భద్రత సిబ్బంది కూడా కునుకుతీస్తుంటారు. అలాంటిది మొదటి ఘాట్ రోడ్‌లో 7వమైలు వద్ద ఉన్న క్రింద అమర్చిన ఆంజనేయస్వామి రాతి విగ్రహాన్ని ఓ వ్యక్తి టవల్‌లో దాచి ఎత్తుకెళ్ళాడు. ఈ చోరీలో ఇద్దరు ముగ్గురు పాల్గొని ఉంటారనేది అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పాతికేళ్ళుగా కొలువై ఉన్న స్వామివారి రాతి విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోవడం తిరుమల చరిత్రలోనే ఒక పవిత్రతకు కళంకంగా భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
అర్ధరాత్రి యాత్రికుల కదలికలుగానీ, భద్రత సిబ్బంది గానీ ఎవరూ లేని సమయాన్ని ఆసరాగా చేసుకుని విగ్రహాన్ని ఎత్తుకెళ్ళినట్లు ప్రాథమిక సమాచారం బట్టి తెలుస్తోంది. ఉదయం 5గంటల ప్రాంతంలో పూజలు చేసేందుకు వచ్చిన భక్తులు, ఆలయ సిబ్బంది విగ్రహం ఉండాల్సిన స్థానంలో లేకపోవడాన్ని గమనించి తిరుమల తిరుపతి దేవస్థానం విజిలెన్స్ విభాగానికి, తిరుమల 2టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, టిటిడి సెక్యూరిటీ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. తిరుమల పోలీసు యంత్రాంగం క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించి క్షేత్రస్థాయి ఆధారాలను సేకరించారు.
ఘాట్ రోడ్లలోని చెక్‌పోస్టులు, ఏడో మైలు పరిసర ప్రాంతాల్లో ఉన్న సిసి కెమెరాల పుటేజీలను అధికారులు పరిశీలిస్తున్నారు. ఓ వ్యక్తి ఆలయంలోకి వెళ్లి విగ్రహంతో పరుగులు పెడుతున్న దృశ్యాలు వీడియోల్లో రికార్డు అయ్యాయి. అర్ధరాత్రి సమయంలో ఆ మార్గంలో వెళ్లిన వాహనాల వివరాలను, అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించారు. పోలీసులు 10 బృందాలతో దర్యాప్తు వేగవంతం చేశారు. నిందితులను త్వరలోనే అదుపులోకి తీసుకుని, ఆంజనేయస్వామి విగ్రహాన్ని యథాస్థానంలో పునఃప్రతిష్ఠిస్తామని టిటిడి అధికారులు తేల్చారు. భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్న ఈ అంశంపై పూర్తి స్థాయి నిజాలను వెలికితీస్తామని, ఇందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తిరుమల పోలీసులు తెలిపారు.

# నడకదారిలో భద్రతా లోపం


- 'పెద్ది' పోస్టర్‌తో తిరుమలకు అభిమాని



**తిరుమల, జులై 22 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలకు వచ్చే అలిపిరి నడకమార్గంలో భద్రతా వైఫల్యం మరోసారి ప్రస్ఫుటమైంది. నడక మార్గాల్లో క్షుణ్ణంగా తనిఖీ చేసే భద్రత సిబ్బంది కొన్ని సమయాల్లో భక్తుల వద్ద ఉంటున్న నిషేధిత పదార్థాలు, వస్తువులను గుర్తించడంలో విఫలమవుతున్నారు. తాజాగా బుధవారం ఏకంగా అలిపిరి నడక మార్గంలో మోకాళ్ళపర్వతం వద్ద 'పెద్ది' చిత్రం పోస్టర్‌ను ఓ మహిళ భక్తురాలు ప్రదర్శించడం దుమారం రేపింది.
కడప జిల్లాకు చెందిన యువతిగా టిటిడి విజిలెన్స్ సిబ్బంది గుర్తించారు. ఏకంగా యువతి పెద్ది పోస్టర్‌తో తిరుమలకు రావడం, మోకాళ్ళ పర్వతం వద్ద మెట్లపై ప్రదర్శించడం విమర్శలకు తావిచ్చింది.
కడప జిల్లాకు చెందిన సితార 'పెద్ది' చిత్రం విజయవంతం కావడంతో శ్రీవారికి మొక్కుతీర్చుకునేందుకు కాలినడకన బుధవారం మధ్యాహ్నం తిరుమలకు వస్తుంది. ఆమె కాలిబాట మార్గంలో 'పెద్ది' చిత్రం పోస్టర్‌ను పట్టుకుని రావడంతో కలకలం రేపింది. ఎంతో పవిత్రమైన పుణ్యక్షేత్రంలో ఆలయానికి సినిమా పోస్టర్ తేవడంపై భక్తులు అసహనం వ్యక్తం చేశారు. టిటిడి భద్రత సిబ్బంది దీనిపై చర్యలు తీసుకోనున్నారు.

# నడకమార్గాల్లో 'కంచె' అసంభవమేనా!?

- హైకోర్టు ఆదేశించినా నిపుణుల కమిటీ విముఖత



**తిరుమల, జులై 22 ప్రభాతవార్త ప్రతినిధి:** 'గోవిందా... గోవింద' నామస్మరణతో దేశం నలుమూలల నుండి ఎంతో భక్తిభావంతో తిరుమలకు అలిపిరి, శ్రీవారిమెట్టు కాలినడక మార్గాల్లో నడచివచ్చే భక్తుల భద్రతకు టిటిడి చర్యలు తీసుకుంటున్నా వన్యప్రాణుల కట్టడి చేయలేక పోతుండటం చర్చనీయాంశంగా మారింది. నాలుగేళ్ళ క్రిందట అలిపిరి కాలినడక మార్గంలో చిరుతపులి ఓ బాలుడ్ని ఎత్తుకెళ్ళి తీవ్రంగా గాయపరచగా మరో బాలికపై దాడిచేసి చంపితిన్న విషాద ఘటన తెలిసిందే. ఇంకా పలు సందర్భాల్లో చిరుతపులులు ఘాట్‌రోడ్లలో వాహనదారులపై దాడిచేసిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఈ నేపథ్యంలో కాలినడక మార్గంలో మెట్లకు ఇరువైపులా ఇనుపకంచె ఏర్పాటు చేస్తే భక్తులకు భద్రత కల్పించవచ్చనే సూచనలు అప్పట్లో వెల్లువెత్తాయి. ఆ దిశగా కొందరు హైకోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం ధర్మాసనం కూడా కంచె ఏర్పాటు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఆదేశించింది. తిరుపతి అలిపిరి నుండి తిరుమలకు కాలినడక మార్గం సుమారు 10కిలోమీటర్లు దూరం అటవీ ప్రాంతంలోనే ఉంది. 3,550 మెట్లు మార్గంలో భక్తులు ప్రయాణానికి ఐదుగంటల సమయం పడుతుంది. ఈ మధ్యదూరం పూర్తిగా అటవీ ప్రాంతానికి ఆనుకునే ఉంది. అడపాదడపా చిరుత పులులు, ఎలుగుబంట్లు, ఏనుగులు ఆహారం కోసం, వన్యప్రాణి సంతతి ఉత్పత్తి కోసం అడవిని వదలి దారితప్పి ఇలా నడకమార్గాల్లోకి. ఘాట్‌రోడ్లపైకి వచ్చేస్తున్నాయి. ఎక్కడైనా ఒంటరిగా కనిపిస్తే దాడి చేస్తుండటంతో భక్తులు భయాందోళనకు గురవుతున్నారు. అలిపిరి నడక మార్గంలో వన్యప్రాణుల నుంచి రక్షణ కోసం ఇనుప కంచె (ఫెన్సి ంగ్) ఏర్పాటుపై 2022లోనే ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. నడక మార్గంలో వన్యప్రాణుల దాడులను అరికట్టడానికి అలిపిరి నుండి తిరుమల వరకు దారికి ఇరువైపులా ఇనుప కంచె ఏర్పాటు చేయాలని హైకోర్టు ఆదేశించింది.

**అత్యాధునిక సాంకేతికతతో గుర్తింపు:** కాలినడక మార్గాల్లో భక్తుల రక్షణ చర్యలపై టిటిడి, అటవీశాఖ ప్రత్యేక దృష్టి సారించాయి. క్రూరమృగాల బారినుండి కాపాడటానికి అడవిలో అధునాతన ట్రాప్ కెమెరాలు ఏర్పాటుచేసి వాటి కదలికలను గమనిస్తున్నారు. ఈ ఘటనల నేపథ్యంలో తిరుమలకు వచ్చే కాలినడక భక్తుల రక్షణకు టిటిడి అధికారులు మరింతగా ఫోకస్ చేస్తున్నారు. నడకదారి భక్తులకు రక్షణ కల్పించేందుకు మెట్లమార్గాల్లో ఇరువైపులా ఇనుపకంచె ఏర్పాటు ప్రతిపాదనలు టిటిడి తయారుచేసి కేంద్రానికి, రాష్ట్రానికి పంపారు. క్రూరమృగాల కదలికలు నియంత్రించడానికి, మెట్లమార్గాల్లో రాకుండా చూసేందుకు కంచే ఏర్పాటు శరణ్యమని భావించారు. అయితే నడక మార్గంలో కంచె వేయటం మరింత ప్రమాదకరమనే సూచనలను కమిటీ సూచించింది. చిరుతలు చెట్టుపైకి ఎక్కి కొమ్మలపై చిరుత హాయిగా నిద్రపోతుందని, అలాంటిది ఐదు, పది అడుగుల ఎత్తైన కంచెలు చిరుతలను ఏ మాత్రం ఆపలేవనే వాదన వినిపించారు. మెట్లకు ఇరువైపులా కంచె వేసినా చిరుతలు దూకి కంచె లోపలకి పొరపాటున వస్తే, అప్పుడు ఇంకా పెద్ద ప్రమాదమే జరిగే అవకాశం ఉంటుందనేది కూడా కమిటీ తేల్చింది. ప్రాణభయంతో జనాల మధ్య తొక్కిసలాట, అదే ప్రాణభయంతో చిరుతలు కూడా మనుషులపై దాడిచేస్తే పరిస్థితి ఏంటనేది ఆందోళనకరమని స్పష్టం చేసింది. కంచే ప్రమాదకరమని కూడా తేల్చింది. దీనికంటే భక్తులకు చేతికర్రలు ఇచ్చి పంపడం వల్ల భద్రతకు ఢోకా ఉండదని 2023లో టిటిడి ధర్మకర్తల మండలి చేతికి కర్రలు ఇచ్చి పంపింది. ఆ తరువాత చిరుతల సంచారం తగ్గడంతో చేతికర్రలకు స్వస్తిచెప్పారు. అలిపిరి, శ్రీవారిమెట్టు నడకమార్గాల్లో అత్యవసర సమయాల్లో క్షణాల్లో స్పందించేందుకు శాశ్వత ప్రాతిపదికన ప్రత్యేక రక్షణ బృందాలను ఏర్పాటు చేస్తున్నారు. భక్తుల భద్రత కోసం నడక మార్గంలో రాత్రి 9.30గంటల వరకే సమయం కేటాయించారు. గుంపులుగుంపులుగా భక్తులను 50మంది నుండి వందమంది వరకు అనుమతినిస్తున్నారు. ఒక్కరే కాకుండా గుంపులుగా వెళ్లటం వలన క్రూరమృగాలు దగ్గరికి రావని టిటిడి అధికారులకు అటవీశాఖ సూచనలు చేసింది. అటవీమార్గంలో వన్యప్రాణుల సంచారాన్ని నిరంతరం పర్యవేక్షించేందుకు టిటిడి అటవీ శాఖ, విజిలెన్స్, ఇంజినీరింగ్, ఆరోగ్య శాఖలతో బాటు సంబంధిత అన్ని విభాగాల మధ్య సమన్వయాన్ని మరింత మెరుగుపరచుకుని, సమర్థవంతమైన పర్యవేక్షణతో సమాచార మార్పిడి, అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన స్పందనకు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. నడకమార్గంలో లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద ప్రత్యేక అత్యవసర ప్రతిస్పందన బృందాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ బృందానికి అవసరమైన సిబ్బంది, ఆధునిక పరికరాలు, వాహనాలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులో ఉంచి, వన్యప్రాణుల ఘటనలు చోటుచేసుకున్న వెంటనే తక్షణమే స్పందించేలా శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు.

# ఆర్థరైటిస్‌తో ఉపశమనమిలా ..



మహిళలకు వేధించే సమస్యల్లో ఆర్థరైటిస్ ఒకటి. ఆటో ఇమ్యూన్ కండిషన్ కారణంగా ఏర్పడే ఈ వ్యాధి వల్ల జాయింట్లు, ఎముకల్లో వాపులు సహా పలు సమస్యలు తలెత్తుతాయి. వాతావరణ మార్పు కారణంగా ముఖ్యంగా చల్లగా ఉన్నప్పుడు ఆ సమస్య మరింత తీవ్రమవు తుంది. అలాంటప్పుడు ఎలాంటి జీవనశైలి అనుసరించాలో నిపుణులు ఇచ్చే సలహాలివే.

**ఆహారంతో...** బ్రొకలీ, క్యాబేజీ, క్యాలీఫ్లవర్ లెట్యూస్, పాలకూర, క్యారెట్, గుమ్మడికాయ వంటి రంగురంగుల కూరగాయల్ని ఆహారంలో భాగం చేసుకోవాలి. చెర్రీ, బెర్రీ, ఆరెంజ్ ద్రాక్ష, దానిమ్మ లాంటి పళ్లు తినాలి. వీటిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఒత్తిడిని తగ్గించి శరీరంలోని పిహెచ్ స్థాయుల్ని సమతుల్యం చేస్తాయి. దాంతోపాటు అవిసెగింజలు, చేపలు..వంటివాటిని ఆహారంలో భాగం చేసుకుంటే వాటిల్లోని ఫ్యాటీ ఆమ్లాలు శరీరంలోని ఇన్‌ఫ్లమేషన్‌నీ, నొప్పినీ తగ్గిస్తాయి.

**.. రాగి చెంబుతో....** రాత్రంతా ఈ చెంబులో ఉంచిన నీటిని రోజుకొక గ్లాసు తగాలి. దాన్లోని కాపర్ ఎముకలని దృఢపరుస్తుంది. దాంతోపాటు పాదాలను ఎప్సమ్ స్టాల్ వేసిన నీళ్లలో కాసేపు ఉంచండి. అదేవిధంగా ఈ సాల్ట్‌ను నీళ్లలో వేసుకుని స్నానం చేయండి. దానిలోని మెగ్నీషియంను చర్మం పీల్చుకోవడంతో నొప్పులు తగ్గుతాయి. దానివల్ల నరాల పనితీరూ మెరుగుపడుతుంది.

మంచినిద్రతో.. సరైన నిద్ర ఎంతో అవసరం. నిద్రపోయే సమయంలో శరీరం పునరుత్తేజితం అవుతుంది. బరువూ తగ్గుతాం. మన గాఢ నిద్రలో ఉన్నప్పుడు శరీరం కణాల ఉత్పత్తికి సంబంధించిన హార్మోన్లను విడుదల చేస్తుంది. అవి దెబ్బతిన్న కణజాలాన్ని బాగుచేసి, ఇన్‌ఫ్లమేషన్‌నూ తగ్గిస్తాయి. దాంతోపాటు శరీరానికి కదలికా అవసరం. చిన్న చిన్న వ్యాయామాలు, స్ట్రెచెస్ వల్ల జాయింట్ల చుట్టూ ఉండే కండరాలు గట్టిపడతాయి. అలానే, గోరువెచ్చని నువ్వుల నూనెలను రాత్రి నిద్రపోయే ముందు నొప్పి ఉన్న భాగాల్లో మరద్న చేయండి. దానివల్ల రక్తప్రసరణ మెరుగుపడి, బిగుసుకున్న కండరాలు వదులువతాయి. వీటన్నింటితోపాటు వాపు, నొప్పులను కలిగించే ఆహారాన్నీ, ఆయా పనుల్నీ గమనించుకుని వాటికి దూరంగా ఉంటే ఈ రోగాల నుంచి ఉపశమన పొందొచ్చు.

**చిట్కా**

: ...అరటిపండును మెత్తగాచేసి కాలిన ప్రాంతము లో లేదా గాయమైన ప్రాంతంలో అద్దుటవలన బాధ త్వరగా తగ్గుతుంది.

## పుస్తకాలకు అట్టలేస్తున్నారా ?





పిల్లలకు స్కూళ్లు ప్రారంభమవుతాయి. అన్నీ సమ కూర్చడం మొదలుపెట్టాలి కదా ! వాటిల్లో పుస్తకాలు జాగ్రత్తగా ఉండటానికి వేసే అట్టలొకటి. చిన్నగానే కనిపిస్తుంది కానీ.. పూర్తయ్యేసరికి వెన్నునొప్పి ఖాయం. దాన్నీ సులువు చేస్తూ కొన్ని అమరికలొచ్చాయి. పుస్తకానికి సరిపోయేంత కవర్ తీసుకోవడం, మలవడానికి అనువుగా కత్తిరించుకోవడం, పిన్నులు కొట్టడం అబ్బబ్బా ఎంత పనో. ఇదంతా లేకుండా కేవలం ముడిచేస్తే సరిపోయేలా ఉంటే బాగుండు అనిపిస్తోందా? అయితే, రెడీ టూ యూజ్ బుక్ కవర్స్ తెచ్చుకోండి. పుస్తకాన్ని పెట్టి, మడిచి, పిన్నులు కొట్టుకుంటే చాలు. కొన్నింటికి ఆ శ్రమ కూడా లేకుండా అతికించుకునే వీలూ ఉంది.

## 'పుష్పయాగం'

భగవంతుడికి వివిధ రకాల పూలతో పూజ చేయడం జరుగుతూ ఉంటుంది. తాజా పూలతో .. సువాసన వెదజల్లే పూలతో భగవంతుడిని పూజించడం వలన ఆయన ప్రీతి చెందుతాడు. తెలుపు .. పసుపు రంగు పూలు శ్రేష్ఠమైనవనేది మహర్షుల మాట. ఆయా క్షేత్రాల్లో భగవంతుడికి 'పుష్పయాగం' చేస్తుంటారు. వివిధ రకాల పూలు ఈ పుష్ప యాగంలో ఉపయోగిస్తుంటారు. జాజులు .. మెట్ట తామరలు .. ఎర్ర కలువలు .. తెల్ల కలువలు .. సంపెంగలు .. పుష్పాలు మొదలైనవి పుష్ప యాగంలో ఉపయోగిస్తుం టారు. పుష్ప యాగం చేయడం వలన 'అశ్వమేథ యాగం' చేసిన ఫలితం దక్కుతుందని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి. ఏ ప్రాంతంలో అయితే పుష్పయాగం జరుగుతుందో, ఆ ప్రాంతంలో కరువు కాటకాలు ఉండనే వుండవు. సిరి సంపదలతో అక్కడి ప్రజలు తులతూగు తారు .. అనారోగ్యాలు దరిచేరవు. పుష్పయాగాన్ని దర్శించడం వలన సమస్త పాపాలు నశిస్తాయి .. సకల శుభాలు చేకూరతాయి. ముందు తరాల వారు ... వెనుక తరాల వారు సైతం తరిస్తారు.

## తమలపాకు పండింది..





అమ్మాయి అరచేయి.. ఎర్రగాపండి కనిపిస్తోంటే ఎంత అందమో కదా! వేడుకలప్పుడు చేతిపై ఆ అందం లేకపోతే బోసిపోయినట్లే అనిపిస్తుంది. కానీ అస్తమానం గోరింటాకే కావాలంటే చాలామందికి కష్టమే. అయితే తమలపాకు తెచ్చేసుకోండి. దానితోనూ అరచేత ఎర్రదనం పండించుకోవచ్చు. ఎలాగంటే తాజా తమలపాకులు ఓ పది తీసుకుని, కాడలు తీసేయండి. వాటికి అరస్పూను చొప్పున పసుపు, సున్నం కలిపి, మెత్తగా మిక్సీ పట్టండి. నీళ్ల కలపొద్దు, నిల్వ ఉన్న ఆకుల్నీ వాడొద్దు. తరవాత రసాన్ని వడకట్టి, బాగా ఎర్రగా ఉన్న కుంకుమ కలుపుకోవాలి. ఆ మిశ్రమంతో చేతిపై నచ్చిన డిజైను వేసుకోండి. ఆరిన తరువాత కడిగేసి చూసుకోండి. అచ్చమైన గోరింటాకు లాగే పండు తుంది. మొత్తం ప్రక్రియకు ఎక్కువ సమయం కూడా పట్టదు. కావాలంటే ప్రయత్నించి చూడండి.

**చెలి** మహిళ సంబంధిత అంశాలపై వ్యాసాలు ఆహ్వానిస్తున్నాం.. ఈ మెయిల్: Cheli@vaartha.com

**ప్రశ్న:** మా అమ్మాయి విచిత్రంగా ప్రవర్తిస్తోంది. బి.టెక్ చదివినా ఉద్యోగ ప్రయత్నం చేయడం లేదు. 27 ఏళ్లు వచ్చినా పెళ్లి వద్దంటోంది. ఎక్కువగా గుడులు, దేవుని దర్శనాలంటూ తిరుగుతోంది. ఇంటిలో ఎవరినీ పట్టించుకోదు. ఎప్పుడూ తన గదిలోనే ఉంటుంది. మేము మంచి మాట చెప్పినా వినదు. గట్టిగా చెప్పితే మాపై తిరుగుబాటు చేసేలా వాదిస్తుంది. 2020లో సైకియాట్రిస్ట్‌ను సంప్రదించాం. ఆయన ఇచ్చిన మందులు నాలుగు రోజులు మాత్రమే వాడి మానేసింది. మందులు వాడమంటే 'నాకేమీ పిచ్చి లేదు' అంటోంది. తరువాత జ్యోతిష్యుని వద్దకు తీసుకెళ్లగా గ్రహదోషాలు ఉన్నాయని, ఆరు నెలల్లో సర్దుకుంటుందని చెప్పారు. అప్పటి నుంచి గుడులు తిరగడం ఎక్కువైంది. ఆమె ఏదైనా మానసిక సమస్యతో బాధపడుతుందా? ఆమెను మార్చడానికి మార్గం ఉందా?- ఒక సోదరి, గూడూరు



ఎన్.బి.సుధాకర్‌రెడ్డి
సైకాలజిస్టు

**సమాధానం:** అమ్మా, ఉద్యోగం చేయకపోవడం, పెళ్లి వద్దనుకోవడం, గుడులకు వెళ్లడం మాత్రమే మానసిక సమస్యకు నిదర్శనాలు కావు. ప్రతి వ్యక్తికీ తన జీవితంపై తనదైన అభిప్రాయం, ఆధ్యాత్మిక విశ్వాసాలు, వివాహంపై వ్యక్తిగత నిర్ణయం ఉండవచ్చు.అయితే,

## వ్యథ అమ్మాయిని అర్థం చేసుకోండి !



ఒక వ్యక్తి ప్రవర్తనలో దీర్ఘకాలంగా వచ్చిన మార్పులు ఎప్పుడూ ఒంటరిగా ఉండటం, కుటుంబ సభ్యులతో సంబంధాలు తగ్గించుకోవడం, సాధారణ బాధ్యతలపై ఆసక్తి లేకపోవడం, సలహాలను తీవ్రంగా తిరస్కరించడం, అసాధారణమైన అనుమానాలు లేదా భయాలు, నిద్రలో తీవ్రమైన మార్పులు, ఆలోచనల్లో గందరగోళం వంటివి ఉంటే వాటిని నిర్లక్ష్యం చేయకూడదు. 2020లో ఒకసారి సైకియాట్రిస్ట్‌ను కలిసినంత మాత్రాన ప్రస్తుత సమస్య ఏమిటో స్పష్టంగా చెప్పలేం. నాలుగు రోజులు మందులు వాడి ఆపివేయడం వల్ల చికిత్స పనిచేయలేదని కూడా నిర్ణయించలేం. మందులు అవసరమా? అవసరమైతే ఏ మందులు, ఎంతకాలం? లేక కౌన్సెలింగ్ సరిపోతుందా? ఇవన్నీ ప్రస్తుత పరిస్థితిని బట్టి నిపుణుడే నిర్ణయించాలి. ముందుగా ఆమె మనసు మార్చడం కాదు, ఆమెను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి. ఉద్యోగం, పెళ్లి విషయాల్లో ఒత్తిడి చేయకండి. 'పిచ్చిది' వంటి విమర్శలు చేయడం, అనవసరంగా వాదనలకు దిగడం మంచిది కాదు. జ్యోతిష్యం వైద్య చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు.ఆమెతో సున్నితంగా మాట్లాడి, ఒప్పించి సైకాలజిస్టు వద్దకు తీసుకెళ్లండి. ఆమెను పరిశీలించిన తరువాత సైకాలజిస్టు మానసిక స్థితిని అర్థం చేసుకుని కౌన్సెలింగ్ ద్వారా ఆలోచనా విధానంలో మార్పు తీసుకురావడానికి ప్రయత్నిస్తారు. ఏదైనా మానసిక రుగ్మత ఉన్నట్లు భావిస్తే, ఆయన సలహా మేరకు సైకియాట్రిస్ట్ వద్ద చికిత్స చేయించాలి.ఎలాగైనా ఆమెను మార్చాలనుకోకుండా, ముందుగా ఆమె దృక్పథాన్ని, భావాలను అర్థం చేసుకోండి. మన మాట వినకపోవడం మాత్రమే మానసిక రుగ్మత కాదు. అయితే అసహజమైన ధోరణులు, రోజువారీ జీవితంపై తీవ్ర ప్రభావం చూపే ప్రవర్తనా మార్పులు కనిపిస్తే మాత్రం మానసిక నిపుణుల సలహా తీసుకోవడం మంచిది.

## అన్నం పునుగులు



కావలసినవి : అన్నం: కప్పుబియ్యప్పిండి: పావు కప్పుకొత్తిమీర: గుప్పెడుఅల్లం: చిన్న ముక్క పచ్చిమిరపకాయలు: మూడుకరివేపాకు: నాలుగు రెబ్బలుబేకింగ్ సోడా: చిటికెడుఉప్పు: తగినంత నూనె: వేయించడానికి సరిపడా

**తయారీ:** ముందుగా అన్నాన్ని మిక్సీలో వేసుకొని మెత్తగా మాష్ చేసుకోవాలి. బియ్యప్పిండిని ఇందులో కలుపుకోవాలి. కొత్తిమీర కరివేపాకులను సన్నగా తరుక్కోవాలి. అల్లం పచ్చిమిర్చిలను మిక్సీలో వేసి ముద్దగా చేసి పెట్టుకోవాలి. ఇప్పుడు వీటన్నింటితో పాటు తగినంత ఉప్పు కొద్దిగా బేకింగ్ సోడాలని మాష్ చేసిన అన్నం మిశ్రమానికి కలుపుకోవాలి. బేకింగ్ సోడా వేశాక ఆ పిండిని చేత్తో బాగా కలియబెట్టాలి. దీనివల్ల పునుగులు బోలుగా వస్తాయి. కలపడం పూర్తయ్యాక పొయ్యి మీద నూనె పెట్టి గుండ్రటి బంతుల్లా వచ్చేలా కడాయిలో పునుగులు వేసుకుంటేఎంతో రుచికరమైన అల్పాహారం సిద్ధమైపోతుంది.

# తెర

## ఈ 'బుట్టబొమ్మ' ఎవరో !



దక్షిణాది సినీ వినీలాకాశంలో మరో చైల్డ్ ఆర్టిస్ట్ యువ హీరోయిన్‌లా వెలుగొందబోతోంది. 'విశ్వాసం' తమిళ చిత్రంలో మలయాళీ ముద్దుగుమ్మ సురేంద్రన్ తన నటనతో ప్రశంసలందుకుని తెలుగు చిత్రసీమలో 'బుట్టబొమ్మ'గా పరిచయమైంది. ఆమె ఇన్ స్టాగ్రామ్‌కు ఫాలోయర్ ఎంత మందో తెలుసా. 2.6 మిలియన్‌ల ఫాలోమర్‌లున్నారంటే అతీతం కాదేమో! ఆమె ఉన్న క్రేజు అంతమరి.

## 'ఇరుముడి' డబ్బింగ్ ప్రారంభించిన రవితేజ



మాస్ మహారాజా రవితేజ హీరోగా, శివ నిర్వాణ దర్శకత్వంలో, మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామా ఇరుముడి పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఫస్ట్ గ్లింప్స్‌తో సినిమాపై ఆసక్తిని పెంచిన మేకర్స్, ఆ తర్వాత విడుదల చేసిన తొలి పాట ఖిఇరుముడి కట్టుఖితో ఆకట్టుకున్నారు. అయ్యప్ప స్వామిపై భక్తి భావాన్ని ఆవిష్కరించిన ఆ పాట చార్ట్‌బస్టర్‌గా నిలిచింది.తన షూటింగ్ పార్ట్‌ను పూర్తి చేసిన రవితేజ ఇప్పుడు ఈ సినిమా డబ్బింగ్ పనులు కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా మేకర్స్ విడుదల చేసిన డబ్బింగ్ స్టూడియో వీడియో సోషల్ మీడియాలో ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం సినిమా షూటింగ్ చివరి దశలో ఉండగా, కేవలం మూడు రోజుల చిత్రీకరణ మాత్రమే మిగిలి ఉంది. మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా సైమల్టేనియస్ గా జరుగుతున్నాయి. దీంతో సినిమా అనుకున్న షెడ్యూల్ ప్రకారమే ఆగస్టు 21న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.ఇప్పటికే తన మనసుని తాకే సంగీతంతో ఆకట్టుకున్న సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్ కుమార్ రీరికార్డింగ్ పనులు కూడా ప్రారంభించారు. ఈ చిత్రంలో రవితేజ తన కెరీర్‌లోనే అత్యంత ఎమోషనల్, ఇంటెన్సిటీ గల తండ్రి పాత్రలో కనిపించనున్నారు. ప్రియ భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, బేబీ నక్షత్ర వారి కుమార్తె పాత్రను పోషిస్తోంది. అలాగే సాయికుమార్, అజయ్ ఘోష్, రమేష్ ఇందిర, స్వాసిక కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

## విదేశీ వీధుల్లో మినీ ఫ్రాక్‌తో సందడి చేస్తున్న రీతూ వర్మ



తాజాగా మరో లేటెస్ట్ ఫోటోషూట్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. విదేశీ వీధుల్లో సందడి చేస్తూ షేర్ చేసిన ఈ ఫోటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. షార్ట్ ఫిలిమ్స్ ద్వారా తన కెరీర్ ను మొదలుపెట్టి, ఆ తర్వాత పెళ్లిచూపులు సినిమాతో హీరోయిన్గా వెండితెరకు పరిచయమైన రీతు వర్మ గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో అందరి దృష్టిని ఆకట్టుకునే ఈమె.. తన చిరునవ్వుతోనే అభిమానుల హృదయాలను దోచుకుంటుందనటంలో సందేహం లేదు. నిత్యం ప్రేక్షకులను అలరించే ఈమె.. తాజాగా మరో లేటెస్ట్ ఫోటోషూట్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. విదేశీ వీధుల్లో సందడి చేస్తూ షేర్ చేసిన ఈ ఫోటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. మిస్ సెల్ఫ్రిడ్జ్ మ్యాక్సీ డ్రెస్ ధరించిన ఈమె విదేశీ వీధుల్లో చక్కర్లు కొడుతూ అక్కడి విదేశీయులను ఆకర్షించే ప్రయత్నం చేసింది. ఇక మరికొన్ని ఫోటోలలో షార్ట్ ఫ్రాక్ ధరించి మంత్రముగ్ధుల్ని చేసింది. అంతేకాదు అక్కడి ప్రదేశాలను ఫోటోల రూపంలో అభిమానులతో పంచుకుంది. ఈ ఫోటోలకి క్యాప్షన్‌గా.. 'కొన్ని ప్రదేశాలను మనం విడిచి వెళ్లినప్పటికీ అవి ఇంకా మనతోనే ఉన్నాయి అనే భావన కలుగుతుంది' అంటూ చెప్పు కొచ్చింది. మొత్తానికి విదేశీ వీధిలో చక్కర్లు కొడుతున్న ఈమె.. తన చిట్టి పొట్టి బట్టలతో అక్కడివారిని ఆకట్టుకోవడమే కాకుండా ఆ ప్రాంతాలను ఫాలోవర్స్‌కి చూపిస్తూ మరింత వైరల్ అయింది.

## కార్తి 'సర్దార్ 2' సెప్టెంబర్ 10న రిలీజ్



హీరో కార్తి తమిళం, తెలుగు భాషల్లో బ్లాక్ బస్టర్ హిట్ అయిన 'సర్దార్'కి సీక్వెల్ 'సర్దార్ 2'తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ప్రీక్వెల్‌కి దర్శకత్వం వహించిన పిఎస్ మిత్రన్ సర్దార్2 కి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రిన్స్ పిక్చర్స్, ఐవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ గ్రాండ్ గా నిర్మిస్తోంది.ఈ చిత్రంలో ఎస్.జే. సూర్య కీలక పాత్రలో నటిస్తున్నారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. నీలం రంగు సూట్‌లో స్టైలిష్ లుక్‌తో మెట్లపై నిలబడి కనిపించిన ఎస్.జే. సూర్య పోస్టర్‌లో ఎంతో క్లాసీగా, మిస్టీరియస్‌గా కనిపిస్తున్నారు. బ్యాక్‌డ్రాప్‌లో ఉన్న భారీ డ్రాగన్ ఆర్ట్‌వర్క్, డార్క్ టోన్, షేడ్స్‌తో కూడిన ఆయన లుక్ పాత్రపై మరింత ఆసక్తిని పెంచుతోంది. ఈ పోస్టర్‌ను బట్టి 'సర్దార్ 2'లో ఎస్.జె. సూర్య పాత్ర కథలో అత్యంత కీలకంగా ఉండబోతుందని తెలుస్తోంది. ఈ చిత్రంలో మాళవిక మోహన్, ఆషికా రంగనాథ్, రజిషా విజయన్ ఫిమేల్ లీడ్స్‌గా నటిస్తుండగా ఎస్ జె సూర్య ఓ పవర్ ఫుల్ పాత్రలో కనిపిస్తున్నారు. ఈ చిత్రం సెప్టెంబర్ 10న గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది.

## 'శ్రీనివాస మంగాపురం' సాంగ్ 'రావే చెలియా' రిలీజ్



సూపర్ స్టార్ కృష్ణ మనవడు, మహేష్ బాబు అన్న కుమారుడు జై కృష్ణ ఘట్టమనేని అజయ్ భుపతి దర్శకత్వంలో 'శ్రీనివాస మంగాపురం' సినిమాతో హీరోగా పరిచయం అవుతున్నారు. బాలీవుడ్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడానిని కూడా ఈ చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో సీనియర్ నటుడు డాక్టర్ మోహన్ బాబు పవర్ ఫుల్ పాత్రను పోషిస్తున్నారు. నిర్మాత పి. కిరణ్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని అశ్విని దత్ సమర్పిస్తున్నారు. ఇప్పటివరకు విడుదలైన పాటలు, టీజర్లు, ట్రైలర్ కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వచ్చింది.తాజాగా మేకర్స్ ఈ చిత్రం నుంచి రావే చెలియా సాంగ్‌ని లాంచ్ చేశారు. జీవీ ప్రకాశ్ కుమార్ ఈ పాట ప్రేమ, భావోద్వేగాలతో హార్ట్ టచ్చింగ్ మెలోడీగా కంపోజ్ చేశారు.నాగ్ అర్జున్ రెడ్డి అందించిన మనసుని తాకే సాహిత్యానికి, కపిల్ కపిలన్ తన వోకల్స్ తో ప్రాణం పోశారు. ప్రేమ, ఎడబాటు, మనసులోని భావాలను ఈ పాట అద్భుతంగా పలికించిందిఈ చిత్రం జూలై 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

## 'ది ఇండియా స్టోరీ' కొత్త పోస్టర్ రిలీజ్



కాజల్ అగర్వాల్, శ్రేయాస్ తల్పాడే ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న 'ది ఇండియా స్టోరీ' నుంచి మేకర్స్ మరో పవర్‌ఫుల్ పోస్టర్‌ను విడుదల చేశారు. దేశంలో అత్యంత ఆందోళన కలిగిస్తున్న పెస్టిసైడ్ వ్యవసాయం అంశాన్ని ప్రధానంగా ప్రస్తావిస్తున్న ఈ పోస్టర్, సినిమా చెప్పబోయే బలమైన సందేశాన్ని మరోసారి హైలైట్ చేస్తోంది. కొత్తగా విడుదలైన పోస్టర్‌లో పెస్టిసైడ్స్ అధికంగా ఉపయోగించడం వల్ల ఆహార భద్రత, ప్రజారోగ్యంపై పడుతున్న ప్రభావాన్ని బలంగా చూపించారు. సినిమా గురించి కాజల్ అగర్వాల్ మాట్లాడుతూ.. 'ది ఇండియా స్టోరీ ప్రతి కుటుంబం చూడాల్సిన సినిమా. మన రోజువారీ జీవితాలను నేరుగా ప్రభావితం చేసే అంశాన్ని ఎంతో ధైర్యంగా ఈ సినిమా ప్రస్తావించింది. శ్రేయాస్ తల్పాడే మాట్లాడుతూ.. "ఇది కేవలం వ్యవసాయం గురించి చెప్పే కథ కాదు. రాబోయే తరాల ఆరోగ్యం, భవిష్యత్తు గురించి చెప్పే కథ. ఈ కొత్త పోస్టర్ సినిమాలో మేము చెప్పబోయే అత్యవసరమైన అంశాన్ని ప్రతిబింబిస్తుంది. జీ స్టూడియోస్, ఎంఐజీ ప్రొడక్షన్ స్టూడియోస్ సమర్పిస్తున్న ఈ చిత్రానికి చేతన్ డీకే దర్శకత్వం వహిస్తున్నారు. సాగర్ బి. షిండే కథ, నిర్మాణ బాధ్యతలు చేపట్టారు. ఈ చిత్రం 2026 జులై 24న ప్రపంచవ్యాప్తంగా హిందీ, తెలుగు, తమిళ భాషల్లో థియేటర్లలో విడుదల కానుంది.ఈ చిత్రానికి స్వాతి వినాయక్ సైందానే, అనితా జాధవ్, వినాయక్ సైందానే, కల్పేష్ షా, దేవయాని ఖోరాటే, ప్రేమ్ జోషి సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. నిశాంత్ భాగవత్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, మంగేష్ ధాక్డే సంగీతం సమకూరుస్తున్నారు.

## 'మెయిన్ వాపస్ ఆవుంగా'విజయోత్సవం



హిందీ చిత్రం 'మెయిన్ వాపస్ ఆవుంగా' దేశవ్యాప్తంగా ప్రేక్షకుల ఆదరణతో విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. విడుదలై ఆరు వారాలు పూర్తయినా ఈ సినిమా ఇంకా మంచి వసూళ్లతో దూసుకెళ్తోంది. ప్రస్తుతం భారతదేశంలో 450కు పైగా షోలతో పాటు విదేశాల్లోని 10 దేశాల్లో కూడా విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. బాలీవుడ్, హాలీవుడ్ చిత్రాల నుంచి గట్టి పోటీ ఉన్నప్పటికీ ఈ సినిమా తన ప్రస్థానాన్ని విజయవంతంగా కొనసాగిస్తోంది. ఈ ఏడాది హిందీ చిత్రాల్లో అత్యంత భారీ విదేశీ విడుదలల్లో ఒకటిగా నిలిచిన ఈ సినిమా, 59 దేశాల్లో 804 స్క్రీన్‌లపై విడుదలైంది. హిందీ రాష్ట్రాలతో పాటు హైదరాబాద్, బెంగళూరు, కోల్‌కతా వంటి నగరాల్లో కూడా ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభించడం విశేషం. సినిమాకు వస్తున్న అద్భుతమైన స్పందన నేపథ్యంలో దర్శకుడు ఇమ్తియాజ్ అలీ హైదరాబాద్‌కు వచ్చి ప్రేక్షకులను కలుసుకున్నారు. తమ సినిమాను ఇంతగా ఆదరించి విజయవంతం చేసినందుకు వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. తన భావోద్వేగ కథలతో ప్రేక్షకులను ఆకట్టుకునే ఇమ్తియాజ్ అలీ, 'మెయిన్ వాపస్ ఆవుంగా' లభిస్తున్న ప్రేమకు ఆనందం వ్యక్తం చేశారు. మొదట నెమ్మదిగా ప్రారంభమైన ఈ సినిమా, ప్రేక్షకుల నోటి మాట ప్రచారంతో ఇప్పుడు ఈ ఏడాది అత్యంత విజయవంతమైన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. ముఖ్యంగా యువతతో పాటు కుటుంబ ప్రేక్షకులను కూడా ఈ సినిమా భావోద్వేగ కథ, అద్భుత నటన, హృదయానికి హత్తుకునే సన్నివేశాలతో ఆకట్టుకుంది.



## చైనా ఓపెన్‌లో ఉన్నతి, శెట్టిలను
# ఓడించిన సింధు
### పురుషుల సింగిల్స్‌లో ఆయుష్ సంచలనం



**న్యూఢిల్లీ:** చైనా ఓపెన్-2026 టోర్నమెంట్‌లో, పీవీ సింధు తన స్వదేశీ క్రీడాకారిణి ఉన్నతి హూడాపై మూడు గేమ్‌ల విజయంతో తన ప్రయాణాన్ని ప్రారంభించింది. జపాన్ ఓపెన్‌లో విజయం సాధించి మంచి ఫామ్‌లో ఉన్న ప్రపంచ 15వ ర్యాంకర్ చాంగ్‌జౌలో బుధవారం జరిగిన చైనా ఓపెన్‌లో హూడాను 21-14, 9-21, 21-10 తేడాతో ఓడించింది. అలాగే పురుషుల సింగిల్స్‌లో, ఆయుష్ శెట్టి మొదటి రౌండ్‌లో ఇండోనేషియాకు చెందిన ప్రపంచ నంబర్ 11 అల్వి ఫర్హాన్‌ను మూడు గేమ్‌లలో ఓడించి సంచలనం సృష్టించాడు. యువ భారత షట్లర్ మాజీ జూనియర్ ఛాంపియన్‌ను 21-17, 5-21, 21-17 తేడాతో ఓడించి రౌండ్ ఆఫ్ 16లో తన స్థానాన్ని ఖాయం చేసుకున్నాడు. చైనా జట్టుతో జరిగిన పోరులో భారత డబుల్స్ జట్టుకు చాలా కష్టంగా గడిచింది. రోహన్ కపూర్-రుత్విక శివాని గద్దె, టాప్ సీడెడ్ జోడీ అయిన యాన్ జె ఫెంగ్-డాంగ్ పింగ్ హువాంగ్ చేతిలో 21-9, 21-16 తేడాతో ఓడిపోయారు. ఇక ధ్రువ్ కపిల-తనిషా క్రాస్టో కూడా జిన్ వా గువో-ఫాంగ్ హుయ్ చెన్‌ల చేతిలో వరుస గేమ్‌లలో 21-18, 21-18తో ఓడిపోయారు. పురుషుల డబుల్స్ జోడీ ఎంఆర్ అర్జున్-హరిహరన్ అమ్సకరుణన్ నాలుగో సీడ్ జోడీ వీ కెంగ్ లియాంగ్-చాంగ్ వాంగ్‌ల చేతిలో ఓటమి పాలయ్యారు.

## ఐసిసి వన్డే ర్యాంకింగ్ టాప్ 4లో
# గిల్, రోహిత్, కోహ్లీ



**న్యూఢిల్లీ:** ఇంగ్లండ్‌పై అద్భుత ప్రదర్శనతో శుభ్‌మన్ గిల్ ఐసీసీ పురుషుల వన్డే బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరువయ్యాడు. అదే సమయంలో, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ కూడా తాజా అప్‌డేట్‌లో అగ్రస్థానంలో భారత్ ఉనికిని మరింత బలోపేతం చేశారు. మిచెల్ 802 రేటింగ్ పాయింట్లతో నెం.1 స్థానంలో కొనసాగుతుండగా, ఇంగ్లండ్‌తో జరిగిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో 188 పరుగులు సాధించిన గిల్ ఇప్పుడు కేవలం ఒక పాయింట్ వెనుకబడ్డాడు. కోహ్లీ 767 రేటింగ్ పాయింట్లతో మూడో స్థానంలో కొనసాగుతుండగా, రోహిత్ 758 పాయింట్లతో నాలుగో స్థానంలో ఉన్నాడు. భారత్‌తో జరిగిన సిరీస్‌ను ఇంగ్లండ్ కైవసం చేసుకుంది. సిరీస్ అంతటా నాటౌట్‌గా నిలిచి 249 పరుగులు చేసిన కుడిచేతి వాటం బ్యాట్స్‌మెన్ జో రూట్ వన్డే బ్యాటర్ ర్యాంకింగ్స్‌లో నాలుగు స్థానాలు ఎగబాకి 8వ స్థానానికి చేరుకున్నాడు. ఇంగ్లండ్ తరఫున బెన్ డకెట్ 11 స్థానాలు ఎగబాకి సంయుక్తంగా 19వ స్థానానికి చేరుకున్నాడు. బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో ఆఫ్ఘనిస్తాన్ లెగ్ స్పిన్నర్ రషీద్ ఖాన్ తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. భారత్‌పై ఐదు 3 పడగొట్టిన ఇంగ్లండ్ ఫాస్ట్ బౌలర్ జోఫ్రా ఆర్చర్ ఒక స్థానం ఎగబాకి మూడో స్థానానికి చేరుకున్నాడు. వెస్టిండీస్ ఎడమచేతి వాటం స్పిన్నర్ గుడకేష్ మోతీ ఏడు స్థానాలు ఎగబాకి సంయుక్తంగా 9వ స్థానానికి చేరుకుని టాప్ 10లోకి ప్రవేశించాడు. భారత ఆటగాడు అక్షర్ పటేల్ కూడా 10 స్థానాలు ఎగబాకి సంయుక్తంగా 32వ స్థానానికి చేరుకుని గణనీయమైన పురోగతి సాధించాడు. బ్రేస్‌వెల్ ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో రెండు స్థానాలు ఎగబాకి తన కెరీర్‌లోనే అత్యుత్తమమైన మూడవ స్థానానికి చేరుకున్నాడు. ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన అజ్మతుల్లా ఒమర్జాయ్ ఈ విభాగంలో అగ్రస్థానంలో కొనసాగుతుండగా, బంగ్లాదేశ్ కెప్టెన్ మెహిదీ హసన్ మిరాజ్ రెండవ స్థానంలో నిలిచాడు.



## ప్రణేష్ చేతిలో గుకేశ్ ఓటమి

**న్యూఢిల్లీ:** చెన్నై గ్రాండ్ మాస్టర్స్‌లో ఎం. ప్రణేష్, ప్రపంచ ఛాంపియన్ డి. గుకేష్‌ను 39 ఎత్తులలో ఓడించి తన కెరీర్‌లోనే అతిపెద్ద విజయాన్ని కైవసం చేసుకున్నాడు. దీంతో గుకేష్ వరుసగా రెండవ ఓటమిని చవిచూశాడు. అనుకూలమైన స్థితిలో ఉండి ఎరిగైసి అర్జున్ చేతిలో ఓడిపోయిన మరుసటి రోజే, గుకేశ్ మళ్ళీ ప్రణేష్ చేతిలో తన ఆధిక్యాన్ని చేజార్చుకున్నాడు. కరోకాన్‌లో తెల్ల పావులతో ఆడుతున్న ప్రణేష్, మొదట్లో ఆ ఎత్తుగడ తనను ఒత్తిడికి గురిచేసినప్పటికీ, లాంగ్ కాస్లింగ్ చేసి సంక్లిష్టతలను కొనితెచ్చుకున్నాడు. గుకేష్ బలమైన క్యూసి7 మరియు ఎన్‌బి4 ఎత్తుగడలను ఎదుర్కొని, విజయం సాధించేందుకు దగ్గరగా కనిపించాడు. అయితే, డి3 వద్ద సరైన సమయంలో లభించిన పాన్ బ్రేక్ వంటి అవకాశాలను చేజార్చుకోవడంతో, అతను తన పొజిషన్‌ను సద్వినియోగం చేసుకోలేకపోయాడు. అతను తన రూక్‌ను బి5కు కదిపిన తర్వాత ప్రణేష్ తిరిగి పోటీలోకి వచ్చాడు, కానీ బి5 ఎత్తు ఆ యువ ఆటగాడిని పూర్తి నియంత్రణలో ఉంచింది.

# నేటి నుండి జింబాబ్వేతో టి20 సిరీస్

### టీమిండియాకు హ్యాట్రిక్ క్లీన్ స్వీప్ ముప్పు

### అదే బలహీన స్కెచ్‌తో బరిలోకి జింబాబ్వే



**న్యూఢిల్లీ:** ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనల్లో భారత బ్యాటింగ్ విభాగాన్ని కోలుకోలేని దెబ్బతీసిన బౌన్సర్ల ముప్పు, ఇప్పుడు జింబాబ్వే సిరీస్‌లోనూ టీమిండియాను తీవ్రంగా కలవరపెడుతోంది. పరుగుల వేటలో షార్ట్ పిచ్ బంతులను ఎదుర్కోలేక పదే పదే వికెట్లు పారేసుకుంటున్న టీమిండియా యువ బ్యాటర్లపై ఈ నెల 23 నుండి హరారే వేదికగా ప్రారంభమవుతున్న టీ20 సిరీస్‌లో మరోసారి పేస్ దండయాత్రకు ప్రత్యర్థి వ్యూహాలు రచిస్తోంది. ఇటీవల ముగిసిన ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనల్లో టీమిండియా ఎదుర్కొన్న వరుస ఓటములకు ప్రధాన కారణం బ్యాటర్ల వైఫల్యమే. ప్రత్యర్థి ఫాస్ట్ బౌలర్లు సంధించిన పవర్ ఫుల్ షార్ట్ పిచ్ బంతులను అంచనా వేయడంలో టీమిండియా బ్యాటర్లు ఘోరంగా తడబడ్డారు. ఈ బలహీనతను పసిగట్టిన జింబాబ్వే బౌలర్లు కూడా అదే అస్త్రాన్ని ఉపయోగించేందుకు సిద్ధమయ్యారు. హరారే మైదానంలోని పిచ్‌లు ఎంతో వేగంతో పాటు అధిక ఉత్సాహపూరితమైన ఎత్తు (బౌన్స్) కలిగి ఉంటాయి. ఇది ప్రత్యర్థి ఫాస్ట్ బౌలర్లకు కొండంత బలాన్ని ఇవ్వనుంది. యూకే సిరీస్‌లో భారత ఆటగాళ్ల పరాభవాన్ని నిశితంగా గమనించిన జింబాబ్వే యాజమాన్యం, తమ జట్టులోని ధాటిగా బౌలింగ్ చేసే ఫాస్ట్ బౌలర్లను రంగంలోకి దించుతోంది. ముఖ్యంగా ఎడమచేతి వాటం ఫాస్ట్ బౌలర్ రిచర్డ్ ఎన్గారవా తన యార్కర్లతో పాటు షార్ట్ బంతులతో విరుచుకుపడటంలో దిట్ట. ఇటీవల బంగ్లాదేశ్‌పై హరారేలోనే జరిగిన టీ20 సిరీస్‌లో కేవలం మూడు మ్యాచ్‌ల్లోనే 8 వికెట్లు తీసి ప్రత్యర్థులను వణికించాడు. అతనితో పాటు, పొడవాటి బౌలర్ బ్లెస్సింగ్ ముజరబానీ కూడా భారత బ్యాటర్లకు పెద్ద ముప్పుగా మారనున్నాడు. బంగ్లాదేశ్ సిరీస్‌లో కేవలం 5.75 ఎకానమీతో అత్యంత పొదుపుగా బౌలింగ్ చేసి కీలక వికెట్లు పడగొట్టాడు. వీరిద్దరితో పాటు మరో ఫాస్ట్ బౌలర్ బ్రాడ్ ఈవాన్స్ కూడా తన వేగవంతమైన షార్ట్ బంతులతో భారత ఆటగాళ్లను ఇబ్బంది పెట్టేందుకు సిద్ధంగా ఉన్నాడు.

ఈ పరిస్థితుల్లో భారత జట్టులోని పలువురు కీలక ఆటగాళ్లు ఇటీవల షార్ట్ బంతులకు వికెట్లు సమర్పించుకోవడం ఆందోళన కలిగిస్తోంది. వైభవ్ సూర్యవంశీతో పాటు వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ ఈ రకమైన బంతులను ఎదుర్కొనే క్రమంలో ఒత్తిడికి లోనవుతున్నారు.

వీరితో పాటు విస్ఫోటక ఓపెనర్ అభిషేక్ శర్మ, ఆల్‌రౌండర్ శివమ్ దూబే కూడా షార్ట్ పిచ్ బంతులకు ఔట్ కావడం గమనార్హం. జింబాబ్వేతో జరిగే ఈ మ్యాచ్‌లలో మన ఆటగాళ్లు తమ లోపాలను ఎంత త్వరగా సరిదిద్దుకుని, సాంకేతికతను మెరుగుపరుచుకుంటారో అనే దానిపైనే సిరీస్ ఫలితం ఆధారపడి ఉంటుంది.

## ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లో
## నిరాశతో ప్రారంభించిన భారత్ షూటర్లు

**న్యూఢిల్లీ:** ఆసియా క్రీడల తొలి రోజున చైనా పతకాలను కైవసం చేసుకోగా, ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ కప్ ఆఖరి సన్నాహక మ్యాచ్‌లో భారత షూటర్లు తడబడ్డారు. ఈ ఈవెంట్‌లో భారత షూటర్లకు నిరాశాజనకమైన ఆరంభం లభించింది, దేశానికి చెందిన రెండు 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ జట్లలో ఏదీ కూడా క్వాలిఫికేషన్ దశను దాటి ముందుకు సాగలేకపోయింది. బుధవారం జరిగిన ప్రపంచ కప్ తొలిరోజు ఆతిథ్య చైనా ఆధిపత్యం చెలాయించి, అందుబాటులో ఉన్న రెండు స్వర్ణ పతకాలనూ కైవసం చేసుకోగా, భారత్ పతకం లేకుండానే సరిపెట్టుకుంది. పలు ప్రపంచ కప్ స్వర్ణ పతక విజేతలైన సురుచి ఇందర్ సింగ్, కేదార్లింగ్ ఉచగన్వేల జోడి 577 మొత్తం స్కోరుతో తొమ్మిదో స్థానంలో నిలిచింది. ఇందులో సురుచి 292, కేదార్లింగ్ 285 స్కోరు సాధించారు.

కేవలం మొదటి నాలుగు జట్లు మాత్రమే ముందుకు వెళ్లే క్రమంలో, చైనా రెండు ఫైనల్ స్థానాలను దక్కించుకోవడం ద్వారా తన ఆధిపత్యాన్ని చాటుకుంది. వీరిలో ఒకరైన యావో కియాన్‌క్సున్ మరియు హు కై కలిసి 591 స్కోరు సాధించి క్వాలిఫికేషన్ ప్రపంచ రికార్డును బద్దలు కొట్టారు. భారత్‌కు చెందిన రెండవ జోడీ సైన్యం, కమల్‌జీత్ కూడా 577 పరుగులు చేసినప్పటికీ, వరుసగా 288, 289 స్కోర్లతో 11వ స్థానంతో సరిపెట్టుకోవలసి వచ్చింది.



### ముడిచమురు, టారిఫ్ ఎఫెక్ట్:
# ఇన్వెస్టర్ల సంపద 4.2 లక్షలకోట్లు ఆవిరి
### నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ




**ముంబయి,జులై 22:** అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు భారీగా పెరగడం, ఇరాన్‌కు సంబంధించిన భౌగోళిక ఉద్రిక్తతలు మరింత తీవ్రరూపం దాల్చడం, అమెరికా ప్రకటించిన కొత్త టారిఫ్ విధానం ప్రభావంతో భారత స్టాక్ మార్కెట్లు బుధవారం భారీ నష్టాలతో ముగిశాయి. గత 10 ట్రేడింగ్ సెషన్లలో ఇదే అతిపెద్ద పతనంగా నమోదైంది. మార్కెట్ పతనంతో పెట్టుబడిదారుల సంపదలో సుమారు రూ.4.2 లక్షల కోట్లు ఆవిరైనట్లు బీఎస్ఈ గణాంకాలు వెల్లడించాయి. నిఫ్టీ 50 సూచీ 191.45 పాయింట్లు కోల్పోయి 23,996.25 వద్ద ముగియగా, సెన్సెక్స్ 715.06 పాయింట్లు పడిపోయి 76,755.05 వద్ద స్థిరపడింది. వరుసగా మూడో ట్రేడింగ్ సెషన్‌లోనూ ప్రధాన సూచీలు నష్టాల్లోనే ముగిశాయి.అమెరికా మరోసారి ఇరాన్‌పై వైమానిక దాడులు జరపడంతో ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు ఒక్కసారిగా ఎగిశాయి. ఇదే సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దిగుమతి చేసుకునే జనరిక్ ఔషధాలపై దశలవారీగా భారీ టారిఫ్‌లు విధించనున్నట్లు ప్రకటించడం కూడా పెట్టుబడిదారుల ఆందోళనను పెంచింది. ఇరాన్‌కు సంబంధించిన భౌగోళిక పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారే అవకాశాలు ఉండటంతో మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడి పెరిగింది.ముడి చమురు ధరలకు మళ్లీ జోష్‌అమెరికా వరుసగా 11వ రాత్రి కూడా ఇరాన్‌పై సైనిక దాడులు నిర్వహించడంతో బుధవారం అంతర్జాతీయ ముడి చమురు ధరలు దాదాపు 4 శాతం ఎగిశాయి.ప్రపంచ ప్రమాణమైన బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 3.5 శాతం పెరిగి 94.20 డాలర్లకు చేరగా, అమెరికా వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ క్రూడ్ ధర 3.8 శాతం పెరిగి 87.56 డాలర్ల వద్ద ట్రేడైంది. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దిగుమతి చేసుకునే జనరిక్ ఔషధాలపై కొత్త టారిఫ్ విధానాన్ని ప్రకటించారు. దీనితో ఫార్మా రంగ షేర్లపై కూడా ఒత్తిడి పెరిగింది.ట్రంప్ ప్రకటించిన ప్రణాళిక ప్రకారం వచ్చే ఆగస్టు 1 నుంచి వచ్చే రెండేళ్ల పాటు దిగుమతి జనరిక్ ఔషధాలపై సున్నా శాతం టారిఫ్ కొనసాగుతుంది. ఆ తరువాత ఒక సంవత్సరం పాటు 100 శాతం టారిఫ్ అమల్లోకి వస్తుంది.అనంతరం 200 శాతం టారిఫ్ విధించబడుతుంది.ఈ నిర్ణయం భారతీయ జనరిక్ ఔషధ ఎగుమతులపై భవిష్యత్తులో ప్రభావం చూపే అవకాశం ఉందనే ఆందోళనతో మార్కెట్లలో ప్రతికూల ప్రభావం కనిపించింది. మార్కెట్లకు ప్రధానంగా ఐసిఐసిఐబ్యాంకు 1.60శాతం, రిలయన్స్ 1.51శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 0.99శాతం నిఫ్టీపై ఒత్తిడి తెచ్చాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్ 1.05శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 1.39శాతం క్షీణించింది. బిఎస్ఇలో 1458 కంపెనీలు పెరిగితే 2780 కంపెనీలు క్షీణించాయి. 193 స్థిరంగా కొనసాగాయి. బ్రెంట్‌ముడిచమురు సెప్టెంబరు ఫ్యూచర్‌ధరలు బ్యారెల్‌కు 94.77 డాలర్లుగా ఉన్నాయి. డాలరుతో రూపాయి మారకం విలువలు 96.59గా నడిచింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్ల 1.22శాతంపెరిగి రూ.1,44,623కి చేరాయి.




### వార్ ఎఫెక్ట్:
# బ్రెంట్ ముడిచమురు బ్యారెల్ 95.19 డాలర్లు

**ముంబయి,జులై 22:** అమెరికాఇరాన్ మధ్య సైనిక ఉద్రిక్తతలు మరింత తీవ్రమవుతుండటంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు బుధవారం భారీగా పెరిగాయి. బ్రెంట్ క్రూడ్ ధర ఆరు వారాల తర్వాత తొలిసారిగా బ్యారెల్‌కు 95 డాలర్ల మార్కును దాటి ట్రేడవుతూ ప్రపంచ ఇంధన మార్కెట్లలో ఆందోళనలను పెంచింది. మధ్యప్రాచ్య ప్రాంతం నుంచి చమురు సరఫరాలకు అంతరాయం ఏర్పడే అవకాశాలపై పెట్టుబడిదారులు ఆందోళన చెందడంతో ధరలు వేగంగా పెరిగాయి.రియల్‌టైమ్ మార్కెట్ డేటా ప్రకారం భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3:15 గంటల సమయంలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్‌కు 95.19 డాలర్ల వద్ద ట్రేడవుతూ 4.23 శాతం లాభాన్ని నమోదు చేసింది. ఇదే సమయంలో అమెరికా ప్రమాణ ముడి చమురు వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ ధర కూడా గణనీయంగా పెరిగింది. అమెరికాదాడులతో ముడి చమురు ధరల పెరుగుదల మరింత వేగం అందుకుంది.ఇక ఎర్ర సముద్రం ప్రాంతంలో కూడా ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. ఇరాన్ మద్దతు ఉన్న యెమెన్ హౌతీ తిరుగుబాటు దళాలు, సౌదీ అరేబియాతో సంబంధాలు ఉన్న నౌకలపై నౌకాదళ దిగ్బంధనం విధిస్తామని హెచ్చరించాయి. ఈ హెచ్చరికల నేపథ్యంలో కొన్ని చమురు ట్యాంకర్లు తమ ప్రయాణ మార్గాలను మార్చుకున్నట్లు వార్తలు వచ్చాయి. ప్రపంచంలోనే అతిపెద్ద చమురు ఉత్పత్తి ప్రాంతాల్లో ఒకటైన మధ్యప్రాచ్యం నుంచి ముడి చమురు ఎగుమతులకు అంతరాయం ఏర్పడే అవకాశాలపై ఆందోళనలు పెరిగాయి. ఇదిలా ఉండగా, ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి గుండా ప్రయాణించేందుకు ప్రయత్నించిన నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన రెండు చమురు ట్యాంకర్లను అడ్డుకుని నిలిపివేసినట్లు ఇరాన్ ప్రకటించింది. దీంతో ప్రపంచ చమురు సరఫరాలపై కొత్త ఆందోళనలు నెలకొన్నాయి.తాజా పరిణామాల నేపథ్యంలో బ్రెంట్ క్రూడ్ ధరలు జూన్ ప్రారంభం తర్వాత అత్యధిక స్థాయికి చేరుకున్నాయి. అమెరికాఇరాన్ మధ్య ఘర్షణలు మరింత ముదిరితే ప్రపంచ చమురు సరఫరాలకు దీర్ఘకాలిక అంతరాయం ఏర్పడే ప్రమాదాన్ని మార్కెట్లు ముందుగానే అంచనా వేస్తూ ధరలను పెంచుతున్నాయని మార్కెట్ నిపుణులుఅంచనావేస్తున్నారు.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.